thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. No. TELTEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

సర్పంచ్ సాబ్ సత్తాకు పరీక్ష



11

# చురకలు

Published From Jagital, Hyderabad, Adilabad, Warangal

| సంపుటి : 21 | సంచిక : 99 | జగిత్యాల | బుధవారం | 08 జూలై, 2026 | ఎడిటర్ : మొహ్మద్ ఇమ్రాన్| పేజీలు 12 + 8 జిల్లా అనుబంధం | వెల : 1.00 |

# అహ్మదాబాద్ పేలుళ్ల కేసులో ..
# 38 మందికి ఉరిశిక్ష





- 18 ఏళ్ల తర్వాత బాధితులకు న్యాయం
- ప్రత్యేక కోర్టు తీర్పును సమర్థించిన గుజరాత్ హైకోర్టు
- 11 మందికి యావజ్జీవ శిక్ష యథాతథం
- మృతుల కుటుంబాలకు రూ.10 లక్షల పరిహారం

అహ్మదాబాద్, జూలై 7

2008లో దేశవ్యాప్తంగా తీవ్ర సంచలనం సృష్టించిన అహ్మదాబాద్ వరుస బాంబు పేలుళ్ల కేసులో గుజరాత్ హైకోర్టు కీలక తీర్పు వెలువరించింది. ప్రత్యేక న్యాయస్థానం గతంలో విధించిన శిక్షలను సమర్థిస్తూ 38 మంది దోషులకు మరణశిక్షను ఖరారు చేసింది. మరో 11 మందికి విధించిన యావజ్జీవ కారాగార శిక్షను కొనసాగించింది. పేలుళ్లలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు, గాయపడిన బాధితులకు నష్టపరిహారం చెల్లించాలని కూడా ఆదేశాలు జారీ చేసింది.

**70 నిమిషాల్లో 21 పేలుళ్లు**

2008 జూలై 26న అహ్మదాబాద్ నగరంలో కేవలం 70 నిమిషాల వ్యవధిలో 21 చోట్ల బాంబులు పేలాయి. రద్దీగా ఉండే మార్కెట్లు, నగర బస్సులు, ఆసుపత్రులను లక్ష్యంగా చేసుకుని ఈ దాడులు జరిగాయి. పేలుళ్లలో 56 మంది మరణించగా, 200 మందికి పైగా గాయపడ్డారు. సైకిళ్లకు అమర్చిన టిఫిన్ బాక్సుల్లో పేలుడు పదార్థాలను ఉంచి దాడులకు పాల్పడినట్లు దర్యాప్తులో తేలింది. అనంతరం అహ్మదాబాద్, సూరత్ ప్రాంతాల్లో మరికొన్ని పేలని బాంబులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

**దీర్ఘకాల విచారణ**

ఈ ఘటనకు సంబంధించి మొత్తం 78 మందిపై 35 కేసులు నమోదు చేశారు. కేసు విచారణ కోసం ప్రత్యేక న్యాయస్థానాన్ని ఏర్పాటు చేశారు. సుమారు 14 సంవత్సరాలపాటు సాగిన విచారణ అనంతరం 2022 ఫిబ్రవరిలో ప్రత్యేక

మిగతా 3వ పేజీలో..

## డిజిటల్ గవర్నెన్స్ దిశగా ముందుకు

- క్షేత్రస్థాయి అధ్యయనానికి కమిటీ
- వంద రోజుల్లో కొలిక్కి తీసుకురావాలి
- కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలపై సీఎం సమీక్ష



హైదరాబాద్, జూలై 7 :

పరిపాలనలో మరింత పారదర్శకతకు డిజిటల్ గవర్నెన్స్ దిశగా చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులకు సూచించారు. ఇందుకు సంబంధించి ప్రణాళికలు సిద్ధం చేయడంతోపాటు అవసరమైన చట్టాలను రూపొందించాలని

మిగతా 2వ పేజీలో..

## కవితకు కలిసి రాని టీఆర్ఎస్



కొత్త పార్టీకి పేరు చిక్కులు..
టీఆర్ఎస్ పేరుకు ఈసీ నిరాకరణ
ప్రత్యామ్నాయ పేర్లు సూచించాలని ఆదేశాలు
'జాగృతి' వైపు చూపు?
న్యాయపోరాటమా.. లేక కొత్త పేరుతో ముందుకా?
రాజకీయ వర్గాల్లో 'జాగృతి' పేరుపై చర్చ

హైదరాబాద్, జూలై 7 :

బీఆర్ఎస్‌ను వీడి సొంత రాజకీయ ప్రస్థానం ప్రారంభించిన కల్వకుంట్ల కవిత తొలి అడుగులోనే పార్టీ పేరు

మిగతా 2వ పేజీలో..

### కవిత పార్టీ పేరుపై ఢిల్లీ హైకోర్టు ట్విస్ట్

- టీఆర్ఎస్ సంక్షిప్త నామంపై వెంటనే జోక్యం చేసుకోబోమన్న కోర్టు
- ఈసీ ముందు వివరణ ఇవ్వాలని కవితకు సూచన
- వ్యక్తిగత వాదనకు అవకాశం కల్పించాలని ఎన్నికల సంఘానికి ఆదేశం

2



## మొబైల్ అంగన్వాడి కేంద్రాలకు శ్రీకారం

- ప్రతి చిన్నారికి సేవలే లక్ష్యంగా ప్రభుత్వ వినూత్న కార్యక్రమం
- వలస కార్మికుల పిల్లలకు పోషకాహారం, ప్రీ-స్కూల్ విద్య అందుబాటులోకి
- మొదటి దశలో మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో ప్రారంభం

3

## తాగునీటి సమస్య రానివ్వం: మంత్రి సీతక్క

- వర్షాభావ పరిస్థితులపై ఉన్నతస్థాయి సమీక్ష
- ప్రతి గ్రామానికి నిరంతరాయ నీటి సరఫరాపై ఆదేశాలు
- ప్రత్యామ్నాయ ఏర్పాట్లు సిద్ధంగా ఉంచాలని సూచన
- జలాశయాల నీటి మట్టాలపై నిరంతర పర్యవేక్షణ

3

## రెవెన్యూ శాఖ బలోపేతమే లక్ష్యం

- రూ.360 కోట్లతో శాశ్వత భవనాలు
- 10 ఆర్డీవో, 107 తహసిల్దార్, 53 సబ్ రిజిస్ట్రార్ భవనాల నిర్మాణం
- రెవెన్యూ మంత్రి పొంగులేటి



హైదరాబాద్, జూలై 7 :

రాష్ట్రంలో రెవెన్యూ పాలనను మరింత బలోపేతం చేయడంతోపాటు ప్రజలకు ఆధునిక, గౌరవప్రదమైన సేవలందించాలనే లక్ష్యంతో దశలవారీగా తహసీల్దార్, ఆర్డీవో, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు శాశ్వత భవనాల నిర్మాణాన్ని

మిగతా 2వ పేజీలో..

## ఏఐలో ప్రపంచానికి దిక్సూచిగా తెలంగాణ



- బాధ్యతాయుత సాంకేతికతకు కేరాఫ్ అడ్రస్ హైదరాబాద్
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

హైదరాబాద్, జూలై 7 :

కృత్రిమ మేధస్సు(ఏఐ) రంగంలో ప్రపంచ దేశాలకు తెలంగాణ సరికొత్త దిశానిర్దేశం చేస్తోందని, కేవలం పెట్టుబడులను ఆకర్షించడమే కాక పర్యావరణ

మిగతా 2వ పేజీలో..



## కేంద్ర మంత్రివర్గ విస్తరణకు బ్రేక్?

పార్లమెంట్ సమావేశాలపై ఫోకస్..
వర్షా కాల సమావేశాల షెడ్యూల్ ప్రకటనతో చర్చ
శాసన కార్యక్రమాలకే కేంద్రం ప్రాధాన్యం
రాజ్యాంగ సవరణ బిల్లులపై ప్రభుత్వం దృష్టి
సమావేశాల తర్వాతే మంత్రివర్గ విస్తరణపై నిర్ణయం?

4

## పట్నం, మేడ్చల్, మహేశ్వరంలకు మహర్దశ

- రూ.338 కోట్లతో నాలుగు లేన్ల ఆధునిక రహదారులు
- నిర్మాణానికి శంకుస్థాపన చేసిన మంత్రి కోమటిరెడ్డి



రంగారెడ్డి, జూలై 7:

ఇబ్రహీంపట్నం, మేడ్చల్, మహేశ్వరం నియోజకవర్గాల్లో హైబ్రిడ్ అన్యుటీ మోడల్ విధానంలో రూ.338 కోట్ల వ్యయంతో చేపట్టనున్న ఆధునిక నాలుగు లేన్ల రహదారుల నిర్మాణ పనులకు రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

మిగతా 3వ పేజీలో..




## కడియంపై క్రమశిక్షణ చర్య తీసుకోవాల్సిందే

- నాకు తెలియకుండా ఎలా సమీక్షలు చేపడతారు
- మంత్రిగా తన శాఖలో జోక్యం చేసుకోవడం ఏమిటి
- సీఎం రేవంత్‌కు మంత్రి సురేఖ లేఖ

2

## ప్రజలకు చేరువగా పోలీసింగ్.. సాంకేతికతతో నేర నియంత్రణ

- నిజాయితీ, నిష్పాక్షికతతో విధులు నిర్వహించాలి
- సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి:
- డీజీపీ సీవీ ఆనంద్



2

## కవిత పార్టీ పేరుపై ఢిల్లీ హైకోర్టు ట్విస్ట్

**న్యూఢిల్లీ, జూలై 7**

కొత్త రాజకీయ పార్టీ పేరుకు సంబంధించి మాజీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత దాఖలు చేసిన పిటిషన్‌పై ఢిల్లీ హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. తన పార్టీకి తెలంగాణ రక్షణ సమితి లేదా తెలంగాణ రక్షణ సేన పేరును నమోదు చేసి, టీఆర్ఎస్ సంక్షిప్త నామాన్ని కేటాయించేలా ఎన్నికల సంఘాన్ని ఆదేశించాలని కోరిన పిటిషన్‌పై నేరుగా జోక్యం చేసుకోవడానికి హైకోర్టు నిరాకరించింది. ఎన్నికల సంఘం నిర్ణయ ప్రక్రియలో ఈ దశలో జోక్యం చేసుకోవడం సముచితం కాదని స్పష్టం చేసింది.

**ఈసీ అభ్యంతరాలపై వివరణ కోరిన కోర్టు**

కవిత కొత్త పార్టీ పేరుకు సంబంధించి ఎన్నికల సంఘానికి దరఖాస్తు చేయగా, టీఆర్ఎస్ సంక్షిప్త నామంతో పోలిక ఉన్న పేరుపై వెయ్యికి పైగా అభ్యంతరాలు వచ్చినట్లు ఈసీ తెలియజేసింది. ఈ నేపథ్యంలో ప్రత్యామ్నాయ పేర్లను సూచించాలని కోరుతూ నోటీసులు జారీ చేసింది. అయితే ఈసీ నిర్ణయాన్ని సవాలు చేస్తూ కవిత నేరుగా ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. తెలంగాణ ఉద్యమంతో టీఆర్ఎస్ పేరుకు తమకు అనుబంధం ఉందని, ఆ సంక్షిప్త నామాన్ని వినియోగించే హక్కు తమకూ ఉందని ఆమె తరపు న్యాయవాది కోర్టులో వాదించారు.

**ఎన్నికల సంఘం స్వతంత్ర అధికారాలపై వ్యాఖ్యలు**

విచారణ సందర్భంగా టీఆర్ఎస్ సంక్షిప్త నామానికి దగ్గరగా ఉండే పేరును అనుమతించాలా వద్దా అనే అంశం ఎన్నికల సంఘం పరిధిలోని విషయమని హైకోర్టు పేర్కొంది. ఇప్పటికే టీఆర్ఎస్ పేరుతో పోలిక ఉన్న ఇతర రాజకీయ సంస్థలు నమోదై ఉన్నాయని, అలాగే బీఆర్ఎస్ కూడా ఈ అంశంపై అభ్యంతరాలు వ్యక్తం చేసిందని ఎన్నికల సంఘం తరపు న్యాయవాది కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. ఈ నేపథ్యంలో నేరుగా ఆదేశాలు జారీ చేయడం సరికాదని న్యాయస్థానం అభిప్రాయపడింది.

**వ్యక్తిగత వాదనకు అవకాశం**

అయితే కవితకు హైకోర్టు తాత్కాలిక ఊరటనిచ్చింది. ఎన్నికల సంఘం జారీ చేసిన నోటీసులకు వారం రోజుల్లోగా రాతపూర్వక వివరణ సమర్పించాలని సూచించింది. ఆ వివరణ అందిన తర్వాత ఏకపక్షంగా నిర్ణయం తీసుకోకుండా, కవితకు వ్యక్తిగతంగా తన వాదనలు వినిపించే అవకాశం కల్పించి అనంతరం తుది నిర్ణయం తీసుకోవాలని ఎన్నికల సంఘాన్ని ఆదేశించింది. పార్టీ పేరు వ్యవహారంలో ఎన్నికల సంఘం తుది నిర్ణయం ఎలా ఉంటుందన్నది ఇప్పుడు రాజకీయ వర్గాల్లో ఆసక్తికరంగా మారింది. టీఆర్ఎస్ సంక్షిప్త నామం లభించకపోతే కవిత ప్రత్యామ్నాయ పేరుతో ముందుకు వెళ్తారా అనే అంశంపైనా చర్చ కొనసాగుతోంది.

## కవితకు కలిసి రాని టీఆర్ఎస్

మొదటిపేజీ తరువాయి

వివాదంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) పేరుతో కొత్త పార్టీని ప్రకటించినప్పటికీ, ఆ పేరుకు కేంద్ర ఎన్నికల సంఘం అనుమతి నిరాకరించడం రాజకీయంగా చర్చనీయాంశమైంది. పెద్ద సంఖ్యలో అభ్యంతరాలు రావడంతో ఆ పేరును తిరస్కరించిన ఈసీ, 15 రోజుల్లో మూడు ప్రత్యామ్నాయ పేర్లను సూచించాలని ఆదేశించినట్లు సమాచారం.

**న్యాయపోరాటంపై దృష్టి**

ఈసీ నిర్ణయాన్ని న్యాయస్థానంలో సవాలు చేస్తానని కవిత ప్రకటించినట్లు తెలుస్తోంది. అయితే కొత్త పార్టీ ప్రారంభ దశలోనే పేరు వివాదం కోర్టుల వరకు వెళ్లడం కేడర్‌లో, ప్రజల్లో అయోమయానికి దారితీసే అవకాశముందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. పార్టీ పేరుపై స్పష్టత లేకపోతే సంస్థాగత నిర్మాణం, ప్రచార కార్యక్రమాలపై కూడా ప్రభావం పడే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. చివరకు పేరు మార్చాల్సిన పరిస్థితి వస్తే మరింత గందరగోళం నెలకొనే అవకాశం ఉందని భావిస్తున్నారు.

**'జాగృతి' పేరుపై చర్చ**

కవిత కొత్త పార్టీ ఏర్పాటు చేయనున్నట్లు వార్తలు వచ్చినప్పటి నుంచి ఆమె చాలా కాలంగా నిర్వహిస్తున్న తెలంగాణ జాగృతి సంస్థనే రాజకీయ పార్టీగా మార్చవచ్చనే ప్రచారం జరిగింది. అయితే అనూహ్యంగా టీఆర్ఎస్ పేరును ఎంచుకోవడంతో పరిస్థితి మారింది. తెలంగాణ ఉద్యమ కాలంలో బతుకమ్మ వంటి సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా తెలంగాణ జాగృతి రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు పొందింది. గ్రామ, మండల స్థాయిలో కూడా ఈ సంస్థకు విస్తృత స్థాయిలో కార్యకర్తల నెట్‌వర్క్ ఉందని రాజకీయ వర్గాలు పేర్కొంటున్నాయి.

**త్వరగా స్పష్టత అవసరం**

ఇప్పటికే ప్రజల్లో గుర్తింపు పొందిన తెలంగాణ జాగృతి లేదా దానికి సమానమైన పేరుతో పార్టీని ముందుకు తీసుకెళితే రాజకీయంగా ప్రయోజనం ఉంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. చట్టపరమైన వివాదాల్లో సమయం వృథా చేసుకోవడం కంటే, అందుబాటులో ఉన్న ప్రత్యామ్నాయాన్ని ఎంచుకుని సంస్థాగత బలోపేతంపై దృష్టి పెట్టడం మంచిదని కొందరు రాజకీయ విశ్లేషకులు సూచిస్తున్నారు. అయితే పార్టీ పేరుపై కవిత ఎలాంటి నిర్ణయం తీసుకుంటారన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

## రెండున్నరేళ్లయినా రేవంత్‌కు పాలనపై పట్టు లేదు

- **బీజేపీ ఎంపీ లక్ష్మణ్**

**హైదరాబాద్, జూలై 7:**

అధికారంలోకి వచ్చి 30 నెలలు గడుస్తున్నా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనపై కనీస పట్టు సాధించలేకపోయారని బీజేపీ రాజ్యసభ సభ్యుడు, ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు కె.లక్ష్మణ్ తీవ్రంగా మండిపడ్డారు. ముఖ్యమంత్రి స్వయంగా బాధ్యతలు నిర్వహిస్తున్న విద్యా, హోం, మున్సిపల్ శాఖలు పూర్తిగా అస్తవ్యస్తంగా మారాయని, రాష్ట్రంలో అభివృద్ధి అనేది మచ్చుకైనా కనిపించడం లేదని విమర్శించారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రజాసమస్యల పరిష్కారం, సంక్షేమాన్ని విస్మరించి,ఎంతసేపూ తమ హైకమాండ్ మెప్పు కోసం ఢిల్లీ పెద్దలను ప్రసన్నం చేసుకుని తన పదవిని కాపాడుకోవడంపైనే ఆరాటపడుతున్నారని దుయ్యబట్టారు. రాష్ట్రంలో పాలన ఏ రకంగా పడకేసిందో చెప్పడానికి ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల బదిలీలే నిదర్శనమని లక్ష్మణ్ పేర్కొన్నారు. ఈ 30 నెలల కాలంలోనే రికార్డు స్థాయిలో 24 సార్లు మేజర్ బదిలీలు చేపట్టడం దారుణమన్నారు. సీఎం అనాలోచిత నిర్ణయాల వల్ల అధికారులు ఒక జిల్లాలో లేదా ఒక శాఖలో స్థిరపడి పాలనపై దృష్టి పెట్టి పట్టు సాధించుకునే లోపే మళ్ళీ బదిలీ వేటుకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. హైదరాబాద్, వరంగల్, రంగారెడ్డి, ఖమ్మం, నిజామాబాద్ వంటి పెద్ద జిల్లాల కలెక్టర్లను ఒకటి కంటే ఎక్కువసార్లు బదిలీ చేశారంటే, ప్రభుత్వానికి అధికారులపై నమ్మకం లేదనే విషయం స్పష్టమవుతోంది. దీనివల్ల అధికార యంత్రాంగం పనులపై దృష్టి పెట్టలేకపోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి సచివాలయానికి రావడం చాలా అరుదుగా మారిందని, 71 సార్లు దిల్లీ పర్యటనలు చేయడాన్ని చూస్తుంటే రాష్ట్ర పాలన సచివాలయం నుండి జరుగుతున్నదా, దిల్లీ నుండి జరుగుతుల్లున్నదా లేదా దారుస్సలాం నుండి జరుగుతుశ్రీప్రశ్రీదా అనే అనుమానాలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయని ఎద్దేవా చేశారు.మరోవైపు రాష్ట్రంలో శాంతి భద్రతలు పూర్తిగా క్షీణించాయని, హైదరాబాద్ నగరంతో పాటు జిల్లాలు సైతం డ్రగ్ మాఫియా గుప్పిట్లోకి వెళ్ళిపోయాయని డా. కె. లక్ష్మణ్ ఆందోళన వ్యక్తం చేశారు. రియల్ ఎస్టేట్ రంగం పూర్తిగా కుప్పకూలి నిర్మాణాలు ఎక్కడికక్కడ ఆగిపోయాయని తెలిపారు. భారత ఎన్నికల సంఘం దేశవ్యాప్తంగా చేపట్టిన ఓటర్ల ప్రక్షాళన (ఎసఐఆర్) ప్రక్రియను తెలంగాణలోని కాంగ్రెస్, బీఆర్ఎస్, ఎంఐఎం పార్టీలు తమ రాజకీయ మనుగడ కోసం వివాదాస్పదం చేస్తూ, ప్రజలను గందరగోళపరుస్తున్నాయని లక్ష్మణ్ మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం మరియు ఆ పార్టీ నాయకులు కేవలం మజ్లిస్ ప్రాపకం కోసం బాధ్యతారహిత వ్యాఖ్యలు చేస్తూ ఓటర్ల ప్రక్షాళనను నీరుగార్చే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. 'ఒక వ్యక్తికి ఒకే ఓటు' ఉండాలనేది చట్టబద్ధమైన విధానమని, బోగస్ ఓట్లు, దొంగ ఓట్లను తొలగించడమే ఈ ప్రక్రియ ముఖ్య ఉద్దేశమని గుర్తు చేశారు. హైదరాబాద్‌లో బంగ్లాదేశీయులు, రోహింగ్యాలు పెద్దఎత్తున చొరబడి దొంగ ఓట్లు పొందితే, వారికి ఎంఐఎం నాయకుడు అసదుద్దీన్ ఒవైసీ పర్మనెంట్ రెసిడెన్స్ సర్టిఫికెట్లు ఇవ్వాలని డిమాండ్ చేయడం దుర్మార్గమన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు కేవలం ముస్లిం ఓట్ల కోసం మజ్లిస్‌కు వంతపాడుతూ దొంగ ఓట్లను కాపాడే ప్రయత్నం చేస్తున్నాయని మండిపడ్డారు.ఈ ప్రక్రియ జూన్ 24న ప్రారంభమై జులై 24తో ముగుస్తుందని, అయితే హైదరాబాద్‌లోనే 40% ఇళ్లకు ఇంకా ఎన్రోల్మెంట్ ఫామ్స్ అందలేదని క్షేత్రస్థాయి పరిశీలనలో తేలిందన్నారు. బీఎల్ ఓలు అధికార పక్షం మరియు ఎంఐఎం ఒత్తిళ్లకు లొంగిపోయి మసీదుల్లో ఏర్పాటు చేసిన క్యాంపుల్లోనే ఫారాలు తీసుకుంటున్నారని ఫైరయ్యారు.

## ప్రజలకు చేరువగా పోలీసింగ్..
# సాంకేతికతతో నేర నియంత్రణ

**ఖమ్మం, జూలై 7**

ప్రజలకు సత్వర న్యాయం అందించేలా, సాంకేతికతను సమర్థంగా వినియోగిస్తూ నేరాలను అరికట్టాలని తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ పోలీసు అధికారులను ఆదేశించారు. నిజాయితీ, నిష్పాక్షికత, ప్రజలకు అందుబాటులో ఉండే పోలీసింగ్‌నే లక్ష్యంగా పెట్టుకుని పనిచేయాలని సూచించారు. ఖమ్మంలో నిర్వహించిన నేరాల సమీక్ష సమావేశంలో జిల్లా పోలీసింగ్ పనితీరు, నేర నియంత్రణ చర్యలపై సమగ్ర సమీక్ష నిర్వహించి పలు కీలక ఆదేశాలు జారీ చేశారు.

**సైబర్ నేరాలపై అప్రమత్తం**

జిల్లాలో ఆర్థిక మోసాలు 30 శాతం, ఉద్యోగాల పేరుతో జరిగే మోసాలు 36 శాతం పెరిగినట్లు సమీక్షలో వెల్లడైంది. నకిలీ పత్రాల కేసులు కూడా పెరుగుతున్నాయని అధికారులు వివరించారు. ఈ ఏడాది సైబర్ నేరాలకు 711 మంది బాధితులై రూ.9.48 కోట్లు కోల్పోగా, అందులో రూ.1.41 కోట్లను పోలీసులు తిరిగి బాధితులకు అందించారు. ప్రజల్లో అవగాహన పెంచడంతో పాటు సైబర్ నేరాలపై మరింత అప్రమత్తంగా వ్యవహరించాలని డీజీపీ సూచించారు.

**మాదకద్రవ్యాలపై రాజీలేని పోరు**

మాదకద్రవ్యాల నిర్మూలనకు యుద్ధప్రాతిపదికన చర్యలు కొనసాగించాలని డీజీపీ ఆదేశించారు. ఈ ఏడాది జిల్లాలో 1,700 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. రాష్ట్రంలో అత్యధికంగా గంజాయి పట్టుబడుతున్న జిల్లాల్లో ఖమ్మం ఒకటిగా ఉందని పేర్కొంటూ, యువతను మాదకద్రవ్యాల బారిన పడకుండా కాపాడేందుకు మరింత కఠినంగా వ్యవహరించాలని సూచించారు.

**సాంకేతికతతో భద్రత బలోపేతం**

పర్యటన సందర్భంగా జిల్లా కమాండ్ సెంటర్‌కు అనుసంధానించిన 250 కొత్త సీసీ కెమెరాలు, కమిషనరేట్ సీసీ కెమెరాల కమాండ్ సెంటర్‌ను డీజీపీ ప్రారంభించారు. గ్రామాల్లో స్వచ్ఛందంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసిన ప్రజలను అభినందించారు. రోడ్డు భద్రతా పార్కును సందర్శించి విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. గత ఏడాది 317గా ఉన్న రోడ్డు ప్రమాదాల సంఖ్య ఈ ఏడాది 146కు తగ్గడం అభినందనీయమని పేర్కొన్నారు.

పోలీసులు చట్టానికి లోబడి నిష్పాక్షికంగా విధులు నిర్వహించాలని, పేదలు, బలహీన వర్గాలకు ముందుగా న్యాయం అందేలా పనిచేయాలని డీజీపీ సీవీ ఆనంద్ స్పష్టం చేశారు. రాత్రి గస్తీని మరింత బలోపేతం చేయడంతో పాటు ఇసుక, మట్టి అక్రమ రవాణా, రౌడీ మూకలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సీసీటీఎన్ఎస్ 3.0, హాక్ ఐ 3.0, టీజీ కాప్స్ 3.0 వంటి ఆధునిక సాంకేతిక వ్యవస్థలను సమర్థంగా వినియోగించాలని సూచించారు. త్వరలో ప్రత్యేక ట్రాఫిక్ నిర్వహణ బ్యూరోను ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు.

## డిజిటల్ గవర్నెన్స్ దిశగా ముందుకు

మొదటిపేజీ తరువాయి

ఆదేశించారు. ఎంసీఆర్ హెచఆర్డీలోని బోధి పెవిలియన్‌లో కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలపై సీఎం రేవంత్ రెడ్డి మంగళవారం సమీక్ష నిర్వహించారు. ప్రజలకు మెరుగైన సేవలను అందించడంతోపాటు సంక్షేమ పథకాలు నేరుగా లబ్దిదారులకు చేర్చేందుకు డిజిటల్ గవర్నెన్స్ ఉపయోగపడుతుందని అభిప్రాయపడ్డారు. ప్రభుత్వ ఉద్యోగులతోపాటు కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఒకటో తేదీన జీతాలు అందించేందుకు వివిధ విభాగాల్లోని కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, జీతాలు, బ్యాంక్ అకౌంట్ వివరాలను పూర్తిగా డిజిటలైజ్ చేయాలన్నారు. రాష్ట్రంలో దాదాపు 4,800 కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఏజెన్సీలు ఉండగా ఇందులో 4,300 ఏజెన్సీలు ఉద్యోగులకు ఈఎసఐ, పీఎఫ్ చెల్లించడం లేదని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ఏజెన్సీలకు ప్రభుత్వం చెల్లింపులు చేసినా ఉద్యోగులకు సమయానికి జీతాలు చెల్లించడం లేదని తెలిపారు. దీనిపై ప్రభుత్వం సీరియస్‌గా ఉందని, అలాంటి ఏజెన్సీలపై కఠిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. డిజిటల్ గవర్నెన్స్‌తో సమస్యకు చెక్ పెట్టాలని సూచించారు. కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఒకటి నుంచి 5వ తేదీలోగా పారదర్శకంగా జీతాల చెల్లింపులు జరిపేందుకు డిజిటల్ గవర్నెన్స్ ఉపయోగపడుతుందన్నారు. అందుకే పూర్తి వివరాలను డిజిటలైజ్ చేయాలన్నారు. ఇందుకు వివిధ విభాగాల అధికారులతో ఒక కమిటీ ఏర్పాటు చేయాలని సూచించారు. కమిటీ వంద రోజుల్లో ఈ అంశాన్ని కొలిక్కి తీసుకు రావాలని ఆదేశించారు. హెల్త్ కార్డులు, ఇతర బెనిఫిట్స్ అమలుకు ప్రభుత్వ ఉద్యోగుల వివరాలను కూడా డిజిలైజ్ చేయాలన్నారు. నిరంతరం పర్యవేక్షించేందుకు ఆర్థిక శాఖ విభాగం ఆధ్వర్యంలో ఒక ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సమావేశంలో ఎంపీ వేం నరేందర్ రెడ్డి, సలహాదారు రామకృష్ణారావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, ఎంఏ అండ్ య□డీ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, సీఎం ప్రధాన కార్యదర్శి వి.శేషాద్రి, ఎంసీహెచఆర్డీ వైస్ చైర్మన్ శాంతికుమారి, వేతన సవరణ కమిషనర్ ఎన్.శివశంకర్, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, ప్రణాళికా విభాగం కార్యదర్శి గౌరవ్ ఉప్పల్, ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు.

## కడియంపై క్రమశిక్షణ చర్య తీసుకోవాల్సిందే

**హైదరాబాద్,జూలై 7:**

స్టేషన్ ఘన్‌పూర్ కాంగ్రెస్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తీరుపై దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి లేఖ రాశారు. దేవాదాయ శాఖ మంత్రిగా ఉన్న నన్ను, నా కార్యాలయాన్ని పూర్తిగా విస్మరించి, ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా కడియం శ్రీహరి కమిషనర్ ఆఫీస్‌లో అధికారిక సమీక్షా సమావేశం నిర్వహించారని ఫిర్యాదు చేశారు. మాస్టర్ ప్లాన్లు, శాఖాపరమైన నివేదికలపై ఆదేశాలు జారీ చేయడం మంత్రి పరిధిలోని అంశమని, ఒక ఎమ్మెల్యే దేవాదాయ శాఖ అధికారులను పిలిచి ఎలా ఆదేశిస్తారని సురేఖ ప్రశ్నించారు. కడియం శ్రీహరి చర్య ప్రభుత్వ పరిపాలనా వ్యవస్థలో అనుచిత సంప్రదాయానికి నాంది అని, ఇది కేవలం పరిపాలనా లోపం మాత్రమే కాదని, ఒక శాఖ మంత్రి అధికారాలను బహిరంగంగా ప్రశ్నించే కుట్ర అని ఆమె మండిపడ్డారు. గతంలోనూ ఉమ్మడి వరంగల్ జిల్లా నేతలను రెచ్చగొట్టి తనపై శ్రీహరి దుష్ప్రచారం చేశారని సురేఖ ఆరోపించారు. ఇప్పుడు కూడా ఉద్దేశపూర్వకంగానే తనను నిర్లక్ష్యం చేస్తూ ఆయన తీసుకుంటున్న చర్యల వల్ల శాఖ అధికార యంత్రాంగంలో తీవ్ర అయోమయం నెలకొందని సీఎం దృష్టికి తీసుకెళ్లారు. ప్రజాప్రతినిధిగా ఉంటూ ప్రభుత్వ నిబంధనలను, మంత్రి అధికారాలను అతిక్రమించిన కడియంపై పార్టీ క్రమశిక్షణా కమిటీ ద్వారా విచారణ జరిపించాలని, భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఆయనపై తగిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రిని సురేఖ కోరారు. మంత్రిగా తనకు సమాచారం ఇవ్వకుండా దేవాదాయ శాఖపరమైన సమీక్ష నిర్వహించారని, ఆయన సమీక్షించడం పరిపాలనా వ్యవస్థకు విరుద్ధమని పేర్కొన్నారు. శాఖ మంత్రిగా అన్ని అధికారాలు తనకే ఉంటాయాన్న సురేఖ.. కడియం వ్యవహారంపై పార్టీ, ప్రభుత్వ స్థాయిలో విచారణ చేపట్టాలని కోరారు. సమస్య ఉంటే మంత్రి, అధికారులకు వినతిపత్రం ఇవ్వాలి కానీ సమీక్ష నిర్వహించడం ఏంటని ప్రశ్నించారు.

## ఏఐలో ప్రపంచానికి దిక్సూచిగా తెలంగాణ

మొదటిపేజీ తరువాయి




పరిరక్షణ, సామాజిక ప్రయోజనాలను జోడించి 'ఏఐ ప్రమాణాలకు దిక్సూచి'గా తెలంగాణ నిలుస్తోందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రకటించారు. హైదరాబాద్‌లోని హెచఐసిసి వేదికగా జరిగిన 'గ్రీన్ గ్రోత్ ఎకానమిక్ సమ్మిట్ ది హైదరాబాద్ కలెక్టివ' కార్యక్రమాన్ని పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుతో కలిసి ఆయన మంగళవారం ప్రారంభించారు. 'ది మెరిడియన్ కలెక్టివ' ఆధ్వర్యంలో రెండు రోజులపాటు ఈ సమ్మిట్ జరగనుంది. వివిధ దేశాల ప్రతినిధులనుద్దేశించి డిప్యూటీ సీఎం మాట్లాడుతూ ఏఐ అంటే కేవలం క్లౌడ్ కంప్యూటింగ్, సర్వర్లు మాత్రమే కాదని, దీని వెనుక విద్యుత్, నీరు, భూమి, మానవ వనరుల భాగస్వామ్యం ఉంటుందని ప్రభుత్వం గుర్తించిందని చెప్పారు. తాము ఏఐ వద్దు అనడం లేదు.. కానీ అది ఎలా ఉండాలో ప్రపంచానికి దిశానిర్దేశం చేస్తున్నాము అని ఉప ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ప్రకృతి వనరులను ముఖ్యంగా నీరు, విద్యుత్తును హరిస్తూ ఏఐని నిర్మించడం కాక పునరుత్పాదక ఇంధనం, బాధ్యతాయుతమైన వనరుల నిర్వహణతో తెలంగాణ ఏఐకి కేరాఫ్ అడ్రస్‌గా మారుతోందని పేర్కొన్నారు. పెట్టుబడులను ఆహ్వానించడంలో దూకుడుగా ఉన్నప్పటికీ అది పర్యావరణానికి, స్థానిక ప్రజలకు మేలు చేసే విధంగా ఉండాలని ఆయన స్పష్టం చేశారు. 'కేవలం భూమి, నీరు, విద్యుత్ ఇచ్చి చేతులు దులుపుకునే పద్ధతి కాకుండా పరిశ్రమలు స్థానిక నైపుణ్యాలను పెంపొందించాలి.. స్వచ్ఛమైన ఇంధనాన్ని వాడాలి.. రీసైకిల్ చేసిన నీటిని మాత్రమే వినియోగించాలి.. ఇది కేవలం ఇంజనీరింగ్ మెరుగుదల కాదు, ఇది మన విలువలకు నిదర్శనం' అని పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా కార్బన్ క్రెడిట్స్ గురించి చర్చిస్తున్న సమయంలో తెలంగాణ 'పీపుల్స్ క్రెడిట' అనే కొత్త భావనను తెరపైకి తెచ్చిందని వెల్లడించారు. ఏఐ పెట్టుబడులు కేవలం డేటా సెంటర్లకే పరిమితం కాకుండా స్థానిక ఉపాధిని పెంపొందించడం, గ్రామీణ యువతకు నైపుణ్యాలను అందించడం వంటి అంశాలకు ప్రాధాన్యతనివ్వాలని ప్రభుత్వం నిర్దేశిస్తున్నదని అన్నారు. పెట్టుబడులు రావాలి.. కానీ అవి స్వచ్ఛమైన ఇంధనంతో, పారదర్శకతతో, ప్రజల పట్ల గౌరవంతో రావాలని ఉప ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. కంపెనీలు కేవలం ఉద్గారాలను తగ్గించడమే కాకుండా స్థానిక మేధో సంపత్తిని మెరుగుపరిచే బాధ్యత తీసుకోవాలని పిలుపునిచ్చారు.

**రైతులకు, సామాన్యులకు భరోసా:**

వ్యవసాయానికి, సామాన్యులకు దక్కాల్సిన నీటితో సాంకేతికత ఎప్పుడూ పోటీ పడకూడదని భట్టి నొక్కి చెప్పారు. నీటి వినియోగంలో అత్యంత బాధ్యతాయుతమైన విధానాలను అనుసరిస్తున్న ఏఐ వ్యవస్థలకే తెలంగాణ ప్రాధాన్యత ఇస్తుందని స్పష్టం చేశారు. ఏఐ సామాన్య ప్రజలకు కూడా అందుబాటులో ఉండాలని, భాషా అడ్డంకులను తొలగించి, మహబూబాబాద్ నుంచి ఆదిలాబాద్ వరకు ఉన్న గ్రామీణ యువతకు ఉపాధి కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ప్రకటించారు. నెహ్రూ నుంచి మన్మోహన్ సింగ్ వరకు దేశం అనుసరించిన శాస్త్ర, సాంకేతిక వృద్ధి పథాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ మరింత ముందుకు తీసుకెళ్తోందని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. తెలంగాణ అంటే కేవలం డేటా సెంటర్ల కేంద్రం మాత్రమే కాదు.. ఆ డేటా సెంటర్లు ఎలా నిర్మించాలో ప్రపంచానికి నేర్పే 'రోల్ మోడల' అని గర్వంగా ప్రకటించారు. పరిశ్రమలకు స్వాగతం పలుకుతూనే 'ప్రజల పక్షపాతి'గా ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలు, భవిష్యత్తులో ప్రపంచ ఏఐ ప్రమాణాలను హైదరాబాద్ నిర్ణయించే స్థాయికి తీసుకువెళ్తాయన్నారు. పరిశ్రమలకు ప్రభుత్వం కల్పిస్తున్న అద్భుతమైన వాతావరణం, పారదర్శకమైన పాలన, మానవీయ విలువలతో కూడిన అభివృద్ధి విధానాలు పెట్టుబడిదారులకు గొప్ప భరోసానిస్తున్నాయన్నారు. రాబోయే రోజుల్లో ఏఐ మేధస్సుతోపాటు, మానవీయ వివేకం కూడా కలిగిన సంస్థలే ప్రపంచాన్ని ఏలుతాయని, ఆ దిశగా తెలంగాణ అడుగులు వేస్తోందని వివరించారు. కార్యక్రమంలో ఎనర్జీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ నవీన్ మిట్టల్ కూఆ పాల్గొన్నారు.

## రెవెన్యూ శాఖ బలోపేతమే లక్ష్యం

మొదటిపేజీ తరువాయి

ప్రభుత్వం వేగవంతం చేస్తోందని రెవెన్యూ, హౌసింగ్, సమాచార, పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. భవనాల నిర్మాణాలపై అధికారులతో మంగళవారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తొలి విడతలో అద్దె భవనాలు, శిథిలావస్థలో ఉన్న 107 తహసీల్దార్ కార్యాలయాలు, 10 ఆర్డీవో కార్యాలయాలకు రూ.263 కోట్లతో, అలాగే స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖకు సంబంధించి రూ.97 కోట్లతో 48 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు, ఆదిలాబాద్, ఖమ్మం, మహబూబ్‌నగర్ జిల్లాల్లో జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయాలు, నిజామాబాద్, వరంగల్ జిల్లాల్లో డీఐజీ కార్యాలయాలను నిర్మిస్తున్నట్లు వెల్లడించారు. ఈ మొత్తం భవనాల కోసం రెండు విభాగాలకు సంబంధించి రూ.360 కోట్లతో పరిపాలనా అనుమతులు జారీ చేసినట్లు తెలిపారు. ఈ భవనాలన్నీ ఒకే నమూనాలో, ఆధునిక సౌకర్యాలతో ప్రజలకు వేగవంతమైన, పారదర్శకమైన సేవలు అందించేలా రూపొందిస్తామని ఆయన చెప్పారు. వీటి నిర్మాణ బాధ్యతను హౌసింగ్ కార్పొరేషన్‌కు అప్పగించినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. అద్దె భవనాల్లో ప్రభుత్వ కార్యాలయాలు కొనసాగడం వల్ల ప్రజలు పడుతున్న ఇబ్బందులకు శాశ్వత పరిష్కారం చూపేందుకు ఈ చర్యలు చేపడుతున్నామని మంత్రి పొంగులేటి తెలిపారు. హౌసింగ్ అధికారులు జిల్లాస్థాయిలో రెవెన్యూ అధికారులతో సమన్వయం చేసుకుని కొత్త భవనాల నిర్మాణానికి అవసరమైన స్థలాలను గుర్తించి నిర్మాణ పనులను వేగంగా ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా రెవెన్యూ, రిజిస్ట్రేషన్ సేవలందించే కార్యాలయాలు ప్రజలకు సులభంగా అందుబాటులో ఉండేలా, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా నిర్మితమవుతాయని ఆయన స్పష్టం చేశారు. ఇప్పటికే ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలో 39 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను 13 క్లస్టర్లుగా విభజించి ఇంటిగ్రేటెడ్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను ప్రభుత్వంపై ఎలాంటి ఆర్థిక భారం పడకుండా ప్రైవేటు సంస్థలతో నిర్మిస్తున్నామని తెలిపారు. అయిదేళ్ల నిర్వహణ బాధ్యతను కూడా ఆ సంస్థలే తీసుకున్నాయని, ఇప్పటికే నాలుగు ప్రాంతాల్లో ఇంటిగ్రేటెడ్ భవనాలకు శంకుస్థాపన చేయగా నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయని మంత్రి పొంగులేటి చెప్పారు.

# తాగునీటి సమస్య రానివ్వం: మంత్రి సీతక్క

<ins>హైదరాబాద్, జూలై 7</ins>

రాష్ట్రంలో వర్షాలు ఆలస్యమైనా, ఎల్‌నినో ప్రభావం ఉన్నా గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకుంటామని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క స్పష్టం చేశారు. తెలంగాణ తాగునీటి సరఫరా సంస్థ బోర్డు సమావేశంలో గ్రామీణ ప్రాంతాలకు తాగునీటి సరఫరా, జలాశయాల్లో నీటి నిల్వలు, రానున్న నెలల అవసరాలపై సమగ్రంగా సమీక్ష నిర్వహించారు.



**ముందస్తు ప్రణాళికతో చర్యలు**

ప్రజలకు సురక్షితమైన తాగునీరు అందించడం ప్రభుత్వ అత్యున్నత ప్రాధాన్యమని మంత్రి పేర్కొన్నారు. వర్షపాతం తగ్గినా, వాతావరణ పరిస్థితులు ప్రతికూలంగా ఉన్నా ముందస్తు ప్రణాళికతో పనిచేసి ఎక్కడా తాగునీటి కొరత తలెత్తకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ప్రతి గ్రామానికి నిరంతరాయంగా తాగునీరు అందేలా అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు.

**జలాశయాలపై నిత్య పర్యవేక్షణ**

రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాలకు కృష్ణా, గోదావరి పరివాహక ప్రాంతాల జలాశయాల నుంచి 123 నీటి శుద్ధి కేంద్రాల ద్వారా తాగునీరు సరఫరా చేస్తున్నట్లు అధికారులు సమావేశంలో వివరించారు. తాగునీటి కోసం వినియోగిస్తున్న 29 జలాశయాల్లో 45, 90, 180 రోజుల అవసరాలకు సరిపడా నీటి లభ్యతపై మంత్రి సమీక్షించారు. జలాశయాల నీటి మట్టాలను ప్రతిరోజూ పరిశీలిస్తూ నీటిపారుదల శాఖతో సమన్వయం కొనసాగించాలని ఆదేశించారు.

**ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై దృష్టి**

జూలై నెలాఖరు వరకు తగిన నీటి ప్రవాహం లేకపోతే అక్కంపల్లి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి ఉదయసముద్రానికి, తుపాకులగూడెం బ్యారేజ్ నుంచి దుమ్ముగూడెంకు నీటిని విడుదల చేసే అంశంపై నీటిపారుదల శాఖతో సమన్వయం చేసుకోవాలని మంత్రి సూచించారు. అలాగే అవసరమైతే ప్రత్యామ్నాయ నీటి వనరులను వినియోగించేలా ముందస్తు ఏర్పాట్లు సిద్ధం చేయాలని చెప్పారు.సింగూర్ ప్రాజెక్టులో నీటి నిల్వలు తగ్గిన నేపథ్యంలో సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో తాగునీటి సమస్య తలెత్తే అవకాశంపై కూడా సమావేశంలో చర్చించారు. అవసరమైతే కొత్త బోర్‌వెల్‌లు తవ్వడం, పాత బోర్‌వెల్‌లను పునరుద్ధరించడం, అద్దె బోర్‌వెల్‌లను వినియోగించడం వంటి చర్యలు చేపట్టాలని మంత్రి అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో ఎలాంటి తాగునీటి సంక్షోభం తలెత్తకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి ముందస్తు చర్యలను కచ్చితంగా అమలు చేయాలని మంత్రి సీతక్క స్పష్టం చేశారు.

# మొబైల్ అంగన్వాడి కేంద్రాలకు శ్రీకారం

<ins>హైదరాబాద్, జూలై 7</ins>

రాష్ట్రంలోని ప్రతి చిన్నారికి అంగన్వాడి సేవలు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం మొబైల్ అంగన్వాడి కేంద్రాలను ప్రారంభించింది. ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డీలో మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క, కార్మిక శాఖ మంత్రి వివేక్ కలిసి మొబైల్ అంగన్వాడి వాహనాన్ని జెండా ఊపి ప్రారంభించారు. తొలి దశలో ఈ వాహనం మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని ఇందిరమ్మ కాలనీలో సేవలు అందించనుంది. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ చిన్నారులే దేశ సంపద, భావితరాలకు పునాదని అన్నారు. తెలంగాణ-2047 లక్ష్యాల సాధనలో నేటి చిన్నారుల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. అంగన్వాడి కేంద్రాలు అందుబాటులో లేని ప్రాంతాల్లో నివసించే చిన్నారులు కూడా ప్రభుత్వ సేవలకు దూరం కాకూడదనే ఉద్దేశంతో మొబైల్ అంగన్వాడి కేంద్రాలను అందుబాటులోకి తీసుకొచ్చామని తెలిపారు. వలస కార్మికుల పిల్లలకు పోషకాహారం, ఆరోగ్య సంరక్షణ, ప్రీస్కూల్ విద్య, తల్లి-శిశు సంక్షేమ సేవలు అందించేందుకు ఈ కేంద్రాలు ఉపయోగపడతాయని మంత్రి వివరించారు. ఉపాధి కోసం హైదరాబాద్ వంటి నగరాలకు వచ్చే కుటుంబాల చిన్నారులు అంగన్వాడి సేవలు కోల్పోకుండా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందన్నారు. మొబైల్ అంగన్వాడి కేంద్రాల్లో సాధారణ అంగన్వాడి కేంద్రాల్లో అందించే అన్ని సేవలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. పోషకాహారం, ఆరోగ్య పరీక్షలు, ఎదుగుదల పర్యవేక్షణ, ప్రీస్కూల్ విద్యతో పాటు తల్లి-శిశు సంక్షేమానికి సంబంధించిన సేవలను నేరుగా ప్రజల వద్దకే తీసుకెళ్తామని చెప్పారు. ఒక్కో మొబైల్ అంగన్వాడి వాహనం దాదాపు పది అంగన్వాడి కేంద్రాలకు సమానంగా సేవలు అందించే సామర్థ్యాన్ని కలిగి ఉందని మంత్రి సీతక్క వెల్లడించారు. ఒక్కో వాహనం ద్వారా సుమారు 300 మంది లబ్ధిదారులకు సేవలు అందనున్నాయని తెలిపారు. ప్రభుత్వం సేవలను ప్రజల వద్దకే తీసుకెళ్లే దిశగా ఈ కార్యక్రమాన్ని రూపొందించిందన్నారు. చిన్నారి చిరునవ్వే నిజమైన అభివృద్ధికి ప్రతీక అని పేర్కొన్న మంత్రి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం ప్రతి చిన్నారి సమగ్ర అభివృద్ధికి అత్యున్నత ప్రాధాన్యత ఇస్తోందని చెప్పారు. ఈ కార్యక్రమంలో మహిళా, శిశు సంక్షేమ శాఖ, కార్మిక శాఖకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# గురుకులాలు, హాస్టళ్లలో క్లీన్ అండ్ గ్రీన్‌కు ప్రాధాన్యం

- **మెనూ అమలులో రాజీ ఉండొద్దు**
- **బీసీ స్టడీ సర్కిల్స్ బలోపేతానికి ప్రత్యేక కమిటీ**
- **16 నుంచి కులవృత్తుల మేళా**
- **సమీక్షా సమావేశంలో మంత్రి పొన్నం**

<ins>హైదరాబాద్, జూలై 7 :</ins>

గురుకులాలు, హాస్టళ్లు ప్రారంభమై 20 రోజులు పూర్తైన నేపథ్యంలో గత సమీక్షా సమావేశంలో తీసుకున్న నిర్ణయాల అమలుపై బీసీ సంక్షేమ శాఖకు సంబంధించిన కార్యక్రమాలపై సచివాలయంలో రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గురుకులాలు, హాస్టళ్లు పరిశుభ్రంగా, పచ్చదనంతో కూడిన క్లీన్ అండ్ గ్రీన్ వాతావరణంలో ఉండేలా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వం నిర్ణయించిన మెనూను అన్ని గురుకులాలు, హాస్టళ్లలో తప్పనిసరిగా అమలు చేయాలని సూచించారు.జిల్లా బీసీ సంక్షేమ అధికారులు (డీబీసీవోలు) క్రమశిక్షణతో విధులు నిర్వహిస్తూ విద్యార్థుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని మంత్రి స్పష్టం చేశారు. ప్రజాప్రతినిధులు తరచూ గురుకులాలు, హాస్టళ్లను సందర్శించి విద్యార్థుల పరిస్థితులను స్వయంగా పరిశీలించాలని సూచించారు.స్టడీ సర్కిల్‌స్‌లో మరింత నాణ్యత పెంపొందించేందుకు, సివిల్స్‌తో పాటు వృత్తి శిక్షణ, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేసేందుకు ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయాలని మంత్రి ఆదేశించారు. ఢిల్లీ, అహ్మదాబాద్ వంటి ఇతర రాష్ట్రాల్లో విజయవంతంగా అమలవుతున్న స్టడీ సర్కిల్స్ విధానాలను అధ్యయనం చేసి రాష్ట్రంలో అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.జూలై 16 నుంచి హెచఎండీఏ గ్రౌండ్స్‌లో నిర్వహించనున్న కులవృత్తుల మేళాలో అన్ని కులాల సంప్రదాయ వృత్తిదారులకు సమాన అవకాశాలు కల్పించాలని సూచించారు. మహిళల ఆర్థిక స్వావలంబనకు తోడ్పడే కుట్టు మిషన్ పథకం అమలు కోసం సమగ్ర విధి విధానాలను రూపొందించాలని ఆదేశించారు.



బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో స్కిల్ డెవలప్మెంట్ కార్యక్రమాలను మరింత విస్తృతంగా చేపట్టి ఉపాధి అవకాశాలను పెంచాలని, ఎకనామిక్ సపోర్ట్ స్కీమ్స్‌పై సమగ్ర అధ్యయనం చేసి అమలుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు.ఐఐటీలు, ఐఐఎంలలో సీట్లు సాధించిన గురుకుల విద్యార్థులకు అందించే ల్యాప్‌టాప్‌ల పంపిణీపై సమగ్ర నివేదిక సమర్పించాలని మంత్రి ఆదేశించారు. బీసీ సంక్షేమ శాఖ కమిషనర్, గురుకులాల కార్యదర్శి ఆకస్మికంగా గురుకులాలు, హాస్టళ్లను తనిఖీ చేస్తూ విద్యార్థులకు నాణ్యమైన సౌకర్యాలు అందుతున్నాయో లేదో నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. కాటమయ్య రక్షణ కవచాల శిక్షణ పూర్తి చేసుకొని కిట్లు అందని జిల్లాల్లో వెంటనే పంపిణీ పూర్తి చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. సమావేశంలో బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి బాలమయదేవి, గురుకులాల కార్యదర్శి సైదులు, బీసీ సంక్షేమ శాఖ అధికారులు మల్లయ్య బట్టు, అలోక్ కుమార్, మామిడి హరికృష్ణ, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పట్నం, మేడ్చల్, మహేశ్వరంలకు మహర్దశ

<ins>**మొదటిపేజీ తరువాయి**</ins>

మంగళవారం శంకుస్థాపన చేశారు. అనంతరం నిర్వహించిన సభలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ, ఇబ్రహీంపట్నం ప్రజలు, కార్యకర్తలు, నాయకులు తనపై ఉంచిన విశ్వాసం వల్లే రాష్ట్రంలో కీలకమైన రోడ్లు, భవనాల శాఖ మంత్రిగా సేవ చేసే అవకాశం లభించిందన్నారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవడం తన బాధ్యత అని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రహదారుల అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ఇప్పటికే రూ.85 కోట్ల విలువైన రహదారి పనులు పూర్తి చేశామని, మరో రూ.275 కోట్లతో పలు రహదారి అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. అదనంగా రూ.100 కోట్ల విలువైన కొత్త రహదారి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించినట్లు వెల్లడించారు. ట్రాఫిక్ సమస్యల పరిష్కారం, జాతీయ రహదారుల విస్తరణ, వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని తెలిపారు. ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేస్తూ రాష్ట్రాన్నిమరింత అభివృద్ధి పథంలో నడిపిస్తామని మంత్రి స్పష్టం చేశారు. ఎంపీచామల కిరణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో రూ.338 కోట్లతో 140కు పైగా రహదారి పనులు చేపట్టినట్లు తెలిపారు. గ్రామాలు, బస్తీల్లో రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. విద్య, వైద్యం, మౌలిక వసతుల అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి సారించిందని, ప్రభుత్వ పాఠశాలలను ఆధునిక తెలంగాణ పబ్లిక్ స్కూల్‌స్‌గా తీర్చిదిద్దుతున్నట్లు పేర్కొన్నారు. లక్ష్మీరెడ్డి పాలెం వద్ద ఫ్లైఓవర్, అండర్‌పాస్ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గానికి రూ.338 కోట్ల విలువైన రహదారి పనులు మంజూరు కావడం చరిత్రాత్మకమని పేర్కొన్నారు. ఇందులో సుమారు రూ.275 కోట్ల పనులు నేరుగా ఇబ్రహీంపట్నం పరిధిలో చేపడుతున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో నియోజకవర్గంలో 200 పడకల ఆసుపత్రి, ప్రభుత్వ పాఠశాలల ఆధునీకరణ, రహదారుల విస్తరణ వంటి పలు అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా కొనసాగుతున్నాయని చెప్పారు. అలాగే రూ.2,300 కోట్లతో సమీకృత మార్కెట్ ఏర్పాటు ద్వారా వేలాది మందికి ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు. రాష్ట్ర రోడ్డు అభివృద్ధి సంస్థ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం సంక్షేమంతోపాటు అభివృద్ధికి కూడా సమాన ప్రాధాన్యత ఇస్తోందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా రోడ్లు, భవనాల శాఖ ద్వారా భారీ స్థాయిలో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకొని ప్రధాన రహదారులను నాలుగు లేన్లుగా అభివృద్ధి చేయడం ద్వారా రవాణా సౌకర్యాలు మెరుగుపడటంతోపాటు ఉపాధి, పెట్టుబడులు, ప్రాంతీయ అభివృద్ధికి ఊతం లభిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీలు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, ఈటల రాజేందర్, రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ చల్లా నర్సింహారెడ్డి, ఎమ్మెల్సీ శంకర్ నాయక్, జాయింట్ కలెక్టర్ చంద్రారెడ్డి, గడ్డి అన్నారం మార్కెట్ కమిటీ చైర్మన్ మధుసూదన్ రెడ్డి, ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

**హ్యామ్ రోడ్ల నిర్మాణంతో మారనున్న రూపురేఖలు**

<ins>హైదరాబాద్</ins> : రాష్ట్ర రహదారుల నెట్‌వర్క్‌ను గతంలో ఎప్పుడూ లేనంతగా అత్యద్భుతంగా అభివృద్ధి చేయబోతున్నామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రకటించారు. హ్యామ్ రోడ్లకు ఇటీవల సిఎం శంకుస్థాపన చేయడంతో రాష్ట్రంలో రోడ్ల స్వరూపం మారబోతోందన్నారు. ఈ ప్రాంత ప్రజలతో తనకు ప్రత్యేకమైన, వెలకట్టలేని అనుబంధం ఉందని, గతంలో ప్రజలు తమ సొంత డబ్బులు ఖర్చు పెట్టుకొని మరి తనను ఎంపీగా గెలిపించారని ఆయన కృతజ్ఞతతో గుర్తుచేసుకు న్నారు. ఈ ప్రాంత బిడ్డగా ఇక్కడి సమస్యలపై తనకు పూర్తి అవగాహన ఉందని, అందుకే రోడ్ల అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తూ శ్రీకారం చుట్టామని మంత్రి స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా రోడ్ల రూపురేఖల ను మార్చేందుకు ప్రభుత్వం భారీ ప్రణాళికతో ముందుకు వెళ్తోందని మంత్రి వివరించారు. మొత్తం రూ. 13,000 కోట్ల భారీ వ్యయంతో, 34 ప్యాకేజీల కింద, 6,092 కిలోటర్ల మేర విస్తరించిన 441 రోడ్లను హ్యామ్ విధానంలో నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఇటీవల నల్లగొండ వేదికగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల దుగా ఈ ప్రతిష్ఠాత్మక కార్యక్రమాన్ని అట్టహాసంగా ప్రారంభించుకున్నామని ఆయన గుర్తుచేశారు. ప్రమాదాలు లేని క్వాలిటీ రోడ్లుగా వీటిని తీర్చిదిద్దుతామని, రోడ్లు రద్దీగా ఉండే <ins>హైదరాబాద్</ins> రూరల్ సర్కిల్ 1 / 2 ప్యాకేజీల్లోనే దాదాపు 30 రోడ్లను అభివృద్ధి చేస్తున్నామని పేర్కొన్నారు. అభివృద్ధి పనుల్లో భాగంగా తాజాగా రూ. 338 కోట్ల వ్యయంతో 149 కిలోటర్ల మేర విస్తరించే 14 రహదారుల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసుకున్నట్లు మంత్రి కోమటిరెడ్డి తెలిపారు. రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రిగా ఈ ప్రాంత ప్రజల మనిషిగా అద్దం లాంటి రహదారులను నిర్మించి తీరుతామని, ఈ రోడ్ల కనెక్టివిటీ ద్వారా రాబోయే రోజుల్లో యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మరింతగా పెరుగుతాయని మంత్రి భరోసా ఇచ్చారు.

## అహ్మదాబాద్ పేలుళ్ల కేసులో ..

# 38 మందికి ఉరిశిక్ష

<ins>**మొదటిపేజీ తరువాయి**</ins>

కోర్టు 49 మందిని దోషులుగా నిర్ధారించింది. వారిలో 38 మందికి మరణశిక్ష, 11 మందికి యావజ్జీవ కారాగార శిక్ష విధించింది. సాక్ష్యాధారాలు లభించకపోవడంతో 28 మందిని నిర్దోషులుగా విడుదల చేసింది. ఒకేసారి 38 మందికి మరణశిక్ష విధించడం భారత న్యాయ చరిత్రలో అరుదైన ఘటనగా నమోదైంది.

**వేలాది పేజీల ఆధారాలతో తీర్పు**

ఈ కేసు విచారణలో 1,150 మందికి పైగా సాక్షుల వాంగ్మూలాలు నమోదు చేశారు. అనంతరం ప్రత్యేక న్యాయస్థానం 6,700 పేజీలకు పైగా ఉన్న తీర్పును వెలువరించింది. దీనిపై దోషులు హైకోర్టును ఆశ్రయించగా, అన్ని వాదనలు పరిశీలించిన గుజరాత్ హైకోర్టు ప్రత్యేక కోర్టు తీర్పును సమర్థించింది. పేలుళ్లలో మరణించిన 56 మంది కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.10 లక్షలు, గాయపడిన 200 మందికి పైగా బాధితులకు ఒక్కొక్కరికి రూ.1 లక్ష చొప్పున పరిహారం అందించాలని కూడా ఆదేశించింది. ఈ తీర్పు ఉగ్రవాద కేసుల విచారణలో మరో కీలక మైలురాయిగా నిలిచింది.

# బిఎల్‌వోలను బెదిరిస్తున్న ఎంఐఎం

- **సిఈవోకు ఫిర్యాదు చేసిన బీజేపీ నేతలు**

<ins>హైదరాబాద్,జూలై 7:</ins>




సర్ ప్రక్రియ సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని సీఈవోను బీజేపీ అధ్యక్షుడు రాంచందర్ రావు కోరారు. ఆయన ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారిని ఆ పార్టీ బృందం కలిసింది. ఈ సందర్భంగా సర్ విషయంలో ఎంఐఎం పార్టీ వ్యవహరిస్తున్న తీరు సరిగ్గా లేదని రాంచందర్ రావు ఫిర్యాదు చేశారు. అనంతరం బీజేపీ తెలంగాణ చీఫ్ మీడియాతో మాట్లాడుతూ.. పలు ప్రాంతాల్లో బీఎల్‌వోలను ఎంఐఎం, కాంగ్రెస్ నేతలు బెదిరిస్తున్నారని తెలిపారు. ఇంటింటికీ వెళ్లకుండా బీఎల్‌ఓలను అడ్డుకుంటున్నారని ఆరోపించారు. పలువురు ఓటర్లకు ఫారాలు అందడం లేదని రాంచందర్ రావు తెలిపారు. తెలుగు ఫారాలతో ఇతర రాష్ట్రాల ఓటర్లకు ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. <ins>హైదరాబాదే</ins> కాకుండా అవసరమైన అన్ని ప్రాంతాల్లో ఇంగ్లీషు ఫారాలు అందించాలని కోరినట్లు తెలిపారు. ఓటర్ల జాబితా లోపాలపై చర్యలు తీసుకోవాలని సీఈవోను కోరినట్లు రాంచందర్‌రావు పేర్కొన్నారు.ఈ బృందంలో ఎమ్మెల్సీ అంజిరెడ్డి, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేముల అశోక్, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జయశ్రీ, సీనియర్ నాయకులు ఆంథోని రెడ్డి, సోల్కర్ తదితరులు ఉన్నారు

**జీహెచ్‌ఎంసీ మేయర్ పీఠమే లక్ష్యం కావాలి**

రానున్న జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో మేయర్ పీఠాన్ని బీజేపీ కైవసం చేసుకోవడమే లక్ష్యమని, ఇందుకోసం ప్రతి కార్యకర్త విజయమే ఏకైక లక్ష్యంగా ఐక్యంగా పనిచేయాలని రామచందర్ రావు పిలుపునిచ్చారు. బీఆర్‌ఎస్ , కాంగ్రెస్ పాలనకు విసిగిపోయిన ప్రజలు బీజేపీ వైపు ఆశగా చూస్తున్నారన్నారు. బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. జిల్లాలో పార్టీకి బలమైన కేడర్, ప్రజల ఆదరణ ఉన్నాయని, ఈ జిల్లాలో విజయం సాధించడానికి అనుకూల పరిస్థితులు ఉన్నాయని ఆశాభావం వ్యక్తం చేశారు. గతంలో సాధించిన విజయాలను స్ఫూర్తిగా తీసుకుని రానున్న జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో 100% ఫలితాలు సాధించి మేయర్ పీఠాన్ని కైవసం చేసుకోవడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని పిలుపునిచ్చారు. ద్వితీయ, తృతీయ స్థానాల గురించి కాక కేవలం విజయాన్నే లక్ష్యంగా పెట్టుకోవాలని సూచించారు. మున్సిపల్ ఎన్నికల తర్వాత జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు రానున్నాయని, అందరికీ భవిష్యత్తులో అవకాశాలు ఉంటాయని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై, అవినీతిపై బూత్, మండల స్థాయి నుంచి బలమైన ఉద్యమాలను నిర్మించాలని కేడర్‌కు పిలుపునిచ్చారు. జిల్లావ్యాప్తంగా స్థానిక సమస్యలను గుర్తించి నిరంతర పోరాటాలు చేయాలన్నారు. మల్కాజ్గిరి ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడుతూ సైబరాబాద్ మున్సిపాలిటీ మీద ఎగిరేది కాషాయ జెండానే అని అన్నారు. తాను ఎంపీగా గెలిచిన తరువాత ఎల్బీనగర్ నియోజకవర్గం కార్పొరేటర్లకు రూ.కోట్ల నిధులు వచ్చాయని, ఇక్కడి కార్పొరేటర్లు తమ వంటి వారి అవసరం లేకుండానే ప్రజల పనులు చేసిపెట్టగల సత్తా సంతరించుకున్నారని తెలిపారు. మాటల గారడి చేసి గెలిచిన రేవంత్ రెడ్డి రెండేళ్లకే వెలకిల పడ్డాడని ఎద్దేవా చేశారు. ఈ పార్టీ మళ్లీ గెలవదు అని మంత్రులు, ఎమ్మెల్యేలు, నాయకులే అంటున్నారని, దీపం ఉన్నప్పుడే చక్క పెట్టుకోవాలని చూస్తున్నారని వ్యాఖ్యానించారు. నాయకుడు పార్టీకి భారం కాకూడదు. కార్యకర్తలు, ప్రజలే మన వీఐపీలు. మొన్న మమ్మల్ని గెలిపించారు.. నేడు మిమ్ముల్ని గెలిపించడంలో మా శాయశక్తులా కృషి చేస్తాం అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర సంఘటన మంత్రి చంద్రశేఖర్ జీ, చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు వనిపల్లి శ్రీనివాస్ రెడ్డి, జిల్లా మాజీ అధ్యక్షుడు సామ రంగారెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతమ్ రావు, జాతీయ నాయకుడు పేరాల శేఖర్ జీ, రాష్ట్ర అధికార ప్రతినిధులు ప్రభా గౌడ్, రవికుమార్ యాదవ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నుకుల పద్మారెడ్డి, బండారు శైలజ, శ్రీదేవి రెడ్డి, కాలేం రవీందర్, కొత్త రవీందర్ గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శులు బండారు భాస్కర్, యశ్‌పాల్ గౌడ్, లింగోజిగూడ డివిజన్ అధ్యక్షుడు గుండె కిరణ్ కుమార్, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కొప్పుల నర్సింహారెడ్డి, కార్పొరేటర్లు నవంజీవన్ రెడ్డి, లచ్చిరెడ్డి, ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి, రంగా నర్సింహ గుప్తా, జిల్లా కార్యవర్గ సభ్యులు, పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అక్రమ సంబంధం కోసం భర్త హత్య..

- **మిస్సింగ్ కేసుగా మభ్యపెట్టిన భార్య**

<ins>హైదరాబాద్, జూలై 7</ins>

<ins>హైదరాబాద్‌</ins>లోని మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో దారుణ ఘటన వెలుగులోకి వచ్చింది. అక్రమ సంబంధానికి అడ్డుగా ఉన్నాడనే కారణంతో ఓ మహిళ తన ప్రియుడితో కలిసి భర్తను హత్య చేసినట్లు పోలీసులు గుర్తించారు. అనంతరం శవాన్ని మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతానికి తరలించి పూడ్చిపెట్టి, భర్త కనిపించడం లేదంటూ మిస్సింగ్ ఫిర్యాదు చేసి పోలీసులను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేసినట్లు దర్యాప్తులో తేలింది.

గత ఏడాది నవంబర్‌లో భర్త కనిపించడం లేదని మహిళ ఫిర్యాదు చేయడంతో పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించారు. దర్యాప్తులో భాగంగా మహిళ కాల్ డేటా వివరాలు, సీసీటీవీ దృశ్యాలను పరిశీలించగా పలు అనుమానాస్పద అంశాలు వెలుగులోకి వచ్చాయి.

**లోతైన దర్యాప్తులో అసలు విషయం**

సాంకేతిక ఆధారాలను పరిశీలించిన పోలీసులు మహిళను విచారించగా, ఆమె తన ప్రియుడితో కలిసి భర్తను హత్య చేసినట్లు గుర్తించారు. నేరం బయటపడకుండా ఉండేందుకు మృతదేహాన్ని వాహనంలో మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతానికి తీసుకెళ్లి గుట్టుచప్పుడు కాకుండా పూడ్చిపెట్టినట్లు దర్యాప్తులో వెల్లడైంది.

**మహారాష్ట్రలో మృతదేహం వెలికితీత**

ఈ కేసులో నిందితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు, మహారాష్ట్ర పోలీసుల సహకారంతో నిందితులు చూపించిన ప్రాంతంలో మృతదేహాన్ని వెలికితీశారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు, హత్యకు దారితీసిన పరిస్థితులపై పోలీసులు మరింత లోతుగా దర్యాప్తు కొనసాగిస్తున్నారు.





# జనాభా పెరిగితే తట్టుకోగలమా?

ఎన్నికల ముందు నేతలు ఇచ్చే హామీలన్నీ ఓట్ల కోసం అని ప్రజలు గుర్తించనంత వరకు ప్రజాస్వామ్యం అపహాస్యం అవుతూనే ఉంటుంది. అధికారంలోకి వచ్చాక సొంత ఎజెండాతో సాగుతారు. ఓట్ల కోసం తప్ప ప్రజలపై లేదా రాష్ట్రం, దేశంపై ప్రేమతో ఏ రాజకీయ నాయకుడు పనిచేయరని గుర్తించాలి. ఎపిలో చంద్రబాబు జనాభా విషయంలో చేస్తున్న విన్యాసం ఇదే. కేవలం మైనార్టీ ఓట్లను గంపగుత్తగా లాగేసేం దుకు అధికా జనాభా కావాలి, పిల్లను కనండి, డబ్బులు ఇస్తాను అంటున్నారు. ముగ్గురు అంతకన్నా ఎక్కువ ఉన్నవారికి తక్షణం 5వేల సాయం ప్రకటించారు. మరి లోకేశ్ ఒక్క పిల్లాడితోనే ఎందుకు సరిపుచ్చాడు. ఆయనకు ఈ నియమం వర్తించదా? చంద్రబాబు ఇంట్లోనే ఈ పద్దతి లేనప్పుడు రాష్ట్రానికి ఎందుకు అంటగట్టాలన్నది ప్రజలు ఆలోచన చేయాలి. ఇందులో ఏదో మతలబు లేకుండా చంద్రబాబు ప్రకటించరని గుర్తించాలి. ఇకపోతే ఎపిలో అనేక సమస్యలు ఉన్నాయి. ముఖ్యంగా శాంతి భద్రతలు క్షీణిస్తున్నాయి. సాయికృష్ణ అనే వ్యక్తిని పోలీసులు తీసుకుని వెళ్లి మాయం చేస్తే అతీగతీ లేదు. ఓ చిన్నారి తప్పిపోతే దిక్కులేదు. రేప్‌లు జరుగుతుంటే అడిగేవారు లేరు. కేవలం అమరావతి ఒక్కటే ఇప్పుడు లక్ష్యంగా బాబు పాలన సాగిస్తున్నాడు. ఇప్పటికే 33 వేల ఎకరాలు సేకరించినా ఇంకా భూమి కావాలంటూ రైతులను వేధిస్తున్నారు. భూములు ఇచ్చిన వారికి సక్రమంగా ప్లాట్లు ఇచ్చి వారిని సంతోషంగా ఉంచడం లేదు. కేవలం రియల్ వ్యాపారం లక్ష్యంగా బాబు పాలన సాగుతోందని వైసిపి ఆరోపణలు చేస్తోంది. ప్రశ్నించిన వారిని వేధింపులకు గురిచేస్తున్నారని జగన్ విమర్శలు చేస్తున్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను మరచిన పాలకులు అధికారంలోకి రాగానే తమ సొంత ఎజెండా అమలు చేస్తుంటారు. ఇలా ఎన్నికల సమయంలో ప్రజల ముందు ఎన్నో హామీలు ఇస్తారు. ఉద్యోగాలు, అభివృద్ధి, సంక్షేమం, మౌలిక సదుపాయాలు, అవినీతి నిర్మూలన వంటి అంశాలపై గొప్ప గొప్ప ప్రకటనలు చేస్తారు. కానీ ఎన్నికలు ముగిసిన తర్వాత వాటిలో చాలా హామీలు మరుగున పడిపోతాయి. అవినీతి అన్నది కేవలం ఉద్యోగులకే పరిమితం అయ్యింది. వారు లంచం తీసుకుంటే పట్టేస్తున్నారు. అలా పట్టుకుంటున్న వారి సంఖ్య ఒక్కశాతం కూడా ఉండదేమో. లంచం లేనిదే పని జరగడం లేదు. లంచాల కోసమే ఉద్యోగాలు ఇచ్చారేమో అనుకోవాలి. ఇకపోతే ఇప్పటికే దేశం అధిక జనాభాతో సతమతం అవుతోంది. ఉన్న జనాభాకు సరిపడా తిండిపెట్టలేక పోతున్నాం. కనీస వసతులు కల్పించలేకపోతున్నాం. విద్య,వైద్యం అందించలేకపోతున్నాం. దేశం అభివృద్ధి చెందాలంటే కనీస వసతులు కలగాలి. పాలకులు ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి. ప్రజలు కూడా తమ హక్కులతో పాటు బాధ్యతలను విస్మరించకూడదు. ఒకవైపు జవాబుదారీ పాలన, మరోవైపు బాధ్యతగల పౌరసమాజం ఉంటేనే నిజమైన ప్రగతి సాధ్యమవుతుంది. మనం ఇష్టం వచ్చినట్లు ప్రవర్తిస్తే, పాలిస్తే నష్టపోయేది రాష్ట్రమే. నష్టం జరిగేది ప్రజలకే తప్ప పాలకులకు కాదు. భారతదేశం ప్రపంచంలో అత్యధిక జనాభా కలిగిన దేశంగా ఎదిగింది. 145 కోట్ల జనాభాతో సతమతమవుతోంది. యువశక్తి, సహజ వనరులు, మేథో సంపత్తి, సాంకేతిక నైపుణ్యం వంటి అనేక బలాలు మనకు ఉన్నా, అడుక్కు తిన్నట్లుగా ప్రజల జీవితాలు సాగుతున్నాయి. విద్య, ఆరోగ్యం, పారిశుద్ధం, పర్యావరణం వంటి విషయాల్లో వెనకబడి ఉన్నాం. అవినీతి ఊడలు దిగుతోంది. దీనికి కారణం కేవలం పాలకుల వైఫల్యమే కాదు, ప్రజల నిర్లక్ష్యం కూడా ఓ కారణంగా చూడాలి. మనకెందుకులే అనుకుంటే ఇలాగే సాగదీస్తారు. దేశాభివృద్ధి అంటే కేవలం ప్రభుత్వ పథకాలు, భారీ ప్రాజెక్టులు మాత్రమే కాదు. ప్రతి పౌరుడి బాధ్యతా యుతమైన పాత్ర పోషించాలి. ప్రజాస్వామ్య దేశంలో పౌరస్పృహ లేకపోతే పాలకులు మనలను ఏమారుస్తారని గుర్తించాలి. ప్రజల సమస్యల కంటే రాజకీయ ప్రయోజనాలు, అధికారం నిలబెట్టుకోవడమే లక్ష్యంగా పాలన సాగిస్తున్న తీరును చూస్తున్నాం. అన్ని రాష్ట్రాల్లోనూ ఇదే తరహా పాలన సాగుతోంది. ఆదాయాలను మించి ఖర్చు చేస్తున్నారు. రాజకీయ నేతల జీత భత్యాలు తడిసి మోపెడు అవుతున్నాయి. సంపాదనే ధ్యేయంగా కొందరి పాలకుల ప్రధాన లక్ష్యంగా మారుతోంది. ప్రజాస్వామ్యంలో అధికారాన్ని ప్రజలే ఇస్తారు. కాబట్టి ప్రజల సంక్షేమం కోసం పనిచేయడం పాలకుల విధి. ప్రభుత్వాలు పారదర్శకంగా వ్యవహరించాలి. ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేయరాదు. కానీ నిత్యం జరుగుతున్నది దుర్వినియోగం తప్ప మరోటి కాదు. ప్రజల సమస్యలను వినడం, తెలుసుకోవడం, అభివృద్ధి ఫలాలు అందరికీ చేరేలా చూడడం అన్నది జరగడం లేదు. పాలనలో జవాబుదారీతనం లేకుండా పోతోంది. ఎన్నికల రోజున బలవంతంగా ఓటు వేసి ఐదేళ్లు మౌనంగా ఉండటం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధం. ఇది మన కర్తవ్యాన్ని విస్మరించయడమే అవుతుంది. ప్రజా సమస్యలపై ప్రశ్నించడం, ప్రభుత్వ పనితీరును పరి శీలించడం, తప్పులను ఎత్తి చూపడం, మంచి కార్యక్రమాలను ప్రోత్సహించడం ప్రతి పౌరుడు బాధ్యతగా గుర్తించాలి. అధిక జనాభాతో సతమతం అవుతున్న మనం కనీస సౌకర్యలు లేనప్పుడు జనాభాను పెంచాలన్న పిలుపును వ్యతిరేకించాలి. ఉన్న పౌరులకు ఎలాంటి సౌకర్యాలు ఇస్తున్నారో అడగాలి. గర్భిణీలకు కనీస డెలివరీ సరిపడా ఆస్పత్రులు, వసతులు లేవన్న విషయం పాలకులకు గుర్తు చేయాలి. జనాభా పెరుగుదల అనర్థ హేతవు తప్ప అభివృద్ధి కాదని గుర్తిస్తే మంచిది.

# కేంద్ర మంత్రివర్గ విస్తరణకు బ్రేక్?

- పార్లమెంట్ సమావేశాలపై ఫోకస్..
- వర్షాకాల సమావేశాల షెడ్యూల్ ప్రకటనతో చర్చ
- శాసన కార్యక్రమాలకే కేంద్రం ప్రాధాన్యం
- రాజ్యాంగ సవరణ బిల్లులపై ప్రభుత్వం దృష్టి
- సమావేశాల తర్వాతే మంత్రివర్గ విస్తరణపై నిర్ణయం?



**న్యూఢిల్లీ, జూలై 7:** కేంద్ర మంత్రివర్గ విస్తరణ, మార్పు చేర్పులపై గత కొద్ది రోజులుగా రాజకీయ వర్గాల్లో జోరుగా చర్చ సాగుతున్న వేళ, పార్లమెంట్ వర్షాకాల సమావేశాల తేదీలను కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. జూలై 20 నుంచి ఆగస్టు 13 వరకు 19 సమావేశాలతో పార్లమెంట్ సమావేశాలు నిర్వహించనున్నట్లు కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు వెల్లడించారు. అయితే మంత్రివర్గ విస్తరణపై ఎలాంటి ప్రకటన లేకపోవడంతో, ఆ ప్రక్రియ తాత్కాలికంగా వాయిదా పడిందనే ప్రచారం జరుగుతోంది.

**శాసన కార్యక్రమాలకే ప్రాధాన్యం**

పార్లమెంట్ సమావేశాల్లో కీలక బిల్లులను ఆమోదింపజేయడంపైనే కేంద్ర ప్రభుత్వం ప్రస్తుతం ప్రధానంగా దృష్టి సారించినట్లు రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. ఈ సమయంలో మంత్రివర్గంలో మార్పులు చేపడితే రాజకీయ సమీకరణాలపై ప్రభావం పడే అవకాశం ఉండటంతో, సమావేశాలు పూర్తయ్యే వరకు ఆ అంశాన్ని పక్కన పెట్టినట్లు భావిస్తున్నారు. ముఖ్యంగా మిత్రపక్షాల మద్దతు కీలకంగా ఉండే బిల్లుల విషయంలో ఎలాంటి అంతర్గత అసంతృప్తికి తావివ్వకూడదన్న ఉద్దేశంతో ప్రభుత్వం ముందుకు సాగుతున్నట్లు చర్చ జరుగుతోంది.

**రాజ్యాంగ సవరణ బిల్లులపై ఆసక్తి**

ఈ సమావేశాల్లో రాజ్యాంగ సవరణలకు సంబంధించిన కీలక బిల్లులను ప్రభుత్వం ప్రవేశపెట్టే అవకాశంపై ఊహాగానాలు వినిపిస్తున్నాయి. లోక్‌సభ స్థానాల పునర్వి భజన, మహిళలకు రిజర్వేషన్ల అమలు వంటి అంశాలకు సంబంధించిన ప్రతిపాదనలు చర్చకు వచ్చే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు. ఇటువంటి బిల్లుల ఆమోదానికి ఉభయ సభల్లో ప్రత్యేక మెజారిటీ అవసరం కావ డంతో, ప్రభుత్వం అన్ని రాజకీయ సమీకరణాలపైనా దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది.

**ఇతర కీలక బిల్లులపైనా చర్చ**

దేశవ్యాప్తంగా ఒకేసారి ఎన్నికలు నిర్వహించే విధానానికి సంబంధించిన బిల్లు కూడా ఈ సమావేశాల్లో చర్చకు రావచ్చనే ప్రచారం కొనసాగుతోంది. అలాగే ఇటీవలి కాలంలో చర్చనీయాంశంగా మారిన మరికొన్ని రాజ్యాంగ సవరణ ప్రతిపాదనలు కూడా పార్లమెంట్ ముందుకు వచ్చే అవకాశాలపై రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. అయితే వీటిపై కేంద్ర ప్రభుత్వం అధికారికంగా ఎలాంటి ప్రకటన చేయలేదు. పార్లమెంట్ సమావేశాలు ముగిసిన అనంతరం కేంద్ర మంత్రివర్గ విస్తరణపై స్పష్టత వచ్చే అవకాశముందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. రాబోయే రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు, రాజకీయ సమీకరణాలను దృష్టిలో ఉంచుకుని సమావేశాల అనంతరం కేంద్ర నాయకత్వం తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

# రాముడి కానుకలన్నీ సేఫ్

**స్పష్టం చేసిన రామ్ మందిర్ ట్రస్ట్**



**లఖ్‌నవూ, జులై 7:** అయోధ్య రామమందిరానికి భక్తులు సమర్పించిన కానుకలన్నీ భద్రంగా ఉన్నాయని శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ స్పష్టం చేసింది. మార్చి 31, 2026 నాటికి ట్రస్ట్ ఆధీనంలో 32.259 కేజీల బంగారం.. 1,518.925 కేజీల వెండి వస్తువులు ఉన్నట్లు అధికారికంగా ప్రకటించింది. విరాళాల చోరీ వివాదం నేపథ్యంలో రామాలయ ట్రస్ట్ కానుకల లెక్కలు తేల్చింది. మాయమయ్యాయంటూ సోషల్ మీడియాలో ప్రచారం జరిగిన బంగారు రామచరితమానస్, వజ్రాల నెక్లెస్, వెండి పాదుకలను ట్రస్ట్ సభ్యులు మీడియా సమక్షంలో ప్రదర్శించారు. ప్రతి కానుకకూ దాత వివరాలతో సహా రికార్డులు ఉన్నాయని ట్రెజరర్ స్వామి గోవింద్ దేవ్ గిరి తెలిపారు. ఏటా స్వతంత్ర సీఏ సంస్థతో భౌతిక తనిఖీలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. భక్తులు ఇచ్చిన 849 కేజీల వెండి వస్తువులను భారత ప్రభుత్వ మింట్ ద్వారా కరిగించి, శుద్ధి చేసి భద్రపరిచామని గోవింద్ పేర్కొన్నారు. కాగా, విరాళాల దుర్వినియోగం ఆరోపణల నేపథ్యంలో జనరల్ సెక్రటరీ చంపత్ రాయ్, సభ్యుడు అనిల్ మిశ్రాలు రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ తాత్కాలిక జనరల్ సెక్రటరీగా కృష్ణ మోహన్‌ను నియమించింది. ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసేందుకు ప్రత్యేక సీఈఓ నియామకానికి నిర్ణయం తీసుకుంది. సిట్ దర్యాప్తునకు పూర్తి సహకారం అందిస్తామని, తప్పు చేసిన వారిని వదిలేది లేదని ట్రస్ట్ స్పష్టం చేసింది.

# నౌకలపై ఇరాన్ మిస్సైల్ దాడి

**టెహ్రాన్, జూలై 7:** హోర్ముజ్ జలసంధిలో మరోసారి ఉద్రిక్త పరిస్థితులు చోటుచేసుకున్నాయి. హోర్ముజ్‌లో ప్రయాణిస్తున్న రెండు నౌకలపై ఇరాన్ రెవల్యూషనరీ కార్ప్స్ గార్డ్స్ దాడులు చేసింది. రెండు నౌకలపై మిస్సైల్స్ ప్రయోగించింది. ఈ దాడుల్లో రెండు నౌకలు దెబ్బ తిన్నాయి. ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు. ఈ విషయాన్ని అమెరికా అధికారులు మీడియాకు వెల్లడించారు. కాగా, మూడు వారాల క్రితం అమెరికా, ఇరాన్ దేశాలు మెమొరాండమ్ ఆఫ్ అండర్‌స్టాండింగ్‌పై సంతకాలు చేశాయి. ఈ ఒప్పందం ప్రకారం హోర్ముజ్ జలసంధిలో దాడులు ఆపేస్తామని ఇరాన్ ప్రకటించింది. రెండు దేశాల మధ్య శాంతి ఒప్పందం జరిగిన తర్వాత కూడా ఇరాన్ దాడులకు పాల్పడటంపై అమెరికా ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. మరో ఘటనలో.. ఒమన్‌లోని లిమా తీరంలో దక్షిణ దిశగా ప్రయాణిస్తున్న ఓ ఆయిల్ ట్యాంకర్‌ను పేలుడు వస్తువు బలంగా ఢీకొట్టింది. దీని కారణంగా ఆ నౌక ఎడమ వైపు భాగంలో భారీగా మంటలు చెలరేగాయి. బ్రిటీష్ మిలిటరీకి చెందిన 'యునైటెడ్ కింగ్‌డమ్ మారిటైమ్ ట్రేడ్ ఆపరేషన్స్' ఈ ప్రమాదాన్ని అధికారికంగా ధ్రువీకరిస్తూ ప్రకటన విడుదల చేసింది.

# దేశవ్యాప్తంగా వరుణుడి బీభత్సం

- కేరళ, మహారాష్ట్ర, కాశ్మీర్, గుజరాత్‌ను ముంచెత్తిన భారీ వర్షాలు
- వయనాడ్‌లో విరిగిపడ్డ కొండచరియలు..
- ముగ్గురు మృతి; ముంబై వీధులు జలమయం





**తిరువనంతపురం/ముంబై, జూలై 7:** దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో వరుణుడు ప్రతాపం చూపిస్తున్నాడు. కేరళ, మహారాష్ట్ర, జమ్మూకాశ్మీర్, గుజరాత్ రాష్ట్రాలలో కురుస్తున్న కుండపోత వర్షాలు, ఆకస్మిక వరదలు ప్రజల జీవితాలను అతలాకుతలం చేస్తున్నాయి. కేరళలోని వయనాడ్ జిల్లాలో సోమవారం అర్ధరాత్రి నుంచి కురుస్తున్న రికార్డు స్థాయి భారీ వర్షాలు తీవ్ర విషాదాన్ని నింపాయి. 24 గంటల వ్యవధిలోనే సుమారు 265 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కావడంతో మంగళవారం మధ్యాహ్నం మేప్పాడి సమీపంలోని కల్లాడి ప్రాంతంలో భారీగా కొండచరియలు విరిగిపడ్డాయి. మలప్పురం--వయనాడ్ జిల్లాలను కలిపే నిర్మాణంలో ఉన్న సొరంగ మార్గం (మీనాక్షి వంతెన సమీపంలో) వద్ద ఈ దారుణం జరిగింది. కొండపై నుంచి మట్టి, బండరాళ్లు ఒక్కసారిగా విరిగిపడి కార్మికుల వసతి గృహంతో పాటు కొన్ని ఇళ్లు, హోమ్‌స్టేలపై పడ్డాయి. ఈ ప్రమాదంలో ముగ్గురు కార్మికులు మృతి చెందగా, మట్టి కింద కూరుకుపోయిన ఆరుగురిని స్థానికులు రక్షించారు. శిథిలాల కింద మరో 30 మంది వరకు చిక్కుకుని ఉండొచ్చని అధికారులు అనుమానిస్తున్నారు. ప్రతికూల వాతావరణం, నిరంతర వర్షం కారణంగా ఎన్‌డీఆర్‌ఎఫ్, అగ్నిమాపక, పోలీసు సిబ్బంది సాగిస్తున్న సహాయక చర్యలకు తీవ్ర ఆటంకం కలుగుతోంది. సమీపంలోని దాదాపు 100 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ఈ ఘోర ప్రమాదంపై కేరళ ముఖ్యమంత్రి వి.డి. సతీశన్ అత్యవసర సమావేశం నిర్వహించి, యుద్ధప్రాతిపదికన సహాయక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పరిస్థితిని పర్యవేక్షించేందుకు మంత్రులు అనిల్ కుమార్, సిద్ధిక్‌లను వయనాడ్‌కు పంపించారు. కాగా, 2024లోనూ వయనాడ్‌లోని ముండక్కై, చూర్‌మాలా ప్రాంతాల్లో కొండచరియలు విరిగిపడి 298 మంది మరణించిన సంగతి తెలిసిందే.

**ముంబైని ముంచెత్తిన జోరువాన**

దేశ ఆర్థిక రాజధాని ముంబై సహా మహారాష్ట్రలోని పలు ప్రాంతాలను కుండపోత వర్షాలు ముంచెత్తాయి. గత 24 గంటల్లో కొన్ని ప్రాంతాలలో గరిష్టంగా 600 మిల్లీమీటర్ల వర్షం కురవగా, ప్రముఖ హిల్ స్టేషన్ లోనవాలాలో ఏకంగా 670 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ముంబై వీధులన్నీ జలమయమవడంతో రహదారి రవాణా స్తంభించింది. రైలు సర్వీసులు చాలావరకు నిలిచిపోగా, వందలాది విమాన సర్వీసులు ఆలస్యంగా నడుస్తున్నాయి. ముంబై--పుణె మార్గంలోని కర్జత్-లోనావాలా ఘాట్ రోడ్డులో కొండచరియలు విరిగిపడటంతో రెండు రోజులుగా భారీ ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. పరిస్థితి తీవ్రత దృష్ట్యా ముంబై, థానే, పుణె, పాల్ఘర్ పరిసరాల్లో విద్యాసంస్థలకు సెలవులు ప్రకటించారు. వాతావరణ శాఖ ముంబైకి ఆరెంజ్ అలర్ట్ జారీ చేయగా, అత్యవసరమైతే తప్ప ప్రజలు ఇళ్లనుంచి బయటకు రావద్దని అధికారులు హెచ్చరించారు.

**కాశ్మీర్‌లో ఆకస్మిక వరదలు.. గుజరాత్‌లో నిండిన ప్రాజెక్టులు**

జమ్మూకాశ్మీర్‌లోని డోడా, కిష్త్వార్ జిల్లాల్లో గత రెండు రోజుల్లో వరుసగా మూడోసారి ఆకస్మిక వరదలు సంభవించాయి. డోడా జిల్లా తాత్రి పట్టణంలో మంగళవారం కొండచరియలు విరిగిపడి, ఎగువ నుంచి వచ్చిన వరద తాకిడికి ఇళ్లు, దుకాణాలు పాక్షికంగా దెబ్బతిన్నాయి. రోడ్డు పక్కన నిలిపిన అనేక వాహనాలు మట్టిలో కూరుకుపోగా, కొన్ని చీనాబ్ నదిలో కొట్టుకుపోయాయి. వరదల వల్ల డోడా-కిష్త్వార్ జాతీయ రహదారి మూతపడింది. అయితే ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని డిప్యూటీ కమిషనర్ కృష్ణన్ లాల్ తెలిపారు. మరోవైపు గుజరాత్ అంతటా విస్తారంగా కురుస్తున్న వర్షాలకు నదులు, వాగులు ఉప్పొంగుతున్నాయి. నీటిపారుదల ప్రాజెక్టులు జలకళను సంతరించుకున్నాయి. భావ్‌నగర్ జిల్లా పాలితానాలోని శెత్రుంజీ డ్యామ్‌కు వరద పోటెత్తడంతో అధికారులు ప్రాజెక్టుకు చెందిన 59 గేట్లను ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. వర్షాల తీవ్రత దృష్ట్యా కొండ ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ హెచ్చరించింది.

చురకలు



# బొగత జలపాతాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలి

**కలెక్టర్ హేమంత్ సహదేవరావు**

**ములుగు, జూలై 7:**



వాజేడు మండలంలోని బొగత జలపాతాన్ని రాష్ట్రంలోనే ప్రముఖ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసి, పర్యాటకులను ఆకర్షించేలా అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు అధికారులను ఆదేశించారు. పర్యాటకులకు స్థానిక సాంప్రదాయ వంటకాలను అందుబాటులో ఉంచేందుకు ఇందిరా మహిళా శక్తి ఫుడ్ కోర్ట్ ఏర్పాటు చేయాలని సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో బొగత జలపాతం అభివృద్ధి, పర్యాటకులకు కల్పించాల్సిన సౌకర్యాలు, ఇందిరా మహిళా శక్తి ఫుడ్ కోర్ట్ నిర్వహణ, స్వయం సహాయక సంఘాల భాగస్వామ్యంపై అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. జలపాతం పరిస రాలను పరిశుభ్రంగా, ఆకర్షణీయంగా తీర్చిదిద్దడంతో పాటు తాగునీరు, పారిశుధ్యం, పార్కింగ్, విశ్రాంతి కేంద్రాలు, భద్రత, దిశానిర్దేశక బోర్డులు వంటి అన్ని సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. ఇందిరా మహిళా శక్తి ఫుడ్ కోర్ట్ ద్వారా జొన్న రొట్టె, బాంబూ చికెన్, నాటుకోడి, చేపల వంటకాలు వంటి స్థానిక సాంప్రదాయ ఆహారాలను పర్యాటకులకు అందించాలని, దీనివల్ల మహిళా స్వయం సహాయక సంఘాలకు ఉపాధి, ఆదాయం పెరుగుతుందని తెలిపారు. పర్యాటక ప్రాంతంలో స్థానిక ప్రత్యేకతను ప్రతిబింబించే ఆహార పదార్థాలకు ప్రాధాన్యం ఇస్తూ నాణ్యమైన సేవలు అందించాలని, బొగత జలపాతాన్ని రాష్ట్ర స్థాయిలో ఆదర్శ పర్యాటక కేంద్రంగా తీర్చి దిద్దేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. సమావేశంలో ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్, డీఎఫ్ఓ వికాస్ మీనా, టూరిజం అధికారి శివాజీ, అదనపు డీఆర్‌డీఓ శ్రీనివాస్ తదితర అధికారులు పాల్గొన్నారు.

# ఆయిల్‌పామ్ నాట్లకు ముందే డ్రిప్ ఏర్పాటు పూర్తి చేయాలి

**జిల్లా ఉద్యాన అధికారి**

**పెద్దపల్లి, జూలై 7 :**

జిల్లాలో ఆయిల్‌పామ్ తోటల ఏర్పాటును వేగవంతం చేయాలని, నాట్లకు ముందే డ్రిప్ ఇరిగేషన్ వ్యవస్థను పూర్తి చేయాలని జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమల అధికారి గడ్డం శ్యాంప్రసాద్ డ్రిప్ కంపెనీల ప్రతినిధులను ఆదేశించారు. మంగళవారం పెద్దపల్లి మండలంలోని పలు పొలాలను పరిశీలించిన ఆయన, ప్రభుత్వం మంజూరు చేసిన డ్రిప్ సామగ్రిని రైతులకు సకాలంలో అందజేసి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. సరఫరా లేదా ఏర్పాటు పనుల్లో జాప్యం జరిగితే సంబంధిత కంపెనీలను బ్లాక్‌లిస్ట్ చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డ్రిప్ కంపెనీల నిర్లక్ష్యం వల్ల ఒక్క ఆయిల్‌పామ్ మొక్క కూడా ఎండిపోకుండా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.రైతులు పైపులైన్ల ఏర్పాటు వంటి పనుల్లో కంపెనీలకు సహకరించాలని కోరిన ఆయన, ఎస్సీ/ఎస్టీ రైతులకు 90 శాతం, ఇతర రైతులకు 80 శాతం, ఐదు ఎకరాలకు మించి సాగు చేసే వారికి 70 శాతం రాయితీతో డ్రిప్ పరికరాలు అందిస్తున్నట్లు తెలిపారు. కొత్తగా దరఖాస్తు చేసుకునే రైతులు అవసరమైన ధ్రువపత్రాలను సమర్పించాలని సూచించారు. అనంతరం రంగంపల్లి గ్రామానికి చెందిన రైతు పూదారి చంద్రశేఖర్ మూడు ఎకరాల్లో డ్రిప్ ఇరిగేషన్, మల్చింగ్ పద్ధతిలో సాగు చేస్తున్న గ్రాఫ్టెడ్ కూరగాయల తోటను పరిశీలించి అభినందించారు. నీటిని పొదుపు చేస్తూ ఆధునిక సాగు పద్ధతులను అనుసరించి అధిక దిగుబడులు సాధించాలని రైతులకు సూచించారు.



# "సురక్షా మిత్ర – సైబర్ భద్రత"పై విస్తృత అవగాహన కార్యక్రమాలు

**ఎస్సై రమేష్ కుమార్ (కుల్కచర్ల)**

**కుల్కచర్ల మండలం, జులై,07:**



తెలంగాణ రాష్ట్ర పోలీస్ శాఖ డైరెక్టర్ జనరల్ (డీజీపీ) మరియు జిల్లా పోలీసు సూపరింటెండెంట్ (ఎస్పీ) ఆదేశాల మేరకు, కుల్కచర్ల పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో మంగళవారం పోలీస్ స్టేషన్ పరిధిలోని బండెన్‌కిచర్ల గ్రామాలలో సురక్షా మిత్ర మరియు సైబర్ భద్రతపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించబడినవి. ఈ కార్యక్రమాల్లో గ్రామ ప్రజలు, యువత, మహిళలు, ప్రజాప్రతినిధులు మరియు గ్రామ పెద్దలు పాల్గొన్నారు. పోలీసు అధికారులు సురక్షా మిత్ర కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశ్యం, సమాజంలో శాంతి భద్రతల పరిరక్షణలో ప్రజల భాగస్వామ్యం, పోలీసులకు సమాచార సహకారం, గ్రామ స్థాయిలో నేరాల నివారణలో సురక్షా మిత్రల పాత్ర గురించి వివరంగా అవగాహన కల్పించారు.అదేవిధంగా, ప్రస్తుతం పెరుగుతున్న సైబర్ నేరాలు మరియు వాటి నుండి రక్షణ పొందేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు వివరించారు. ముఖ్యంగా డిజిటల్ అరెస్ట్, OTP మోసాలు, KYC అప్‌డేట్ పేరుతో జరిగే మోసాలు, ఫేక్ లింకులు, QR కోడ్ స్కామ్‌లు, పార్ట్‌టైమ్ జాబ్ మోసాలు, ఇన్వెస్ట్‌మెంట్ మరియు ట్రేడింగ్ మోసాలు, సోషల్ మీడియా హ్యాకింగ్, నకిలీ కస్టమర్ కేర్ కాల్స్, లోన్ యాప్ మోసాలు వంటి సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు.ప్రజలు తమ OTP, బ్యాంకు ఖాతా వివరాలు, ATM PIN, CVV, UPI PIN మరియు ఇతర వ్యక్తిగత సమాచారాన్ని ఎవరికీ వెల్లడించకూడదని, అనుమానాస్పద లింకులు, యాప్‌లు లేదా కాల్స్‌ను నమ్మవద్దని సూచించారు.ఈ సందర్భంగా ప్రతి గ్రామానికి ప్రత్యేకంగా సురక్షా మిత్ర వాట్సాప్ గ్రూప్‌లు ఏర్పాటు చేసి, గ్రామ ప్రజలు, సురక్షా మిత్ర సభ్యులు మరియు సంబంధిత పోలీసు అధికారులను అనుసంధానం చేశారు. ఈ గ్రూపుల ద్వారా సైబర్ భద్రత, నేరాల నివారణ, ప్రజా భద్రత, అత్యవసర సమాచారాన్ని వేగంగా ప్రజలకు చేరవేయడంతో పాటు, గ్రామ స్థాయిలో పోలీస్–ప్రజల సమన్వయాన్ని మరింత బలోపేతం చేయడం లక్ష్యంగా ఉందని తెలిపారు.ప్రజలు సైబర్ మోసాలకు గురైన వెంటనే గోల్డెన్ అవర్లో స్పందించడం ఎంతో ముఖ్యమని, ఆలస్యం చేయకుండా 1930 సైబర్ హెల్ప్‌లైన్కు ఫిర్యాదు చేయాలని లేదా www.cybercrime.gov.in ద్వారా ఆన్‌లైన్‌లో ఫిర్యాదు నమోదు చేయాలని సూచించారు. అలాగే సమీప పోలీస్ స్టేషన్‌ను వెంటనే సంప్రదించాలని కోరారు. కుల్కచర్ల పోలీసులు ప్రజలు అప్రమత్తంగా ఉంటూ, సురక్షితమైన డిజిటల్ సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని, సురక్షా మిత్ర కార్యక్రమంలో చురుకుగా పాల్గొని పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

# జోగులాంబ జోన్–7 పోలీస్ డ్యూటీ మీట్‌లో నారాయణపేట జిల్లా పోలీసుల ప్రతిభ...

- **పలు విభాగాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి బహుమతులు కైవసం**
- **మహబూబ్ నగర్ ఎస్పీ జానకి (ఐపీఎస్) చేతుల మీదుగా విజేతలకు ప్రశంస పత్రాలు**





**నారాయణపేట, జులై,07:**

మహబూబ్‌నగర్ జిల్లా పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో 6,7 వ తేదీన నిర్వహించిన జోగులాంబ పోలీస్ జోన్–7 పోలీస్ డ్యూటీ మీట్లో నారాయణపేట జిల్లా పోలీసు అధికారులు, సిబ్బంది వివిధ విభాగాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి పలు బహుమతులను కైవసం చేసుకున్నారు.వృత్తిపరమైన నైపుణ్యం, శిక్షణ, అంకితభావానికి నిదర్శనంగా నారాయణపేట జిల్లా పోలీసు సిబ్బంది వివిధ సాంకేతిక, దర్యాప్తు, ప్రత్యేక విభాగాల్లో పాల్గొని విశిష్ట ప్రతిభ కనబరిచారు.

**విజేతల వివరాలు:**

**క్రైమ్ ఇన్వెస్టిగేషన్ & క్రిమినల్ లాస్ విభాగంలో– కృష్ణ ఎస్సై(ఎస్.ఎం. నవీద్) ద్వితీయ స్థానం సాధించారు.**

**ఫోటోగ్రఫీ విభాగంలో – పీసీ సి. వెంకట్ రాములు (PRO) ప్రథమ స్థానం సాధించారు.**

**వీడియోగ్రఫీ విభాగంలో – పీసీ బి. నరేష్ ప్రథమ స్థానం సాధించారు.**

**ట్రాకింగ్ విభాగంలో – పోలీస్ జాగిలం "రుద్ర", హ్యాండ్లర్లు రవి, నరేందర్ ద్వితీయ స్థానం సాధించారు.**

బాంబు డిస్పోజల్ టీమ్ – రూమ్ సెర్చ్ విభాగంలో డి . లక్ష్మీకాంత్ రెడ్డి, ఆంజనేయులు ప్రథమ స్థానంలో రావడం జరిగింది. మరియు యాక్సిస్ కంట్రోల్ విభాగంలో – డి. లక్ష్మీకాంత్ రెడ్డి, ఆంజనేయులు ద్వితీయ స్థానం సాధించారు.ఈ సందర్భంగా మహబూబ్‌నగర్ జిల్లా ఎస్పీ జానకి విజేతలకు ప్రశంసా పత్రాలు అందజేసి అభినందనలు తెలిపారు. జోనల్ స్థాయిలో ప్రతిభ కనబరిచిన పోలీసు అధికారులు, సిబ్బంది రాష్ట్ర స్థాయి పోలీస్ డ్యూటీ మీట్‌లో కూడా ఇదే ఉత్సాహం, నైపుణ్యంతో పాల్గొని మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. నారాయణపేట జిల్లా పోలీసు సిబ్బంది సాధించిన ఈ విజయాలు జిల్లా పోలీసు శాఖకు గర్వకారణమని, పోలీసు శాఖలో ఉన్న వృత్తి నైపుణ్యం, నిరంతర శిక్షణ, సేవా తత్పరతకు ఈ ఫలితాలు నిదర్శనమని డ్యూటీ మీట్ ఇంచార్జ్ మరికల్ సీఐ భగవంత్ రెడ్డి పేర్కొన్నారు.జిల్లా పోలీసు అధికారులు, సహచర సిబ్బంది విజేతలను అభినందిస్తూ, రాష్ట్ర స్థాయి పోటీల్లోనూ ఉత్తమ ప్రతిభ కనబరిచి జిల్లా, జోన్‌కు మరింత పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

# అధిక లాభాల కోసం ఆయిల్ పామ్ సాగు చేయాలి: కలెక్టర్ ఇలా త్రిపాఠి

**నిజామాబాద్, జూలై 7 :**

: అధిక దిగుబడి, మంచి మద్దతు ధరతో లాభదాయకమైన ఆయిల్ పామ్ సాగును రైతులు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి పిలుపునిచ్చారు. మాక్లూర్ మండలం చిన్నాపూర్‌లో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడుతూ, డ్రిప్‌కు 90 శాతం సబ్సిడీ, నాలుగేళ్లపాటు ఎకరానికి రూ.4,200 ఇన్‌పుట్ సబ్సిడీ, మొక్కలపై రాయితీలు ప్రభుత్వం అందిస్తోందని తెలిపారు. ఎకరానికి రూ.1.5 లక్షల నుంచి రూ.2 లక్షల వరకు ఆదాయం పొందే అవకాశం ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆయిల్ పామ్ సాగులో విజయవంతమైన రైతులను సన్మానించగా, పలువురు రైతులు సాగుకు ముందుకు వచ్చి డీడీలు చెల్లించారు.

# విద్యా సంస్థల్లో నిర్లక్ష్యానికి తావిస్తే కఠిన చర్యలు: కలెక్టర్ ఇలా త్రిపాఠి



**నిజామాబాద్, జూలై 7:**

వసతి గృహాలు, పాఠశాలలు, రెసిడెన్షియల్ స్కూళ్లు, కళాశాలల నిర్వహణలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి హెచ్చరించారు. జక్రాన్‌పల్లి మండలం మునిపల్లిలోని మహాత్మా జ్యోతిబాపూలే బీసీ వెల్ఫేర్ బాలికల రెసిడెన్షియల్ జూనియర్, డిగ్రీ కళాశాలను మంగళవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టోర్‌రూమ్, వంటగది, డైనింగ్ హాల్, డార్మెటరీలు, తరగతి గదులను పరిశీలించిన కలెక్టర్ ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం విద్యార్థినులకు భోజనం అందిస్తున్నారా అనే అంశాన్ని తనిఖీ చేశారు. వంటగది, డైనింగ్ హాల్, స్టోర్‌రూమ్ అపరిశుభ్రంగా ఉండటంతో అసంతృప్తి వ్యక్తం చేసిన ఆమె, నిర్వహణ బాధ్యతలు చేపట్టిన ఏజెన్సీని మార్చాలని అధికారులను ఆదేశించారు. వర్షాకాలంలో పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, విద్యార్థినుల ఆరోగ్యంపై రాజీ పడకుండా క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, శుభ్రమైన పౌష్టికాహారం అందించాలని సూచించారు. అనంతరం ఇంటర్ ద్వితీయ సంవత్సరం బైపీసీ విద్యార్థినులతో మాట్లాడి ఫిజిక్స్, కెమిస్ట్రీ అంశాలపై ప్రశ్నలు అడిగి, ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కిరణ్మయి, కళాశాల ప్రిన్సిపాల్ అనూష తదితరులు పాల్గొన్నారు.

# భువనగిరి మాజీ ఎమ్మెల్యే కొమ్మిడి నర్సింహారెడ్డి మృతిపై స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ సంతాపం

**హైదరాబాద్, జూలై 7:.**



భువనగిరి నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు కొమ్మిడి నర్సింహారెడ్డి మృతి పట్ల తెలంగాణ రాష్ట్ర శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. 1978 నుంచి 1985 వరకు వరుసగా రెండు పర్యాయాలు భువనగిరి ఎమ్మెల్యేగా ప్రజలకు సేవలందించిన నర్సింహారెడ్డి ప్రజాసేవలో విశిష్టమైన ముద్ర వేశారని స్పీకర్ పేర్కొన్నారు. కొమ్మిడి నర్సింహారెడ్డి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ తెలిపారు.

# రోడ్డు పనులు వేగవంతం చేయాలి: కలెక్టర్ రాజర్షి షా



**ఆదిలాబాద్, జూలై 7:**

జిల్లాలో రోడ్డు నిర్మాణ పనులను నాణ్యత ప్రమాణాలతో నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అధికారులను ఆదేశించారు. మంగళవారం ఈదులసావర్గామ్–నిపాని–అర్లీ(టీ) మార్గంలో రూ.18 కోట్లతో చేపడుతున్న రహదారి అభివృద్ధి పనులను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

ఇప్పటికే రూ.5 కోట్ల విలువైన పనులు పూర్తయ్యాయని, ప్రస్తుతం రూ.3 కోట్లతో దెబ్బతిన్న సుమారు మూడు కిలోమీటర్ల రహదారి పునర్నిర్మాణం జరుగుతోందని అధికారులు కలెక్టర్‌కు వివరించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని పనులను మరింత వేగవంతం చేయాలని, నాణ్యతలో ఎలాంటి రాజీ లేకుండా ఇంజినీరింగ్ ప్రమాణాలు పాటించాలని కలెక్టర్ సూచించారు. పనుల సమయంలో ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా భద్రతా చర్యలు, హెచ్చరిక బోర్డులు, ట్రాఫిక్ మళ్లింపు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ప్రజల రాకపోకలకు అంతరాయం లేకుండా యుద్ధ ప్రాతిపదికన పనులు పూర్తి చేసి రహదారిని త్వరగా అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్‌ను కలెక్టర్ ఆదేశించారు.

# ఇండోనేషియా అధ్యక్షుడితో ప్రధాని మోదీ ద్వైపాక్షిక చర్చలు

## రక్షణ, వాణిజ్యం, డిజిటల్ టెక్నాలజీ సహా పలు రంగాల్లో ఒప్పందాలు

**న్యూఢిల్లీ/జకార్తా, జూలై 7:**

ఇండోనేషియా పర్యటనలో ఉన్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ఆ దేశ అధ్యక్షుడు ప్రబోవో సుబియాంటో ఘన స్వాగతం పలికారు. అనంతరం ఇద్దరు నాయకులు ద్వైపాక్షిక చర్చలు నిర్వహించి, భారత్–ఇండోనేషియా సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడంపై విస్తృతంగా చర్చించారు. వాణిజ్యం, పెట్టుబడులు, రక్షణ, సముద్ర భద్రత, డిజిటల్ మరియు ఆర్థిక సాంకేతికత, ఇంధనం, ఆరోగ్యం, ఔషధాలు, అంతరిక్షం, కీలక ఖనిజాలు, పర్యాటకం, వ్యవసాయం తదితర రంగాల్లో సహకారాన్ని విస్తరించేందుకు ఇరు దేశాలు అంగీకరించాయి. భారతదేశం అభివృద్ధి చేసిన ఓపెన్ నెట్‌వర్క్ ఫర్ డిజిటల్ కామర్స్ (ఓఎన్‌డీసీ) నమూనా ఆధారంగా ఇండోనేషియా ఓపెన్ నెట్‌వర్క్ (ఐఓఎన్) ప్రారంభాన్ని స్వాగతించాయి. 2027లో రవీంద్రనాథ్ ఠాగూర్ ఇండోనేషియా పర్యటన శతాబ్ది సందర్భంగా ★"ఠాగూర్–దేవాంతర సాంస్కృతిక, విద్యా దౌత్య సంవత్సరం"★గా సంయుక్తంగా నిర్వహించనున్నట్లు ప్రధాని మోదీ ప్రకటించారు. ఇండో–పసిఫిక్ ప్రాంతంలో స్వేచ్ఛాయుత, నియమాల ఆధారిత వ్యవస్థకు కట్టుబడి ఉన్నామని ఇరు దేశాలు పునరుద్ఘాటించాయి. అలాగే రక్షణ, కీలక ఖనిజాలు, విజ్ఞానశాస్త్రం, విద్య, టెలికమ్యూనికేషన్స్, వ్యవసాయం, సముద్ర భద్రత, అంతరిక్షం, విపత్తు నిర్వహణ, ఆరోగ్య రంగాల్లో పలు అవగాహన ఒప్పందాలు (ఎంఓయూలు) కుదుర్చుకున్నాయి. చర్చల అనంతరం అధ్యక్షుడు ప్రబోవో ప్రధాని మోదీ గౌరవార్థం విందు ఏర్పాటు చేయగా, మోదీ ఆయనను భారత్‌ను సందర్శించాలని ఆహ్వానించారు.

# మహిళలు, చిన్నారుల భద్రతే లక్ష్యం

## పోలీసుల-ప్రజల మధ్య అవగాహన కల్పించడం





**బొంరస్ పేట మండలం,07:**

బొంరస్ పేట మండలంలోని టేకుల గడ్డ తండా పాఠశాలలో జిల్లా పోలీస్ శాఖ ఆదేశాల మేరకు సురక్ష మిత్ర అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించినారు.వికారాబాద్ జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో మహిళలు, చిన్నారుల భద్రతను మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో "సురక్షా మిత్ర" కార్యక్రమాన్ని బొంరాస్ పేట రక్షకభట నిలయ అధికారి రవి నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రవి నాయక్ ప్రధానోపాధ్యాయులు గౌరారం గోపాల్ మాట్లాడుతూ,, మహిళల భద్రత, అత్యవసర సహాయ సేవలు, సైబర్ నేరాల నివారణ, చట్టపరమైన హక్కులు, పోలీసు సహాయాన్ని ఎలా పొందాలనే అంశాలపై అవగాహన కల్పించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఏదైనా అత్యవసర పరిస్థితి ఎదురైతే వెంటనే పోలీసులను సంప్రదించాలని అధికారులు సూచించారు.ఈ అవగాహన కార్యక్రమంలో పాలనధికారి శ్రీనివాస్ గ్రామ కాంగ్రెస్ నాయకులు రాజు మహిళా సంఘాల మహిళా మణులు జెమినీ భాయ్ రుక్కి బాయ్, రత్తిబాయ్ చావ్లిబాయ్ రమణి బాయ్ సఫాయి కార్మికులు సేవియా నాయక్ గ్రామ పెద్దలు చందర్ నాయక్,తదితరులు పాల్గొన్నారు.

# సాంఘిక సంక్షేమ గురుకులాల్లో పార్ట్‌టైం పోస్టుల డెమోలు వాయిదా

**సంగారెడ్డి, జులై 7:.**

తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ పరిధిలోని పాఠశాలలు, కళాశాలల్లో పార్ట్‌టైం జూనియర్ లెక్చరర్లు, పీజీటీలు, టీజీటీలు తదితర పోస్టుల భర్తీ కోసం జులై 8న నిర్వహించాల్సిన డెమోలను తాత్కాలికంగా వాయిదా వేసినట్లు జిల్లా సమన్వయ అధికారి కల్పన తెలిపారు. హైదరాబాద్‌లోని గురుకులాల సెక్రటరీ కార్యాలయం నుంచి వచ్చిన ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. డెమోల నిర్వహణకు సంబంధించిన కొత్త తేదీని సంస్థ త్వరలో అధికారికంగా ప్రకటిస్తుందని వెల్లడించారు.

# రూ.338 కోట్లతో నాలుగు లేన్ల రహదారులకు శంకుస్థాపన.



**ఇబ్రహీంపట్నం, జూలై 7:.**

ఇబ్రహీంపట్నం, మేడ్చల్, మహేశ్వరం నియోజకవర్గాల్లో రూ.338 కోట్ల వ్యయంతో హామ్ విధానంలో చేపట్టనున్న ఆధునిక నాలుగు లేన్ల రహదారుల నిర్మాణ పనులకు రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్రవ్యాప్తంగా రహదారుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నామని, తెలంగాణను దేశానికి ఆదర్శంగా నిలిచే రహదారుల రాష్ట్రంగా తీర్చి దిద్దుతామని అన్నారు. ఎంపీలు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, ఈటల రాజేందర్, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, ఎమ్మెల్సీ శంకర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# కేటీఆర్ విమర్శలు అనవసరం..

**వికారాబాద్, జూలై 7:**

ధారూర్ మండలం తరిగోపుల గ్రామసభలో తెలంగాణ రాష్ట్ర శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ కేటీఆర్ వ్యాఖ్యలపై స్పందించారు. వికారాబాద్ పర్యటనలో కేటీఆర్ తనపై చేసిన విమర్శలను ప్రస్తావిస్తూ, శాసనసభ్యుల అనర్హత అంశంపై ఇప్పటికే సభలోనే సమాధానం ఇచ్చానని తెలిపారు. శాసనసభ్యుల అనర్హతపై తన అధికార పరిధిలోనే నిర్ణయం తీసుకుని 54 పేజీలతో కూడిన తీర్పు ఇచ్చానని స్పీకర్ పేర్కొన్నారు.

# మహిళలతో ఘనంగా "గోరింటాకు సంబరాలు" కార్యక్రమం

- **బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించిన వారిపై ఈ-పెటీ కేసులు నమోదు-ఎస్సై రమేష్ కుమార్**

**కుల్కచర్ల మండలం, జులై,07:**



వికారాబాద్ జిల్లా పోలీసు అధికారి (ఎస్పీ) ఆదేశాల మేరకు, కుల్కచర్ల పోలీస్ స్టేషన్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజలకు ప్రశాంత వాతావరణం కల్పించడం మరియు బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం, అక్రమంగా పర్మిట్ రూమ్‌లు నిర్వహించడం వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలను అరికట్టేందుకు మంగళవారం ప్రత్యేక తనిఖీలు మరియు ఆకస్మిక దాడులు నిర్వహించబడినవి.ఈ సందర్భంగా హోటళ్లు, సమీపంలోని దుకాణాలు, అనుమతి లేని పర్మిట్ రూమ్‌లు మరియు ఇతర అనుమానాస్పద ప్రదేశాలను విస్తృతంగా తనిఖీ చేయగా, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తూ ప్రజలకు అసౌకర్యం కలిగిస్తున్న పలువురిపై ఈ–పెటీ కేసులు నమోదు చేయడం జరిగింది. అదేవిధంగా, మద్యం విక్రయానికి మాత్రమే అనుమతి ఉండి, విని యోగానికి అనుమతి లేని ప్రదేశాల్లో కస్టమర్లను కూర్చోబెట్టి మద్యం తాగేందుకు అవకాశం కల్పించడం, మద్యంతో పాటు స్నాక్స్, స్టార్టర్స్ మరియు ఇతర ఆహార పదార్థాలను సరఫరా చేయడం, అక్రమంగా పర్మిట్ రూమ్‌లను నిర్వహించడం పూర్తిగా చట్టవిరుద్ధమని సంబంధిత నిర్వాహకులకు కఠినంగా హెచ్చరికలు జారీ చేయబడినవి.భవిష్యత్తులో ఇటువంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలు కొనసాగించినట్లయితే సంబంధిత నిర్వాహకులపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు, సంబంధిత శాఖలకు నివేదించి వారి లైసెన్సులపై కూడా తగిన చర్యలు తీసుకునేలా చర్యలు చేపట్టబడతాయని స్పష్టం చేయడమైనది.కుల్కచర్ల పోలీస్ స్టేషన్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ మరియు ప్రజా ప్రశాంతత కోసం ఇటువంటి ప్రత్యేక తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని, ప్రజలు కూడా బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించకుండా చట్టాన్ని గౌరవించాలని, అక్రమంగా నిర్వహిస్తున్న పర్మిట్ రూమ్‌లు లేదా ఇతర చట్టవిరుద్ధ కార్యకలాపాలపై సమాచారం ఉంటే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు తెలియజేయాలని కుల్కచర్ల పోలీస్ వారు విజ్ఞప్తి చేశారు.

# ఆపరేషన్ ముస్కాన్–12లో విస్తృత తనిఖీలు

**కరీంనగర్, జూలై 7:**



ఆపరేషన్ ముస్కాన్–12లో భాగంగా కరీంనగర్ అర్బన్ పరిధిలోని భవన నిర్మాణ ప్రాంతాలు, హోటళ్లు తదితర ప్రాంతాల్లో చైల్డ్ హెల్ప్‌లైన్–1098 ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ సంపత్, మానవ అక్రమ రవాణా నిరోధక విభాగం (ఏహెచ్‌టీయూ) బృందంతో కలిసి విస్తృత తనిఖీలు నిర్వహించారు. తనిఖీల సందర్భంగా తప్పిపోయిన పిల్లలు, బాల కార్మికులు, అక్రమ రవాణాకు గురైన చిన్నారులు ఉన్నారా అనే అంశాలను పరిశీలించారు. అలాగే కార్మికులు, హోటల్ యజమానులకు బాలల హక్కులు, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, బాలల అక్రమ రవాణా నివారణపై అవగాహన కల్పించారు. ఎక్కడైనా బాల కార్మికులు, తప్పిపోయిన పిల్లలు లేదా అక్రమ రవాణాకు గురైన చిన్నారులు కనిపిస్తే వెంటనే చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 లేదా 100కు సమాచారం అందించాలని అధికారులు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఏహెచ్‌టీయూ సిబ్బంది మల్లేశం, సురేందర్ పాల్, స్నేహ తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో జిల్లా పోలీస్ డ్యూటీ మీట్ నిర్వహణ

## పోటీలను పరిశీలించిన జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా ఐపీఎస్

**వికారాబాద్, జులై,07:**



తెలంగాణ రాష్ట్ర పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించనున్న 3వ తెలంగాణ స్టేట్ పోలీస్ డ్యూటీ మీట్–2026 మరియు తదుపరి 70వ అఖిల భారత పోలీస్ డ్యూటీ మీట్ (AIPDM) 2026–27 పోటీలకు సన్నద్ధతలో భాగంగా, వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, IPS ఆదేశాల మేరకు జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో జిల్లా పోలీస్ డ్యూటీ మీట్ నిర్వహించబడింది. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ వివిధ పోటీలను ప్రత్యక్షంగా పరిశీలించడం జరిగింది.ఈ సందర్భంగా పోలీసు సిబ్బంది వృత్తి నైపుణ్యాలను మెరుగుపరచడం, అత్యవసర పరిస్థితుల్లో సమర్థవంతంగా స్పందించే సామర్థ్యాన్ని పెంపొందించడం, రాష్ట్రస్థాయి మరియు జాతీయస్థాయి పోలీస్ డ్యూటీ మీట్ పోటీలకు అర్హులైన ప్రతిభావంతులను ఎంపిక చేయడం లక్ష్యంగా పలు విభాగాల్లో పోటీలు నిర్వహించారు.డ్యూటీ మీట్‌లో భాగంగా యాంటీ సబోటేజ్ చెక్ (Anti-Sabotage Check) నిర్వహించి అనుమానాస్పద వస్తువులు, పేలుడు పదార్థాలను గుర్తించే విధానాలపై పోలీసు బృందాల నైపుణ్యాన్ని ఎస్పీ పరీక్షించారు. అనంతరం K-9 స్క్వాడ్ పోటీలు నిర్వహించగా, ఎక్స్‌ప్లోసివ్ డిటెక్షన్ డాగ్స్ పేలుడు పదార్థాలను గుర్తించే సామర్థ్యాన్ని ప్రదర్శించగా, నార్కోటిక్ డిటెక్షన్ డాగ్స్ మాదకద్రవ్యాలను గుర్తించే ప్రత్యేక నైపుణ్యాన్ని ప్రదర్శించాయి.అలాగే గ్రౌండ్ సెర్చ్, వాహనాల తనిఖీ (Vehicle Search) మరియు గదుల తనిఖీ (Room Search) అంశాల్లో ప్రత్యేక పోటీలు నిర్వహించి, అనుమానాస్పద వస్తువులను గుర్తించడం, శాస్త్రీయ పద్ధతుల్లో తనిఖీలు చేపట్టడం, భద్రతా ప్రమాణాలను పాటిస్తూ ఆపరేషన్లు నిర్వహించడంలో పోలీసు సిబ్బంది ప్రతిభను అంచనా వేశారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, IPS మాట్లాడుతూ, పోలీసు డ్యూటీ మీట్‌లు సిబ్బందిలో వృత్తి నైపుణ్యాలను పెంపొందించడమే కాకుండా, జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచే అవకాశాన్ని కల్పిస్తాయని తెలిపారు. ప్రతి పోలీసు అధికారి, సిబ్బంది ఇటువంటి పోటీలను ఒక సవాల్‌గా స్వీకరించి అత్యుత్తమ ప్రతిభ కనబరిచి జిల్లా పోలీస్ శాఖకు రాష్ట్ర, జాతీయ స్థాయిలో మంచి గుర్తింపు తీసుకురావాలని పోలీసు అధికారులు, సిబ్బందికి సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ రాజేశ్ మీనా, IPS,డిసిఆర్‌బి డిఎస్‌పి జానయ్య,ఏఆర్ డీఎస్పీ వీరేశ్, డిఎస్‌బి ఇన్స్పెక్టర్ లు నాగార్జున,జములప్ప, ఆర్‌ఐ నాగరాజు,వివిధ విభాగాల అధికారులు, పోలీసు సిబ్బంది, డాగ్ స్క్వాడ్ హ్యాండ్లర్లు మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# పని ప్రదేశాల్లో మహిళల భద్రతకు పోష్ చట్టం తప్పనిసరిగా అమలు చేయాలి



- **నిబంధనలు పాటించని సంస్థలకు రూ.50 వేల వరకు జరిమానా: జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలా**

**హైదరాబాద్, జూలై 7:**

హైదరాబాద్ జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలు పని ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపుల (నివారణ, నిషేధం మరియు పరిష్కారం) చట్టం–2013 (పోష్ చట్టం)ను సమర్థవంతంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్, జిల్లా మేజిస్ట్రేట్ డాక్టర్ ప్రియాంక అలా ఆదేశించారు.

10 లేదా అంతకంటే ఎక్కువ మంది ఉద్యోగులు ఉన్న ప్రతి సంస్థలో తప్పనిసరిగా అంతర్గత ఫిర్యాదుల కమిటీ (ఐసీ) ఏర్పాటు చేయాలని తెలిపారు. సీనియర్ మహిళా ఉద్యోగిని అధ్యక్షురాలిగా, మహిళల సంక్షేమం లేదా న్యాయ పరిజ్ఞానం ఉన్న ఇద్దరు సభ్యులను, మహిళల హక్కుల కోసం పనిచేసే స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి లేదా నిపుణుడిని సభ్యునిగా నియమించాలని, మొత్తం సభ్యుల్లో కనీసం సగం మంది మహిళలే ఉండాలని స్పష్టం చేశారు.

లైంగిక వేధింపులకు గురైన మహిళ అంతర్గత కమిటీకి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. ప్రతి యజమాని సురక్షితమైన పని వాతావరణం కల్పించడం, చట్టంపై ఉద్యోగులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం, కార్యాలయంలో కమిటీ వివరాలను ప్రదర్శించడం, విచారణకు అవసరమైన సౌకర్యాలు కల్పించడం, ప్రతి సంవత్సరం వార్షిక నివేదికను జిల్లా కలెక్టర్‌కు సమర్పించడం తప్పనిసరి అని పేర్కొన్నారు.

మహిళా, శిశు సంక్షేమ శాఖతో కలిసి హైదరాబాద్ స్థానిక కమిటీ ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు, ప్రైవేట్ సంస్థల్లో తనిఖీలు నిర్వహిస్తుందని తెలిపారు. పోష్ చట్టం నిబంధనలు పాటించని యజమానులకు రూ.50 వేల వరకు జరిమానా విధించే అవకాశం ఉందని జిల్లా కలెక్టర్ హెచ్చరించారు.

# కామారెడ్డిలో కలెక్టర్ క్షేత్రస్థాయి పరిశీలన



**కామారెడ్డి, జూలై 7:**

జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ మంగళవారం కామారెడ్డి పట్టణంలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్), డ్రై డే, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, వనమహోత్సవ కార్యక్రమాలను పరిశీలించారు. ఎస్ఐఆర్‌లో అర్హులైన ప్రతి ఓటరు పేరు నమోదు చేసి, ఫారాల డిజిటలైజేషన్‌ను ఖచ్చితంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. డ్రై డే సందర్భంగా నీటి నిల్వలు లేకుండా చూసుకుని డెంగ్యూ, మలేరియా నివారణకు సహకరించాలని ప్రజలకు సూచించారు. ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం అమలును తనిఖీ చేసి, అనంతరం వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు.

# వలిగొండ జూనియర్ కళాశాల వద్ద రిక్వెస్ట్ బస్టాండ్‌ను వెంటనే పూర్తి చేయాలి

- నెల రోజుల్లో పనులు ప్రారంభించకపోతే ఎస్ ఎఫ్ ఐ ఆందోళన సిద్ధం.



**వలిగొండ జూలై 07 :**

యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద పెండింగ్‌లో ఉన్న రిక్వెస్ట్ బస్టాండ్ నిర్మాణాన్ని వెంటనే పూర్తి చేయాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు వేముల నాగరాజు డిమాండ్ చేశారు. మంగళవారం ఎస్ఎఫ్ఐ వలిగొండ మండల కమిటీ ఆధ్వర్యంలో కళాశాల వద్ద రిక్వెస్ట్ బస్టాండ్‌ను పరిశీలించి నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వేముల నాగరాజు మాట్లాడుతూ, దాదాపు 12 సంవత్సరాల క్రితం మంజూరైన రిక్వెస్ట్ బస్టాండ్ ఇప్పటికీ పూర్తి కాకపోవడం దురదృష్టకరమన్నారు. వలిగొండ పట్టణానికి సుమారు రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలకు విద్యార్థులు ప్రతిరోజూ నడుచుకుంటూ వెళ్లి రావాల్సిన పరిస్థితి నెలకొన్నదని తెలిపారు. కళాశాల సమయం ముగిసిన తర్వాత ఎండలు, వర్షాలను లెక్కచేయకుండా విద్యార్థులు కాలినడకనే పట్టణానికి చేరుకోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. కళాశాల వద్ద కనీసం ఆర్డినరీ, ఎక్స్‌ప్రెస్ బస్సులు కూడా ఆగకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. పేరుకు మాత్రమే రిక్వెస్ట్ బస్టాండ్ మంజూరై సంవత్సరాలు గడిచినా, నిర్మాణం పూర్తి కాకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. ఈ సమస్యను పలుమార్లు స్థానిక ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లామని, అప్పట్లో బస్టాండ్ నిర్మాణం పూర్తి చేస్తామని హామీ ఇచ్చినా ఇప్పటి వరకు అమలు కాలేదన్నారు. ఎమ్మెల్యే వెంటనే స్పందించి రిక్వెస్ట్ బస్టాండ్ నిర్మాణాన్ని పూర్తి చేయడంతో పాటు ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద ఆర్డినరీ, ఎక్స్‌ప్రెస్ బస్సులు ఆగేలా ఆర్టీసీ అధికారులతో చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రిక్వెస్ట్ బస్టాండ్ నిర్మాణ పనులను నెల రోజుల్లో ప్రారంభించకపోతే విద్యార్థులతో కలిసి ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ పట్టణ అధ్యక్షులు భువనగిరి సాయి, ఉదయ్ కిరణ్ చరణ్ లోకేష్ నరేష్ మనోజ్ సన్య హిమబిందు కృతిక,కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

# మృతి చెందిన హోంగార్డ్ కుటుంబానికి అండగా రూ.50 వేల ఆర్థిక సహాయం అందజేత

- కుటుంబానికి పోలీస్ శాఖ అండగా ఉంటుంది – జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్, IPS

**నారాయణపేట,జులై,07:**

నారాయణపేట జిల్లా పోలీస్ శాఖలో హోంగార్డుగా విధులు నిర్వహిస్తూ ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన బాలకృష్ణ కుటుంబానికి జిల్లా పోలీస్ శాఖ మానవతా దృక్పథంతో అండగా నిలిచి హోంగార్డు లు సేకరించిన విరాళం. జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్, IPS చేతుల మీదుగా మృతుడి భార్య భవానికి రూ.50,000ల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. నారాయణపేట జిల్లాలో హోంగార్డుగా విధులు నిర్వహించిన బాలకృష్ణ, కొత్తపల్లి మండలం గోకుల్ నగర్‌కు చెందినవారు.ఆయన ఆకస్మిక మరణంతో భార్య భవాని, ముగ్గురు చిన్నారులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. ఈ విషయాన్ని తెలుసుకున్న హోంగార్డ్ అధికారులు, సిబ్బంది, బ్యాచ్ మిత్రులు తమ తోటి సహచరుడి కుటుంబానికి అండగా నిలవాలని నిర్ణయించి స్వచ్ఛందంగా విరాళాలు సేకరించి రూ.50 వేల ఆర్థిక సహాయాన్ని అందించారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ మాట్లాడుతూ... పోలీస్ కుటుంబంలో ఎవరికైనా కష్టం వచ్చినప్పుడు అందరూ ఒక్కటిగా నిలబడటం పోలీస్ శాఖ గొప్ప సంప్రదాయమని అన్నారు. బాలకృష్ణ సేవలను గుర్తు చేసుకుంటూ, ఆయన కుటుంబానికి పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.అలాగే, తమ సహచరుడి కుటుంబానికి చేయూత అందించేందుకు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఆర్థిక సహాయం అందించిన



హోంగార్డ్ అధికారులు, సిబ్బంది, బ్యాచ్ మిత్రులను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. వారి సేవాభావం, మానవత్వం ఇతరులకు ఆదర్శంగా నిలుస్తుందని పేర్కొన్నారు.మృతుడి కుటుంబ సభ్యులు ఈ ఆర్థిక సహాయం అందించిన జిల్లా ఎస్పీతో పాటు హోంగార్డ్ అధికారులు, సహచర సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో హోంగార్డ్ సిబ్బంది, మృతుడి కుటుంబ సభ్యులు మరియు ఇతరులు పాల్గొన్నారు.

## సర్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలి: అదనపు సీఈఓ వాసం వెంకటేశ్వర్లు రెడ్డి

**హైదరాబాద్, జూలై 7:.**

ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (సర్) కార్యక్రమాన్ని ఎలాంటి లోటుపాట్లు లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం అదనపు సీఈఓ వాసం వెంకటేశ్వర్లు రెడ్డి, ఐఏఎస్ ఆదేశించారు. మంగళవారం మహేశ్వరం నియోజకవర్గంలోని జల్పల్లి, మీర్‌పేట్, ఎల్‌బీనగర్ నియోజకవర్గంలోని సరూర్ నగర్ ప్రాంతాల్లో పర్యటించి సర్ ప్రక్రియ పురోగతిని ఆయన పరిశీలించారు.



ఎన్యుమరేషన్ ఫారాల నింపడంలో సూపర్వైజర్లు కీలక పాత్ర పోషించాలని, బీఎల్ఓలకు పూర్తి సహకారం అందించాలని సూచించారు. అవసరమైన చోట్ల వాలంటీర్ల సేవలను వినియోగించి ఓటర్లకు సహాయం చేయాలని, ఫారాల్లో ఓటరు సంతకం, ఫోటో తప్పనిసరిగా ఉండేలా చూడాలని ఆదేశించారు. పర్యటనలో భాగంగా జల్పల్లిలో 32 ప్రాంతాల్లో నివసిస్తున్న రోహింగ్యాలను గుర్తించి పరిస్థితిని పరిశీలించారు. కార్యక్రమంలో ఈఆర్ఓలు, బీఎల్ఓలు పాల్గొన్నారు.

## హర్యానాలో బంధువా కార్మికుల 86 కేసులపై జూలై 9న ఎన్‌హెచ్‌ఆర్‌సీ విచారణ

**న్యూఢిల్లీ, జూలై 7:**

హర్యానాలోని ఇటుక బట్టీలలో బంధువా కార్మికులుగా పనిచేస్తున్నారనే ఆరోపణలతో నమోదైన 86 కేసులపై జూలై 9న జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్‌ఆర్‌సీ) ఆన్‌లైన్‌లో విచారణ నిర్వహించనుంది. కమిషన్ చైర్మన్ జస్టిస్ వి. రామసుబ్రహ్మణియన్ అధ్యక్షతన ఈ విచారణ జరుగుతుంది. ఈ విచారణకు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేదా ఆయన ప్రతినిధి, కార్మిక శాఖ కమిషనర్, సంబంధిత జిల్లా కలెక్టర్లు హాజరుకానున్నారు. బంధువా కార్మికుల గుర్తింపు, విముక్తి, ఈ–శ్రమ్ పోర్టల్ నమోదు, పునరావాసం, ఆర్థిక సాయం, నైపుణ్య శిక్షణ, ప్రత్యామ్నాయ ఉపాధి కల్పన, అలాగే ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా తీసుకున్న చర్యలపై అధికారులు నివేదికలు సమర్పించనున్నారు. బంధువా కార్మిక వ్యవస్థ (రద్దు) చట్టం–1976 అమలు, సుప్రీంకోర్టు ఆదేశాల అమలు స్థితిని కూడా కమిషన్ సమీక్షించనుంది. 1997 మే 11న సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఈ చట్టం అమలుపై పర్యవేక్షణ బాధ్యతలను ఎన్‌హెచ్‌ఆర్‌సీ నిర్వహిస్తోంది.

## తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమానికి సమగ్ర విధానాలు రూపొందిస్తాం: ఉన్నతస్థాయి కమిటీ

**హైదరాబాద్, జూలై 7:.**



తెలంగాణ ఉద్యమకారులు, అమరవీరుల కుటుంబాలకు సామాజిక భద్రత, సంక్షేమ ప్రయోజనాలు కల్పించేలా సమగ్ర విధానాలు రూపొందిస్తామని తెలంగాణ ప్రభుత్వ ఉద్యమకారుల ఉన్నతస్థాయి కమిటీ తెలిపింది. సచివాలయం ఎదురుగా ఉన్న అమరవీరుల జ్యోతి ప్రాంగణంలో జరిగిన సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్, కమిటీ సభ్యులు ప్రొఫెసర్ ఎం. కోదండరాం, అద్దంకి దయాకర్, ఎస్. రాములు నాయక్, మోతే శోభన్ రెడ్డి తదితరులు కాకతీయ విశ్వవిద్యాలయం విద్యార్థి ఉద్యమకారులు, అమరవీరుల కుటుంబ సభ్యులతో సమావేశమయ్యారు. సమావేశంలో ఉద్యమకారులు గుర్తింపు కార్డులతో పాటు ఉపాధి, విద్య, వైద్యం, గృహం, పెన్షన్, ఆర్థిక భద్రత వంటి అంశాలపై ప్రత్యేక సంక్షేమ విధానాలు అమలు చేయాలని కోరారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, తెలంగాణ ఉద్యమంలో విద్యార్థుల పాత్ర చారిత్రాత్మకమైందన్నారు. ఉద్యమకారులు, అమరవీరుల కుటుంబాల నుంచి వచ్చిన సూచనలను కమిటీ నివేదికలో పొందుపరిచి ముఖ్యమంత్రికి సమర్పిస్తామని, వారికి అన్ని విధాలా న్యాయం జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని హామీ ఇచ్చారు.

## సీఎం ప్రజావాణి స్టేట్ నోడల్ అధికారిగా కే. విద్యాసాగర్ బాధ్యతల స్వీకరణ

**హైదరాబాద్, జూలై 7:.**

సీఎం ప్రజావాణి ఇంచార్జ్, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జీ. చిన్నారెడ్డి సమక్షంలో కే. విద్యాసాగర్ మంగళవారం సీఎం ప్రజావాణి స్టేట్ నోడల్ అధికారిగా బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు స్టేట్ నోడల్ అధికారిగా పనిచేసిన దివ్య దేవరాజన్ పంచాయతీ రాజ్ శాఖ డైరెక్టర్‌గా బదిలీ కావడంతో ఆమె కే. విద్యాసాగర్‌కు బాధ్యతలు అప్పగించారు.

మహాత్మా జ్యోతిబా పూలే ప్రజా భవన్‌లో జరిగిన కార్యక్రమంలో డాక్టర్ జీ. చిన్నారెడ్డి వారిద్దరికీ శుభాకాంక్షలు తెలిపారు. దివ్య దేవరాజన్ అందించిన సేవలను ఆయన అభినందిస్తూ, కే. విద్యాసాగర్ నాయకత్వంలో సీఎం ప్రజావాణి కార్యక్రమం మరింత సమర్థవంతంగా కొనసాగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

## హోటల్ లో ఫుడ్ సేఫ్టీ అధికారుల ఆకస్మిక తనిఖీలు

**ఖమ్మం, జూలై 7:**



ఖమ్మం నగరంలోని ఒక రెస్టారెంట్‌లో భోజనం చేసిన అనంతరం ఓ బాలిక అస్వస్థతకు గురైనట్లు అందిన ఫిర్యాదు మేరకు జిల్లా ఫుడ్ సేఫ్టీ శాఖ మంగళవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించింది. ఇన్‌చార్జి జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి ఈ. శరత్ ఆధ్వర్యంలో నిర్వహించిన తనిఖీల్లో ఆహార నాణ్యత, పరిశుభ్రత, నిల్వ విధానాలు, వంటశాల నిర్వహణను పరిశీలించారు. రెండు ఆహార నమూనాలను సేకరించి రాష్ట్ర ఆహార ప్రయోగశాలకు పరీక్షల కోసం పంపించారు. ప్రయోగశాల నివేదికల ఆధారంగా ఆహార భద్రత చట్టం ప్రకారం తదుపరి చర్యలు తీసుకుంటామని శరత్ తెలిపారు. జిల్లాలో హోటళ్లు, రెస్టారెంట్లు, బేకరీలు, స్వీట్ షాపులపై తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని, నాసిరకం లేదా కలుషిత ఆహారం విక్రయిస్తున్నట్లు గుర్తిస్తే వెంటనే ఫుడ్ సేఫ్టీ శాఖకు సమాచారం ఇవ్వాలని వినియోగదారులకు సూచించారు.

## శిక్షణ ఫౌండేషన్ లెర్నింగ్ కార్యక్రమాన్ని పరిశీలించిన కలెక్టర్ ఖుష్బూ గుప్తా

**మహబూబ్ నగర్, జూలై 7:**



జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా బోయపల్లి అంగన్‌వాడీ కేంద్రం, ప్రాథమిక పాఠశాలను సందర్శించి, శిక్షణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అమలు కానున్న ప్రీ–లిటరసీ, ప్రీ–న్యూమరసీ ఆధారిత బేసిక్ లెర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ కార్యక్రమాన్ని పరిశీలించారు.జిల్లాలో పైలట్ ప్రాజెక్టుగా 50 అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తూ, ట్యాబ్‌లు, బ్లూటూత్ స్పీకర్లు, బోధన సామగ్రి, సిబ్బందికి శిక్షణ అందిస్తున్నట్లు ప్రతినిధులు వివరించారు. 'శిశు వికాసన' మొబైల్ యాప్, 'ప్రేరణ ఎఫ్ఎల్ఎన్' కార్యక్రమం ద్వారా చిన్నారుల పఠన, గణిత నైపుణ్యాల అభివృద్ధికి చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం పిల్లల అభ్యాసంలో మెరుగైన ఫలితాలు తీసుకువస్తుందని కలెక్టర్ పేర్కొంటూ, అవసరమైన అనుమతులు మంజూరు చేస్తామని, ఒకటి లేదా రెండు నెలల తర్వాత కార్యక్రమ పురోగతిపై ప్రత్యేక సమీక్ష నిర్వహించాలని అధికారులకు సూచించారు. 2026–2029 వరకు ఆశ్రేయ హస్త ట్రస్ట్ సహకారంతో ఈ కార్యక్రమం కొనసాగనుంది.

## రెవెన్యూ కార్యాలయాన్ని తనిఖీ చేసిన కలెక్టర్ గరిమ అగ్రవాల్

**సిరిసిల్ల, జూలై 7:**

రెవెన్యూ అధికారులు, సిబ్బంది సమయపాలన పాటించి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. మంగళవారం తంగళ్లపల్లి మండల రెవెన్యూ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్, హాజరు రిజిస్టర్, కార్యాలయ నిర్వహణ, భూ భారతి, సాదాబైనామా దరఖాస్తుల పురోగతిని పరిశీలించారు. దరఖాస్తులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని, ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండాలని అధికారులను ఆదేశించారు. కార్యాలయ రికార్డులను సక్రమంగా భద్రపరచడంతో పాటు కార్యాలయ ఆవరణను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. ఈ తనిఖీలో ఇంచార్జి తహసీల్దార్ మురళి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## దేవాదాయ శాఖ సమీక్షపై సీఎం రేవంత్ రెడ్డి కు మంత్రి కొండా సురేఖ ఫిర్యాదు

**హైదరాబాద్, జూలై 7:.**

స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి దేవాదాయ శాఖ మంత్రికి సమాచారం ఇవ్వకుండా శాఖ అధికారులతో అధికారిక సమీక్ష నిర్వహించారని ఆరోపిస్తూ దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఫిర్యాదు చేశారు. శాఖ పరిపాలన, విధాన నిర్ణయాలు, అధికారిక సమీక్షలు సంబంధిత శాఖా మంత్రి పరిధిలోనే ఉంటాయని, అయినప్పటికీ మంత్రి అనుమతి లేదా సమాచారం లేకుండానే ఎమ్మెల్యే కడియం శ్రీహరి శాఖ అధికారులతో సమావేశమై దేవాలయాల అభివృద్ధి, నిధుల కేటాయింపులు, మాస్టర్ ప్లాన్లు, దేవాలయ భూముల పరిరక్షణ, ఆక్రమణల తొలగింపు వంటి అంశాలపై సమీక్ష నిర్వహించడం రూల్స్ ఆఫ్ బిజినెస్ స్ఫూర్తికి విరుద్ధమని లేఖలో పేర్కొన్నారు. ఇలాంటి చర్యలు ప్రభుత్వ పరిపాలనా సమన్వయాన్ని దెబ్బతీసే అవకాశం ఉందని, భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా పార్టీ స్థాయిలో తగిన చర్యలు తీసుకోవాలని మంత్రి కోరారు. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపించి, సంబంధిత అంశాలపై వివరణ కోరడంతో పాటు పార్టీ క్రమశిక్షణ కమిటీ ద్వారా పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు.

# ఆలేరులో ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం

- మంద కృష్ణ మాదిగకు జన్మదిన శుభాకాంక్షలు: జెండావిష్కరణ న

**ఆలేరు, జూలై 7:**

ఆలేరు పట్టణ కేంద్రంలో 32వ ఎమ్మార్పీఎస్ (మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి) ఆవిర్భావ దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు, పద్మశ్రీ అవార్డు గ్రహీత మంద కృష్ణ మాదిగ జన్మదినాన్ని పురస్కరించుకుని ఆయనకు శుభాకాంక్షలు తెలియజేస్తూ జెండావిష్కరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికి ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు కందుల నర్సింగరావు మాదిగ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథులుబిర్రు మహేందర్ మాదిగ, ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు నల్ల చంద్రస్వామి, ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకుడు కందుల శంకర్ మాదిగ, పుల్లూరు రవి, పట్టణ అధ్యక్షుడు పంగ మేఘరాజు, ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు, క్రైస్తవ మత పెద్ద బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, సామాజిక న్యాయం సాధన కోసం ఎమ్మార్పీఎస్ మూడు దశాబ్దాలుగా చేస్తున్న ఉద్యమం చారిత్రాత్మకమని పేర్కొన్నారు. ఎస్సీ వర్గీకరణ సాధనలో మంద కృష్ణ మాదిగ చేసిన పోరాటం చిరస్మరణీయమని కొనియాడారు. సామాజికంగా వెనుకబడిన వర్గాల హక్కుల సాధన కోసం ఉద్యమ స్ఫూర్తిని కొనసాగించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గ్యార బాలచందర్, కందుల కుమార్, కందుల స్వామి, గ్యార రాజు, బర్రె ప్రభాకర్, ఎర్ర మధు తదితర నాయకులతో పాటు పెద్ద సంఖ్యలో ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు, పట్టణ ప్రజలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



# ప్రైవేటు ఆస్పత్రుల దోపిడీపై చర్యలు తీసుకోవాలి

### వైద్యం వ్యాపారంగా మారిందని డీవైఎఫ్ఐ ఆందోళన

**ఆలేరు, జూలై 7:**

యాదాద్రి భువనగిరి జిల్లా వ్యాప్తంగా ప్రైవేటు ఆస్పత్రులు వైద్యం పేరుతో పేద, మధ్యతరగతి ప్రజలను తీవ్రంగా దోచుకుంటున్నాయని, అలాంటి ఆస్పత్రులపై జిల్లా వైద్యాధికారులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గడ్డం వెంకటేష్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆలేరు పట్టణంలో నిర్వహించిన డీవైఎఫ్ఐ మూడవ పట్టణ మహాసభలో మాజీ పట్టణ కార్యదర్శి బోనగిరి గణేష్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. ఈ సందర్భంగా గడ్డం వెంకటేష్ మాట్లాడుతూ ప్రభుత్వాలు ప్రభుత్వ వైద్య వ్యవస్థను బలోపేతం చేయడంలో విఫలమవ దంతో ప్రజలు తప్పనిసరిగా ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయించే పరిస్థితి ఏర్పడిందన్నారు. జిల్లా వ్యాప్తంగా పుట్టగొడుగుల్లా ప్రైవేటు ఆస్పత్రులు వెలుస్తూ, కనీస మౌలిక వసతులు లేకుండానే వైద్య సేవల పేరుతో భారీగా ఫీజులు వసూలు చేస్తున్నాయని ఆరోపించారు. వైద్యం సేవ కాకుండా వ్యాపారంగా మారిపోయిందని విమర్శించారు. నిబంధనలు పాటించని ఆస్పత్రులపై జిల్లా వైద్యాధికారులు పర్యవేక్షణ పెంచి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వ ఉద్యోగాల్లో కొనసాగుతూనే ప్రైవేటు ఆస్పత్రులు నిర్వహిస్తున్న వైద్యులను గుర్తించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లాలో వైద్యరంగ సమస్యలపై ఇప్పటికే పలుమార్లు జిల్లా వైద్యాధికారులకు వినతిపత్రాలు అందజేసినా స్పందన లేకపోవడం బాధాకరమన్నారు. జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రిలో మెరుగైన వైద్య సౌకర్యాలు లేకపోవడంతో రోగులు హైదరాబాద్‌లోని పెద్ద ఆస్పత్రులకు వెళ్లాల్సి వస్తోందని, ఈ క్రమంలో అత్యవసర పరిస్థితుల్లో కొందరు ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో వైద్య సేవల మెరుగుదలపై ప్రజాప్రతినిధులు ప్రత్యేక దృష్టి సారించాలని, ప్రైవేటు ఆస్పత్రుల దోపిడీకి అడ్డుకట్ట వేసేలా అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని డీవైఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ మాజీ డివిజన్ కార్యదర్శి ఎం.ఏ. ఇక్బాల్, మాజీ డివిజన్ అధ్యక్షుడు మొరిగాడి రమేష్, జిల్లా కమిటీ సభ్యులు వడ్డెమాను విప్లవ్, చెన్న రాజేష్, మొరిగాడు పృథ్వీ, యాసారపు ప్రసాద్, ఎక్కల దేవి భాస్కర్, రేగుంటి ప్రశాంత్, గద్దల శివకుమార్, మొరిగాడి మహావీర్, మొరిగాడి మౌర్య, ఎర్ర నాగరాజు పాల్గొన్నారు.




# ఓటర్లు పూరించిన పత్రాలను ఆన్ లైన్ లో నమోదు చేయాలి

### జిల్లా కలెక్టర్ సీహెచ్ ప్రియాంక.

**నారాయణపేట మండలం, జులై,07:**

ఓటర్ల నుంచి పూరించిన ఎన్యూమరేషన్ పత్రాలను సేకరించి వాటిని వెంటనే ఆన్ లైన్ లో నమోదు చేసే ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ప్రియాంక బీ ఎల్ వో లను ఆదేశించారు.బీ ఎల్ వో లు ఓటర్ల ఇళ్లకు స్వయంగా వెళ్ళి ఎన్యూమరేషన్ పత్రాలను సేకరించాలని, పత్రాలు నింపడం తెలియని ఓటర్లకు దగ్గరుండి సహకారం అందించాలని సూచించారు. మంగళ వారం నారాయణపేట మండలంలోని చిన్న జట్రం, కొల్లంపల్లి, లింగంపల్లి గ్రామాలలో కలెక్టర్ పర్యటించి బూత్ స్థాయి అధికారులు, సూపర్ వైజర్ల పనితీరు, జిల్లాలో కొనసాగుతున్న ఎస్ ఐ ఆర్ ప్రక్రియను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించారు. చిన్నజట్రం గ్రామానికి సంబంధించి పోలింగ్ స్టేషన్ నం. 176,177, కొల్లంపల్లి గ్రామానికి సంబంధించి పోలింగ్ స్టేషన్

182 నుంచి 186, అలాగే లింగం పల్లి గ్రామానికి సంబంధించిన

187 పోలింగ్ స్టేషన్ ల వారీగా ఇంతవరకు ఎన్ని ఎన్యూమరేషన్ పత్రాలను పంపిణీ చేశారు ? అందులో ఎన్ని పత్రాలను తిరిగి తీసుకున్నారు ? ఇంకా ఎన్ని తీసుకోవాల్సి ఉందనే వివరాలను ఆయా బీ ఎల్ వో లను అడిగి తెలుసుకున్నారు. ఓటర్లు ఎన్యూమరేషన్ పత్రాలను నింపి బీ ఎల్ వో లకు తిరిగి ఇస్తేనే ఓటరు జాబితాలో పేరు ఉంటుందని, ఇవ్వక పోతే జాబితాలో పేరు ఉండదు అని ఆమె స్పష్టం చేశారు. చనిపోయిన ఓటర్ల పేర్లు, డబుల్ ఓట్లు తొలగించాలన్నారు.జిల్లాలోని బీఎల్ వోలు ఇక నుంచి రోజుకు భర్తీ చేసిన వంద ఎన్యూమరేషన్ పత్రాలను తిరిగి తీసుకుని, ఆన్ లైన్ లో నమోదు చేయాలని కలెక్టర్ సూచించారు. లేని పక్షంలో శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ అమరేంద్ర కృష్ణ, సూపర్ వైజర్లు, ఆయా గ్రామాల కార్యదర్శులు పాల్గొన్నారు.



# ఖమ్మంలో రూ. కోటి వ్యయంతో సీసీ డ్రెయిన్ల పనులకు మంత్రి తుమ్మల శంకుస్థాపన

**ఖమ్మం జూలై 7:**

ఖమ్మం నగరంలోని 58వ డివిజన్ బీసీ కాలనీలో రూ.1 కోటి అంచనా వ్యయంతో చేపట్టనున్న సీసీ డ్రెయిన్ల నిర్మాణ పనులకు రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళీ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, నగరంలో డ్రైనేజీ వ్యవస్థను ప్రణాళికాబద్ధంగా మెరుగుపరుస్తూ ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, ఖమ్మం మార్కెట్ కమిటీ చైర్మన్ యరగర్ల హన్మంతరావు, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



# ప్రతి విద్యార్థి ఉత్తీర్ణతే లక్ష్యం: కలెక్టర్ దివాకర్ టీఎస్

**ఖమ్మం, జూలై 7 :**

జిల్లాలో ప్రతి ఇంటర్మీడియట్ విద్యార్థి ఉత్తీర్ణత సాధించేలా పకడ్బందీ కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని జిల్లా కలెక్టర్ దివాకర్ టీఎస్ అధికారులను ఆదేశించారు. గత విద్యా సంవత్సరంలో జిల్లా ఇంటర్ ప్రథమ సంవత్సరంలో 72 శాతం, ద్వితీయ సంవత్సరంలో 86 శాతం ఉత్తీర్ణత సాధించి రాష్ట్రంలో మూడో స్థానంలో నిలిచిందని సమీక్షలో వెల్లడైంది. వెనుకబడిన విద్యార్థులను నవంబర్ నాటికి గుర్తించి ప్రత్యేక బోధన అందించాలని, విద్యార్థుల హాజరుపై ప్రత్యేక దృష్టి సారించి ఫేస్ రికగ్నిషన్ వ్యవస్థను అన్ని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో అమలు చేయాలని కలెక్టర్ సూచించారు. జిల్లాలోని 15 ప్రభుత్వ జూనియర్ కళాశాలల అభివృద్ధికి రూ.2.96 కోట్లు మంజూరయ్యాయని, నిర్మాణ పనులు వేగవంతం చేసి ఆలస్యం చేస్తున్న కాంట్రాక్టర్లకు నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. అలాగే అనుమతులు, మౌలిక వసతులు లేకుండా ప్రైవేట్ జూనియర్ కళాశాలలు నిర్వహించరాదని హెచ్చరించారు. అధికారులు, కళాశాల ప్రిన్సిపాళ్లు సమావేశంలో పాల్గొన్నారు.



# రెండు ఫర్టిలైజర్ షాప్లలో దొంగతనం నగదు అపహరణ

### ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నాం ఎస్సై విఠల్ రెడ్డి

**యాలాల మండలం, జులై,07:**

యాలాల ఎస్సై విఠల్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం తాండూరు నియోజక వర్గం లక్ష్మీనారాయణపూర్ గ్రామంలోని లక్ష్మీ నరసింహ,శివ ఫర్టిలైజర్ షాప్ లో సోమవారం అర్ధరాత్రి సమయంలో ఇద్దరు గుర్తుతెలియని దొంగలు షట్టర్లను ధ్వంసం చేసి లోపలికి ప్రవేశించి శివ ఫర్టిలైజర్ షాపులో కౌంటర్ నందు ఉంచిన 5500/- రూపాయలను దొంగిలించుకుని వెళ్లినరు. మరియు లక్ష్మీ నరసింహ ఫర్టిలైజర్ షాప్ లో ఎలాంటి నగదు కానీ వస్తువులు కానీ పోలేదు. అయితే ఫర్టిలైజర్ షాపు యజమాని అగు దాసరి మల్లేశం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై విఠల్ రెడ్డి తెలిపారు.

# కేంద్ర స్వయంప్రతిపత్తి సంస్థల ఉద్యోగులకు ఎన్‌పీఎస్‌లో అదనపు పెట్టుబడి ఎంపికలు

**న్యూఢిల్లీ, జూలై 7:**

జాతీయ పెన్షన్ వ్యవస్థ (ఎన్‌పీఎస్) పరిధిలోని కేంద్ర స్వయంప్రతిపత్తి సంస్థల (సీఏబీలు) ఉద్యోగులకు కేంద్ర ప్రభుత్వం రెండు అదనపు పెట్టుబడి ఎంపికలను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ మేరకు ఆర్థిక మంత్రిత్వ శాఖ వ్యయ విభాగం ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు మాత్రమే అందుబాటులో ఉన్న ఈ ఎంపికలను ఇప్పుడు కేంద్ర స్వయంప్రతిపత్తి సంస్థల ఉద్యోగులకు కూడా విస్తరించారు. కొత్తగా అందుబాటులోకి వచ్చిన ఎంపికల్లో ఎల్‌సీ–75 హై ద్వారా ఈక్విటీలో గరిష్ఠంగా 75 శాతం వరకు పెట్టుబడి పెట్టే అవకాశం ఉండగా, అగ్రెసివ్ లైఫ్ సైకిల్ ఫండ్ ద్వారా ఈక్విటీలో గరిష్ఠంగా 50 శాతం వరకు పెట్టుబడి పెట్టవచ్చు. 45 ఏళ్ల వయస్సు నుంచి ఈక్విటీ పెట్టుబడి వాటా క్రమంగా తగ్గే విధంగా ఈ పథకాన్ని రూపొందించారు. ఈ నిర్ణయంతో ఉద్యోగులు తమ రిస్క్ స్వభావం, ఆర్థిక లక్ష్యాలు, పదవీ విరమణ ప్రణాళికకు అనుగుణంగా పెట్టుబడి ఎంపిక చేసుకునే అవకాశం లభిస్తుందని కేంద్ర ప్రభుత్వం తెలిపింది. కొత్త పెట్టుబడి ఎంపికలను సెంట్రల్ రికార్డ్ కీపింగ్ ఏజెన్సీ (సీఆర్‌ఏ) వ్యవస్థలో అందుబాటులో ఉంచాలని సంబంధిత శాఖలకు సూచనలు జారీ చేసింది.

# ఎన్‌పీఎస్ఎస్‌పై రైతులకు వర్చువల్ అవగాహన కార్యక్రమం

**హైదరాబాద్, జూలై 7:**

కేంద్ర సమగ్ర పురుగుల నిర్వహణ కేంద్రం (సీఐపీఎంసీ), హైదరాబాద్ ఆధ్వర్యంలో జాతీయ పురుగు నిఘా వ్యవస్థ (ఎన్‌పీఎస్ఎస్)పై మంగళవారం వర్చువల్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రైతు నేస్తం వేదిక ద్వారా నిర్వహించిన ఈ కార్యక్రమంలో తెలంగాణలోని 1,026 రైతు వేదికల నుంచి రైతులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు. పంటల్లో పురుగుల పర్యవేక్షణ, ముందస్తు హెచ్చరికలు, సమగ్ర పురుగు నిర్వహణ పద్ధతులపై రైతులకు అధికారులు అవగాహన కల్పించారు.

# ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశానికి కలెక్టర్ రాజర్షిషా ప్రారంభం



**భీంపూర్ జూలై7:**

భీంపూర్ మండలం బేల్సారి రాంపూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారులు కోవా వనిత–జ్ఞానేశ్వర్ దంపతుల నూతన గృహ ప్రవేశ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ రాజర్షిషా ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు నూతన వస్త్రాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఇంటి నిర్మాణ వ్యయం, ప్రభుత్వ ఆర్థిక సహాయం చెల్లింపుల వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో హౌసింగ్ పీడీ శంకర్, తహసీల్దార్, డీఈ రమేష్, ఏఈ బావుసింగ్, సర్పంచ్ కేశవ్, లబ్ధిదారుల కుటుంబ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# గ్రేటర్ వరంగల్ పారిశుద్ధ్యానికి అంతర్జాతీయ ప్రశంసలు



**హనుమకొండ, జూలై 7:.**

గ్రేటర్ వరంగల్‌లో అమలవుతున్న మలశుద్ధీకరణ, మలవిసర్జన వ్యర్థాల శాస్త్రీయ నిర్వహణ విధానాలను ఆసియా అభివృద్ధి బ్యాంకు (ఏడీబీ) జపాన్ కన్సల్టెంట్ డాక్టర్ కజుషి హషిమోటో పరిశీలించి ప్రశంసించారు. అమ్మవారిపేటలోని రోజుకు 15 కిలోలీటర్లు, 150 కిలోలీటర్ల సామర్థ్యం గల మలశుద్ధీకరణ కేంద్రాలను సందర్శించిన ఆయన, శుద్ధీకరణ ప్రక్రియ, నిర్వహణ విధానాలను పరిశీలించారు. అనంతరం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్, జీడబ్ల్యూఎంసీ ప్రత్యేక అధికారి చాహత్ బాజ్‌పాయ్, కమిషనర్ టి. వెంకన్నతో సమావేశమయ్యారు. నగరంలో మలవిసర్జన వ్యర్థాలను పైరోలసిస్ సాంకేతికతతో సేంద్రీయ ఎరువుగా మార్చి వ్యవసాయానికి వినియోగిస్తున్నామని, శుద్ధి చేసిన నీటిని మొక్కల సంరక్షణకు ఉపయోగిస్తున్నామని కలెక్టర్ తెలిపారు. వరంగల్‌లో అమలవుతున్న ఈ సుస్థిర పారిశుద్ధ్య నమూనా ఇతర నగరాలకు ఆదర్శంగా నిలుస్తుందని డాక్టర్ హషిమోటో పేర్కొన్నారు.

# కాకలు తీరిన కమ్యూనిస్టు యోధుడు జ్యోతిబసు

## నిబద్ధత కలిగిన నేత జ్యోతిబసు.. నేడు జ్యోతిబసు జయంతి



భారత రాజకీయ రంగంలో అగ్రశేణి నాయకుల్లో ఒకరైన జ్యోతిబసు భారత స్వాతంత్ర్యో ద్యమంలో, ఉమ్మడి కమ్యూనిస్టు ఉద్యమంలో ప్రముఖ పాత్ర వహించారు. ఆయన భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) తొలితరం నాయకులు, మొదటి పోలిట్ బ్యూరో సభ్యులు. 23 సంవత్సరాలు వరసగా ఒకే రాష్ట్రానికి ముఖ్య మంత్రిగా పనిచేసిన సుదీర్ఘ పాలనా అనుభవ శాలి. ప్రధాని కావడానికి అవకాశం వచ్చినా, పార్టీ నిర్ణయానికి కట్టుబడి పార్టీ ఆదేశానుసారం దూరంగా నిలిచి క్రమశిక్షణకు మారు పేరుగా నిలిచిన నిబద్ధత కలిగిన ఆదర్శ నేత ఆయన. సీపీఎం కురువృద్ధుడు జ్యోతిబసు పశ్చిమ బెంగాల్ రాష్ట్రానికి 23 సంవత్సరాల పాటు విరామం లేకుండా ముఖ్యమంత్రిగా సేవలందించి చరిత్ర సృష్టించారు. పశ్చిమ బెంగాల్ లో రైతాంగ కార్మికులను సమీకరించి రైతాంగ ఉద్యమాల్లో, పీడిత ప్రజల ఉద్యమాల్లో జ్యోతి బసుది పాత్ర మరువ లేనిది. దేశంలో గ్రామ పంచాయతీ వ్యవస్థను బలోపేతం చేసి భూ సంస్కర ణలు అమలు చేసి కౌలుదారు లకు, కార్మికులకు రక్షణ కల్పించిన రాష్ట్ర ప్రభుత్వంగా బెంగాల్ ను తీర్చిదిద్దిన పాలనా సంస్కరణ వాది జ్యోతిబసు. 1914 జూలై 8న కోల్కత్తాలో బెంగాలీ మధ్యతరగతి కుటుంబం లో జ్యోతి బసు... నిశికాంత్ బసు, హేమలతా బసు దంపతులకు జన్మించారు. స్థానికంగా కలకత్తా (నేటి కోల్కత) లోనే జ్యోతి విద్యా భ్యాసం చేశారు. ప్రెసిడెన్సీ కళాశాలలో బసు తన డిగ్రీ పూర్తి చేశారు. ఉన్నత చదువుల కోసం 1935 లో ఇంగ్లాండు వెళ్ళారు. ఇంగ్లాండులో న్యాయ శాస్త్రంలో విద్యనభ్యసించే సమయంలో గ్రేట్ బ్రిటన్ కమ్యూనిస్టు పార్టీ వైపు ఆకర్షితులై, రాజకీయాలపై ఆసక్తి పెంచు కున్నారు. 1938లో జవహర్ లాల్ నెహ్రూ లండన్ పర్యటన సమయంలో సదస్సు నిర్వహణ బాధ్యతను జ్యోతి బసు తీసు కున్నారు సుభాష్ చంద్రబోస్ పర్యటన సమయంలో కూడా జ్యోతి బసు ఏర్పాట్లు చేసారు. 1940లో న్యాయశాస్త్ర విద్య పూర్తి చేసుకొని మిడిల్ టెంపుల్ వద్ద బారిస్టర్ గా అర్హత సాధించి, అదే సంవత్సరంలో భారత దేశానికి తిరిగి వచ్చారు. 1944లో ట్రేడ్ యూనియన్ ఉద్యమాలలో పాలు పంచుకొని ఆ తరువాత యూనియన్ ప్రధాన కార్యదర్శి అయ్యారు. 1946లో తొలిసారిగా బెంగాల్ శాసనసభకు ఎన్నికయ్యారు. బి.సి. రాయ్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో శాసన సభలో ప్రతిపక్ష నేతగా వ్యవహరించారు. 1967లో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఓడిపోవడంతో అజయ్ ముఖోపాధ్యాయ నేతృత్వం లోని ప్రభుత్వంలో 1967 నుండి 1969 వరకు పశ్చిమ బెంగాల్ ఉప ముఖ్య మంత్రిగా వ్యవహరించారు. 1972 లో రాష్ట్రంలో మళ్ళీ కాంగ్రెస్ గెలిచి ప్రభుత్వం ఏర్పాటు చేయగా, జ్యోతి బసు కూడా తన శాసనసభ స్థానంలో ఓటమి పాలైనారు. తర్వాత 1977 జూన్ 1 నుండి 2000 నవంబరు 6 వరకు నిరాటంకంగా జ్యోతి బసు వరుసగా 5 సార్లు ముఖ్య మంత్రిగా పని చేశారు. తద్వారా దేశంలో ఒక రాష్ట్రానికి అత్యధిక కాలం పాటు ముఖ్య మంత్రిగా కొనసాగిన రికార్డును కూడా జ్యోతి బసు నెల కొల్పారు. 1996లో దేశ ప్రధానమంత్రి అయ్యే అవకాశాన్ని వదులు కున్నారు. 2000లో ముఖ్య మంత్రి పదవి నుండి వైదొలిగిన జ్యోతి బసు జనవరి 17, 2010న 96 సంవత్సరాల వయస్సులో మరణించారు.

# చాణక్య నీతికి ప్రతిరూపం వైఎస్

## మునిగిపోతున్న కాంగ్రెస్ నావను ఒంటిచేత్తో గట్టెక్కించిన జనహృదయ నేత

## నేడు రాజశేఖర్ రెడ్డి జయంతి



ఆంధ్రప్రదేశ్ 16వ ముఖ్యమంత్రిగా, కాంగ్రెస్ పార్టీ అగ్రనేతగా ప్రత్యేక గుర్తింపు పొందిన జనహృదయ నేత డాక్టర్ యెదుగూరి సందింటి రాజశేఖరరెడ్డి (వైఎస్ఆర్) జయంతి నేడు. రాజకీయాల్లో తలపండిన నేతలను సైతం తన వ్యూహాలతో అడ్డుకుని, మునిగిపోతున్న కాంగ్రెస్ నావను ఒంటిచేత్తో దరికి చేర్చిన రథసారథి ఆయన. రాజకీయాలకు సరికొత్త అర్థం చెప్పిన చాణక్యుడిగా వైఎస్ఆర్ నిలిచారు.

### విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలు

వై.ఎస్. రాజశేఖరరెడ్డి 1949 జూలై 8న జమ్మలమడుగులోని సి.ఎస్.ఐ. కాంప్‌బెల్ మిషన్ ఆసుపత్రిలో జన్మించారు. ఈయన తల్లిదండ్రులు జయమ్మ, రాజారెడ్డి. తండ్రి బళ్ళారిలో కాంట్రాక్టరుగా పనిచేయడం వల్ల వైఎస్ఆర్ పాఠశాల చదువంతా బళ్ళారిలోని సెయింట్ జాన్స్ పాఠశాలలో సాగింది. ఆ తర్వాత విజయవాడ లయోలా కళాశాలలో చదివిన ఆయన, 1972లో గుల్బర్గా విశ్వవిద్యాలయం (మహాదేవప్ప రాంపూరే వైద్య కళాశాల) నుంచి వైద్య విద్యలో పట్టా పుచ్చుకున్నారు. తిరుపతి శ్రీ వెంకటేశ్వర వైద్యకళాశాల (ఎస్.వి.ఆర్.ఆర్) నుంచి హౌస్‌సర్జన్ పట్టా పొందారు. గుల్బర్గాలో చదివేటప్పుడే కళాశాల విద్యార్థి సంఘానికి, తిరుపతిలో హౌస్‌సర్జన్ సంఘానికి అధ్యక్షుడిగా పనిచేసి విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలు చాటుకున్నారు. కొంతకాలం జమ్మలమడుగు ఆసుపత్రిలో వైద్యాధికారిగా చేసి, ఆపై 1973లో పులివెందులలో తండ్రి పేరుతో కట్టించిన 70 పడకల ఆసుపత్రిలో ఉచితంగా వైద్య సేవలు అందించారు.

### నిత్య అసమ్మతివాదిగా పోరాటం

1975లో యువజన కాంగ్రెస్ కార్యదర్శిగా రాజకీయ ప్రస్థానం ప్రారంభించిన వైఎస్ఆర్.. 1978లో పులివెందుల నుంచి తొలిసారి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 1980-83 కాలంలో రాష్ట్ర ప్రభుత్వంలో గ్రామీణాభివృద్ధి, ఎక్సైజ్, విద్యాశాఖల మంత్రిగా పనిచేశారు. కడప లోక్‌సభ స్థానం నుండి 4 సార్లు ఎంపీగా, పులివెందుల అసెంబ్లీ స్థానం నుండి 6 సార్లు ఎమ్మెల్యేగా ఎన్నికై అజేయ నేతగా నిలిచారు. 1985 నుండి 1998 వరకు పార్టీలో ఆయన నిత్య అసమ్మతివాదిగా పేరుపడ్డారు. మర్రి చెన్నారెడ్డి, నేదురుమల్లి జనార్ధన్ రెడ్డి, కోట్ల విజయభాస్కర్ రెడ్డి వంటి కాంగ్రెస్ ముఖ్యమంత్రులతోనే ఆయన రాజకీయ యుద్ధం చేయాల్సి వచ్చింది. ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (పీసీసీ) అధ్యక్షుడిగా ఆయన రెండు పర్యాయాలు (1983-85, 1998-2000) బాధ్యతలు నిర్వహించారు.

### చారిత్రాత్మక పాదయాత్ర..

1999 నుండి 2004 వరకు ప్రతిపక్ష నేతగా ఉన్న సమయంలో వైఎస్ఆర్ చేపట్టిన పాదయాత్ర ఆయన రాజకీయ ప్రస్థానాన్ని మలుపు తిప్పింది. 2003 వేసవిలో తీవ్ర ఎండలను లెక్కచేయకుండా 1,467 కిలోమీటర్ల మేర ఆయన సాగించిన పాదయాత్ర కాంగ్రెస్ పార్టీకి అఖండ జనాదరణ తెచ్చిపెట్టింది. ఫలితంగా 2004 మేలో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ భారీ మెజారిటీతో అధికారంలోకి వచ్చింది. పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రిగా పదవిని అధిష్టించిన వెంటనే.. వ్యవసాయానికి 'ఉచిత విద్యుత్' అందించే ఫైలుపైనే వైఎస్ఆర్ తొలి సంతకం చేశారు. ఆ తర్వాత జలయజ్ఞం కింద పెండింగ్ నీటిపారుదల ప్రాజెక్టులను పూర్తి చేయడానికి ప్రాధాన్యతనిచ్చారు. 2009 ఎన్నికల్లోనూ కాంగ్రెస్‌ను ముందుండి నడిపించి.. అసెంబ్లీలో 156 స్థానాలు, లోక్‌సభలో 33 స్థానాలు గెలిపించి వరుసగా రెండోసారి ముఖ్యమంత్రి పీఠాన్ని అధిష్టించారు.

### హెలికాప్టర్ ప్రమాదంలో విషాదాంతం

వైఎస్ఆర్ చర్చ్ ఆఫ్ సౌత్ ఇండియా (సి.ఎస్.ఐ) చర్చికి చెందిన ప్రొటెస్టెంటు క్రైస్తవుడైనప్పటికీ, సాంప్రదాయ హిందూ ఆచారాలను గౌరవించేవారు. అనేకమార్లు తిరుమల శ్రీవారిని దర్శించుకుని పూజలు చేశారు. ఆయన అల్లుడు అనిల్ కుమార్ (షర్మిల భర్త) బ్రాహ్మణుడైనప్పటికీ వివాహం తర్వాత క్రైస్తవం స్వీకరించి మత ప్రచారకుడిగా మారారు. 2009 సెప్టెంబర్ 2న చిత్తూరు జిల్లా పర్యటనకు బయలుదేరిన వైఎస్ఆర్ హెలికాప్టర్ నల్లమల అడవుల్లో ప్రమాదానికి గురైంది. సుదీర్ఘ గాలింపు తర్వాత లభించిన హెలికాప్టర్ శకలాల ఆధారంగా వైఎస్ఆర్‌తో పాటు ఉన్న ఐదుగురు మరణించినట్లు నిర్ధారణ అయింది. తమ ప్రియతమ నేత మరణాన్ని తట్టుకోలేక రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 67 మంది అభిమానులు గుండెఆగి, ఆత్మహత్యలు చేసుకుని మరణించడం ఆయనకున్న జనాదరణకు నిదర్శనం. రాజశేఖరరెడ్డి భౌతికంగా దూరమైనా, ఏపీ రాజకీయ చరిత్రలో ఆయన సృష్టించిన వ్యూహాలు, సంక్షేమ పథకాలు ఎప్పటికీ సజీవంగానే ఉంటాయి.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# ఆటల లోకం నుంచి ఆవిష్కరణల ప్రపంచానికి...

## డిజిటల్ యుగానికి దిశానిర్దేశం చేసిన వీడియో గేమ్స్ ● నేడు జాతీయ వీడియో గేమ్‌ల దినోత్సవం

**డిజిటల్ పరిజ్ఞాన శతాబ్దంలో మానవ జీవితానికి వినోదం అనేది ఒక అంతర్భాగంగా మారింది. ఈ విభాగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చిన అంశాల్లో వీడియో గేమ్‌లు ప్రత్యేక స్థానం కలిగి ఉన్నాయి. వీడియో గేమ్‌లు సమాజాన్ని, టెక్నాలజీని, మనుషుల ఆలోచనా ధోరణిని మారుస్తున్న సాధనాలు. అవి వినోదాన్ని మాత్రమే కాకుండా, విద్యా, శిక్షణ, పరిశోధనా రంగాలలోనూ వాడబడు. తున్నాయి ఒకప్పుడు బాలల ఆటలుగా మాత్రమే భావించ బడిన వీటి ప్రాధాన్యం, కాలక్రమేణా అనేక మార్గాల్లో విస్తరించింది. టెక్నాలజీ, విజ్ఞానం, కళ, వ్యాపారం, విద్య - ఇలా అన్ని రంగాలను స్పృశిస్తూ ఒక ఆధునిక సంస్కృతి రూపంలో అభివృద్ధి చెందాయి. ఈ పరిణామాన్ని గుర్తించి, వీడియో గేమింగ్ రంగానికి అంకితంగా ప్రతి సంవత్సరం జూలై 8న 'జాతీయ వీడియో గేమ్‌ల దినోత్సవం' నిర్వహించ బడుతోంది.**



వీడియో గేమ్ అనే పదం వింటేనే యువతలో ఉత్సాహం తారస్థాయికి చేరుతుంది. వీడియో గేమ్ అనే భావనకు మౌలిక రూపం దాదాపు ఏడున్నర దశాబ్దాల క్రితం ఏర్పడింది. 1958లో అమెరికన్ భౌతిక శాస్త్రవేత్త విలియం హిగిన్బోథమ్ రూపొందించిన 'టెన్నిస్ ఫర్ టూ' అనే సాధారణ ఆట, ప్రాథమిక వీడియో గేమ్‌గా గుర్తించ బడింది. 1972లో 'అటారి' అనే సంస్థ రూపొందించిన 'పాంగ్' అనే ఆట ఖతీఘ్నవ గేమ్ ప్రపంచాన్ని సంచలనానికి లోను చేసింది. అదే ప్రారంభం. ఆ తర్వాత గేమింగ్ రంగం గణనీయమైన పురోగతిని సాధించింది. 1980ల నాటికి నింటెండో, సెగా వంటి బ్రాండ్ల ద్వారా 'సూపర్ మారియో', 'డాంకీ కాంగ్', 'పాక్-మ్యాన్', 'టెట్రిస్' వంటి గేమ్‌లు ఇంటింటికీ చేరాయి. మూడవ దశలో సోనీ ప్లేస్టేషన్, మైక్రోసాఫ్ట్ ఠఎశీఇ, నింటెండో ఔఱఱ వంటి గేమ్ కన్సోల్స్ ద్వారా గేమింగ్ ప్రపంచం మరో కొత్త దశలోకి ప్రవేశించింది.

ఈ రోజుల్లో వీడియో గేమింగ్ కేవలం ఆటలకే పరిమితం కాకుండా, ఒక నైపుణ్య రంగంగా మారింది. ఆధునిక సాంకేతికత -- గ్రాఫిక్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, వర్చువల్ రియాలిటీ, ఆగ్మెంటెడ్ రియాలిటీ వంటి పరిజ్ఞానాలతో వీడియో గేమ్స్ మానవ అనుభూతిని తాకే స్థాయికి చేరాయి. ఆన్‌లైన్ మల్టీప్లేయర్ గేమింగ్ ద్వారా ప్రపంచ వ్యాప్తంగా ఉన్న గేమర్లతో ప్రత్యక్ష అనుసంధానం ఏర్పడుతోంది. మొబైల్ ఫోన్, క్లౌడ్ గేమింగ్ ద్వారా ఎక్కడి నుంచైనా, ఎప్పుడైనా గేమ్ ఆడే అవకాశాలు అందుబాటులో ఉన్నాయి. సృజనాత్మకత, తర్క శక్తి, సమస్యల పరిష్కరణ నైపుణ్యాలను పెంపొందించడంలో సహాయ పడతాయి.తాత్కాలిక ఒత్తిడిని తగ్గించడంలో, మానసిక ఉల్లాసం కలిగించడంలో వీడియో గేమ్‌లు పాత్ర పోషిస్తాయి.గేమ్స్ ద్వారా విద్యను ఆకర్షణీయంగా మార్చడంలో ఉపయోగ పడుతున్నాయి.

వీడియో గేమ్‌లు సమాజంలో పలు విధాలుగా ప్రభావం చూపిస్తున్నాయి. శిశువయసు నుంచే సృజనాత్మకతను, వ్యూహాత్మక ఆలోచనను, తర్క సామర్థ్యాన్ని పెంపొందించే సాధనాలుగా ఇవి మారాయి. చురుకైన చేతి-కంటి సమన్వయం, వేగవంతమైన స్పందనలు, సమస్యల పరిష్కార నైపుణ్యాలు -- ఇవన్నీ కొంతవరకు వీడియో గేమింగ్ ద్వారా అభివృద్ధి చెందుతాయన్న విషయం పరిశోధనల ద్వారా తేలింది. అంతేగాక, విద్యా రంగంలోనూ గేమ్‌ల వినియోగం పెరుగుతోంది. భౌతికశాస్త్రం, గణితం, చరిత్ర వంటి అంశాలను ఆకర్షణీయంగా బోధించడానికి ఉపయోగపడే విద్యా గేమ్‌లు ప్రస్తుతం మరింత ప్రాచుర్యంలోకి వచ్చాయి.

కళా రంగంలోనూ గేమ్‌లు విశేష ప్రభావం చూపుతున్నాయి. కథా నిర్మాణం, గ్రాఫిక్ డిజైన్, సౌండ్ ఇంజనీరింగ్ వంటి అంశాల సమన్వయంతో గేమ్‌లు కళాఖండాల్లా రూపుదిద్దు కుంటున్నాయి. అంతేగాక, వీడియో గేమ్ పరిశ్రమ ఈ యేటికి ప్రపంచ వ్యాప్తంగా దాదాపు 220 బిలియన్ డాలర్ల విలువైన ఆర్థిక వ్యవస్థగా మారిన సంగతి గణాంకాల ద్వారా వెల్లడవుతోంది. భారత దేశంలో గేమింగ్ రంగం వేగంగా అభివృద్ధి చెందుతూ, 2025 నాటికి 8 బిలియన్ డాలర్ల మార్కెట్‌ను అధిగమించ నున్నట్లు అంచనాలు ఉన్నాయి. వేలాది యువత గేమ్ డెవలప్‌మెంట్, డిజైన్, టెస్టింగ్ వంటి రంగాల్లో ఉపాధి పొందుతున్నారు.

అయితే వీడియో గేమింగ్ అతి ఎక్కువగా వినియోగించడం వల్ల శారీరక నిష్క్రియత, మానసిక ఒత్తిడి, సామాజిక ఒంటరితనం వంటి సమస్యలు ఎదురవుతాయి. ముఖ్యంగా చిన్న పిల్లలపై దీనివల్ల తక్షణ స్పందనల అలవాటు, గమన దోషాలు, హింసాత్మకత వంటి దుష్ప్రభావా లుండవచ్చన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. కాబట్టి గేమింగ్ వినియోగంలో సమయపాలన, నియంత్రణ, వయస్సుకు తగిన కంటెంట్ ఎంపిక - ఇవన్నీ అత్యంత అవసరమైన అంశాలు.

జూలై 8వ తేదీ ప్రతి సంవత్సరం వీడియో గేమ్‌ల సామర్థ్యాన్ని, ప్రజల్లో అవగాహన పెంచేలా, సమర్థవంతమైన వినియోగాన్ని ప్రోత్సహించేలా జరుపుకోవాలి. ఈ రోజున గేమింగ్ చరిత్రను పరిశీలించడం, ఇష్టమైన ఆటలను ఆడడం, కొత్త గేమ్‌లను ప్రయత్నించడం, గేమ్‌ల రూపకర్తలకు కృతజ్ఞతలు తెలిపేలా సోషల్ మీడియాలో భాగస్వామ్యం కావడం వంటి చర్యల ద్వారా దినోత్సవానికి అర్థవంతమైన రూపాన్ని ఇవ్వవచ్చు.

వీడియో గేమ్‌లు కేవలం కాలక్షేపానికి కాదు... అవి మానవ మేధస్సు ప్రతిభకు, సాంకేతిక విజయానికి ప్రతిరూపంగా నిలుస్తున్నాయి. అవి బాధ్యతాయుతంగా ఉపయోగించబడినపుడు విద్య, విజ్ఞానం, సృజన, సంపద -- అన్నింటికి మార్గదర్శిగా మారగలవు. జూలై 8 -- జాతీయ వీడియో గేమ్‌ల దినోత్సవం సందర్భంగా ఈ విషయాన్ని మనం మరోసారి గుర్తు చేసుకోవాలి.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494



# తగ్గిన బంగారం

**హైదరాబాద్, జులై 7 :** బంగారం కొనుగోలు చేయాలనుకునే వారికి శుభవార్త అందింది. అంతర్జాతీయ పరిస్థితుల ప్రభావంతో పసిడి ధరలు మంగళవారం తగ్గుముఖం పట్టాయి. వరుస రోజులుగా పెరుగుతున్న ధరలకు బ్రేక్ పడటంతో కొనుగోలుదారులకు కొంత ఊరట లభించింది.

హైదరాబాద్, విజయవాడ నగరాల్లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,45,260గా నమోదైంది. సోమవారం ధరతో పోలిస్తే రూ.1,360 తగ్గింది. అదే విధంగా 22 క్యారెట్ల 10 గ్రాముల ఆభరణాల బంగారం ధర రూ.1,33,150గా ఉండగా, నిన్నటితో పోలిస్తే రూ.1,250 మేర తగ్గుదల నమోదైంది. తెలంగాణలోని హైదరాబాద్, నిజామాబాద్, ఖమ్మం, వరంగల్ నగరాల్లో బంగారం ధరలు ఒకే స్థాయిలో కొనసాగుతున్నాయి. ఈ నగరాల్లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,45,260, 22 క్యారెట్ల ధర రూ.1,33,150, 18 క్యారెట్ల ధర రూ.1,08,940గా నమోదైంది. ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ, విశాఖపట్నం, గుంటూరు, నెల్లూరు, తిరుపతి నగరాల్లో కూడా ఇదే ధరలు కొనసాగుతున్నాయి. 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం రూ.1,45,260, 22 క్యారెట్ల బంగారం రూ.1,33,150, 18 క్యారెట్ల బంగారం రూ.1,08,940గా ఉంది. దేశంలోని ప్రధాన నగరాలను పరిశీలిస్తే చెన్నైలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర అత్యధికంగా రూ.1,46,180గా నమోదైంది. న్యూఢిల్లీలో రూ.1,45,410, అహ్మదాబాద్‌లో రూ.1,45,310, ముంబై, బెంగళూరు, కేరళ, కోల్‌కతాలో రూ.1,45,260గా కొనసాగుతోంది. అంతర్జాతీయ మార్కెట్‌లో బంగారం ధరల్లో వచ్చిన తగ్గుదల, పెట్టుబడిదారుల ధోరణిలో మార్పులు, ప్రపంచ ఆర్థిక పరిస్థితుల ప్రభావంతో దేశీయ మార్కెట్‌లో కూడా పసిడి ధరలు తగ్గినట్లు బులియన్ వ్యాపారులు చెబుతున్నారు. రానున్న రోజుల్లో అంతర్జాతీయ పరిణామాలను బట్టి బంగారం ధరల్లో మరిన్ని మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉందని మార్కెట్ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.



# ప్రపంచ కుబేరుడి సంపదకు భారీ దెబ్బ

**హైదరాబాద్, జూలై 7 :** ప్రపంచ కుబేరుడు, స్పేస్‌ఎక్స్ అధినేత ఎలాన్ మస్క్ సంపదకు ఇటీవల భారీ ఎదురుదెబ్బ తగిలింది. స్పేస్‌ఎక్స్ షేర్ల విలువ గణనీయంగా పడిపోవడంతో ఆయన మొత్తం ఆస్తి విలువ భారీగా తగ్గినట్లు అంతర్జాతీయ ఆర్థిక వర్గాలు పేర్కొంటున్నాయి. దీంతో ఆయన సంపద గతంతో పోలిస్తే గణనీయంగా క్షీణించింది. జూలై ప్రారంభం నుంచి స్పేస్‌ఎక్స్ షేర్ల ధరలు సుమారు 30 శాతం వరకు పడిపోవడంతో ఎలాన్ మస్క్ ఆస్తి విలువ కూడా భారీగా తగ్గింది. ఒక దశలో సుమారు 1.4 ట్రిలియన్ డాలర్లుగా అంచనా వేసిన సంపద ప్రస్తుతం 992 నుంచి 997 బిలియన్ డాలర్ల మధ్యకు చేరినట్లు సమాచారం. ఈ పరిణామంతో ఆయన ప్రపంచ ఆర్థిక వర్గాల్లో మరోసారి చర్చనీయాంశంగా మారారు. స్పేస్‌ఎక్స్ సంస్థ కృత్రిమ మేధస్సు రంగంలో విస్తరణ కోసం పెట్టుబడి సమీకరణ చర్యలు చేపట్టనున్నట్లు ప్రకటించడం కూడా మార్కెట్‌పై ప్రభావం చూపినట్లు విశ్లేషకులు భావిస్తున్నారు. పెట్టుబడిదారుల్లో అమ్మకాల ఒత్తిడి పెరగడంతో షేర్ల విలువ వరుసగా తగ్గుతూ వచ్చింది. ఒకప్పుడు గరిష్ఠ స్థాయిలో ఉన్న షేరు ధర ఇప్పుడు సుమారు 150 డాలర్ల పరిధికి చేరినట్లు తెలుస్తోంది. ఇదే సమయంలో టెస్లా కంపెనీ షేర్లు కూడా ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. జూన్ 23న ఒక్కరోజే టెస్లా షేరు విలువ దాదాపు ఆరు శాతం వరకు పడిపోయింది. టెస్లాలో కూడా ఎలాన్ మస్క్‌కు భారీ వాటా ఉండటంతో ఆ ప్రభావం ఆయన వ్యక్తిగత సంపదపై నేరుగా పడినట్లు మార్కెట్ నిపుణులు పేర్కొంటున్నారు. అంతర్జాతీయ మార్కెట్లలో చోటుచేసుకుంటున్న మార్పులు, పెట్టుబడిదారుల ధోరణి, సాంకేతిక రంగంలోని పరిణామాలు ప్రపంచ కుబేరుల సంపదపై ఎంత వేగంగా ప్రభావం చూపగలవో తాజా పరిణామాలు మరోసారి స్పష్టం చేస్తున్నాయి. ప్రస్తుతం మార్కెట్ పరిస్థితులు ఎలా మారుతాయనే అంశంపై ప్రపంచ ఆర్థిక వర్గాలు ఆసక్తిగా గమనిస్తున్నాయి.

# హైదరాబాద్‌కు నెస్లే రాక..

## కొత్త కేంద్రంతో ఉద్యోగాలకు ఊతం




**హైదరాబాద్, జులై 7 :** హైదరాబాద్ నగరానికి మరో అంతర్జాతీయ సంస్థ రానుంది. ప్రముఖ ఆహార ఉత్పత్తుల సంస్థ నెస్లే తన గ్లోబల్ సామర్థ్యాల కేంద్రాన్ని హైదరాబాద్‌లో ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించింది. నెస్లే బిజినెస్ సర్వీసెస్ ఇండియా ఈ నిర్ణయాన్ని వెల్లడించగా, ఈ ఏడాదిలోనే కొత్త కేంద్రం కార్యకలాపాలు ప్రారంభం కానున్నాయి. ప్రపంచవ్యాప్తంగా సంస్థ నిర్వహిస్తున్న వ్యాపార సేవలను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు ఈ కేంద్రం కీలక పాత్ర పోషించనుంది. హైదరాబాద్‌లో ఐటీ, డిజిటల్ సేవల రంగం వేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో నెస్లే పెట్టుబడి ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ కేంద్రాన్ని నెస్లే బిజినెస్ సర్వీసెస్ ఇండియా, జెన్‌ప్యాక్ట్ సంస్థతో కలిసి ఏర్పాటు చేయనుంది. ప్రక్రియల విశ్లేషణ, డేటా ఆధారిత సేవలు, కృత్రిమ మేధస్సు, స్వయంచాలక వ్యవస్థల వినియోగంతో వ్యాపార సేవలను మరింత వేగవంతంగా, సమర్థవంతంగా అందించేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. ఈ భాగస్వామ్యం ద్వారా ప్రపంచవ్యాప్తంగా నెస్లే నిర్వహించే కార్యకలాపాల్లో డిజిటల్ సామర్థ్యాలను మరింత బలోపేతం చేయనున్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగంతో వినియోగదారులకు మెరుగైన సేవలు అందించడంతో పాటు వ్యాపార నిర్వహణలో కొత్త ఆవిష్కరణలకు కూడా ఈ కేంద్రం దోహదపడనుంది. హైదరాబాద్‌ను ఎంపిక చేయడానికి ఇక్కడి బలమైన సాంకేతిక వాతావరణం, ఆధునిక మౌలిక సదుపాయాలు, నైపుణ్యం కలిగిన మానవ వనరులు ప్రధాన కారణాలని సంస్థ ప్రతినిధులు తెలిపారు. నెస్లే బిజినెస్ సర్వీసెస్ అధిపతి లూకా ఫిచెరా మాట్లాడుతూ, హైదరాబాద్ ఇప్పటికే ప్రపంచ స్థాయి వ్యాపార సేవలకు కేంద్రంగా ఎదిగిందని, ఇక్కడి ప్రతిభావంతులైన యువత సంస్థ భవిష్యత్ వృద్ధికి కీలకంగా మారుతారని పేర్కొన్నారు. నెస్లే కేంద్రం ఏర్పాటుతో నగరంలో కొత్త ఉద్యోగ అవకాశాలు పెరిగే అవకాశం ఉందని పరిశ్రమ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. ఇప్పటికే అనేక అంతర్జాతీయ సంస్థలకు కేంద్రంగా ఉన్న హైదరాబాద్, మరో ప్రముఖ సంస్థ రాకతో ప్రపంచ ఐటీ, వ్యాపార సేవల రంగంలో తన స్థానాన్ని మరింత బలపరుచుకోనుంది. రాష్ట్రంలో పెట్టుబడులు, ఉపాధి అవకాశాలు పెరగడానికి కూడా ఈ నిర్ణయం తోడ్పడుతుందని విశ్లేషకులు భావిస్తున్నారు.

# అమెరికా నుంచి వంటగ్యాస్ దిగుమతులు పెంపు




**న్యూఢిల్లీ, జులై 7 :** మధ్యప్రాచ్యంలో నెలకొన్న భౌగోళిక ఉద్రిక్తతల నేపథ్యంలో భారతదేశం వంటగ్యాస్ దిగుమతుల వ్యూహాన్ని మార్చుకుంటోంది. చాలా కాలంగా గల్ఫ్ దేశాలపై ఆధారపడుతున్న భారత్, ప్రస్తుతం అమెరికా నుంచి భారీ స్థాయిలో వంటగ్యాస్‌ను దిగుమతి చేసుకుంటోంది. హార్ముజ్ జలసంధిలో ఏర్పడిన అంతరాయాల కారణంగా గల్ఫ్ దేశాల నుంచి సరఫరా మందగించడంతో అమెరికా కీలక ప్రత్యామ్నాయంగా మారింది. ఒకప్పుడు భారత వంటగ్యాస్ దిగుమతుల్లో అమెరికా వాటా 8 శాతం కంటే తక్కువగా ఉండగా, ఇప్పుడు అది 65 శాతానికి పైగా చేరినట్లు సమాచారం. యుద్ధ ప్రభావంతో ముడి చమురు కంటే వంటగ్యాస్ సరఫరానే ప్రధాన సవాలుగా మారింది. దేశంలో గ్యాస్ కొరత తలెత్తకుండా ప్రభుత్వ రంగ చమురు సంస్థలు ప్రత్యామ్నాయ దేశాల నుంచి దిగుమతులను వేగవంతం చేస్తున్నాయి. ఇప్పటికే కుదిరిన ఒప్పందాల ప్రకారం ఈ ఏడాది దేశ అవసరాల్లో కొంత భాగాన్ని అమెరికా నుంచే దిగుమతి చేసుకునేలా చర్యలు చేపట్టాయి. గల్ఫ్ దేశాల నుంచి రవాణా అంతరాయం ఏర్పడటంతో అమెరికా ఎగుమతులు గణనీయంగా పెరిగాయి. అంతర్జాతీయ ఇంధన గణాంకాల ప్రకారం, ఫిబ్రవరితో పోలిస్తే జూన్ నాటికి అమెరికా నుంచి భారత్‌కు వంటగ్యాస్ సరఫరా 145 శాతం పెరిగింది. అదే సమయంలో యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, సౌదీ అరేబియా, ఖతార్ వంటి దేశాల నుంచి దిగుమతులు గణనీయంగా తగ్గాయి. గతంలో ప్రధాన సరఫరాదారుగా ఉన్న గల్ఫ్ దేశాల స్థానంలో ప్రస్తుతం అమెరికా కీలక భాగస్వామిగా నిలిచింది. దీంతో భారత్–అమెరికా మధ్య ఇంధన వాణిజ్య సంబంధాలు మరింత బలపడుతున్నాయి. భవిష్యత్తులో ఇంధన భద్రతను దృష్టిలో పెట్టుకుని కేంద్ర ప్రభుత్వం వ్యూహాత్మక నిల్వలను కూడా పెంచాలని నిర్ణయించింది. ప్రస్తుతం ఉన్న నిల్వలకు అదనంగా మరో 30 రోజుల అవసరానికి సరిపడా వంటగ్యాస్ నిల్వలను ఏర్పాటు చేయాలని చమురు సంస్థలకు సూచించింది. అలాగే అమెరికాతో పాటు అర్జెంటీనా, నైజీరియా, మలేషియా, అల్జీరియా వంటి దేశాల నుంచి కూడా దిగుమతులను పెంచే దిశగా చర్యలు తీసుకుంటోంది. ఒకే దేశంపై అధికంగా ఆధారపడకుండా, పలు దేశాల నుంచి సరఫరా మార్గాలను విస్తరించడం ద్వారా భవిష్యత్తులో ఇంధన సంక్షోభాలను ఎదుర్కొనే సామర్థ్యాన్ని పెంచుకోవడమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యంగా ఉంది. ఈ చర్యలతో దేశీయ వినియోగదారులకు వంటగ్యాస్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడటంతో పాటు, ఇంధన భద్రతను మరింత బలోపేతం చేయాలని ప్రభుత్వం భావిస్తోంది.

# ధరలు పెంచిన ట్రయంఫ్ బైక్‌లు

**న్యూఢిల్లీ, జులై 7 :** ప్రీమియం ద్విచక్ర వాహన తయారీ సంస్థ ట్రయంఫ్ మరోసారి తన 350 సీసీ శ్రేణి బైక్‌ల ధరలను పెంచింది. ఏప్రిల్‌లో ఈ శ్రేణిని మార్కెట్‌లోకి తీసుకొచ్చిన తర్వాత జూన్‌లో ఒకసారి ధరలు సవరించిన సంస్థ, నెల రోజుల వ్యవధిలోనే మరోసారి రేట్లను పెంచింది. దీంతో కొత్త బైక్ కొనుగోలు చేయాలనుకునే వినియోగదారులపై అదనపు భారం పడనుంది. కొత్త ధరలు ఇప్పటికే అమల్లోకి వచ్చాయి. ఈసారి ధరల పెంపు 1.22 శాతం నుంచి 5.03 శాతం వరకు ఉంది. ప్రారంభంలో పన్ను రాయితీ ప్రయోజనాలను వినియోగదారులకు అందించాలనే ఉద్దేశంతో ధరలను తక్కువ స్థాయిలో ఉంచిన సంస్థ, ఇప్పుడు అన్ని మోడళ్లపై ధరలను సవరించింది. దీంతో ట్రయంఫ్ 350 సీసీ శ్రేణి బైక్‌ల కొనుగోలు ఖర్చు మరింత పెరిగింది. అన్ని మోడళ్లలో స్పీడ్ టీ4 ధరనే అత్యధికంగా పెరిగింది. ఈ మోడల్‌పై రూ.10 వేల పెంపు ప్రకటించడంతో ధర రూ.1.99 లక్షల నుంచి రూ.2.09 లక్షలకు చేరుకుంది. విడుదల సమయంలో ఉన్న ధరతో పోలిస్తే ఇప్పుడు మొత్తం రూ.14 వేల వరకు పెరిగింది. స్పీడ్ 400 ధర కూడా రూ.6 వేల పెరిగి రూ.2.34 లక్షల నుంచి రూ.2.40 లక్షలకు చేరుకుంది. ట్రాకర్ 400పై అత్యల్పంగా రూ.3 వేల ధర పెంపు జరిగింది. దీంతో దీని ధర రూ.2.46 లక్షల నుంచి రూ.2.49 లక్షలకు చేరుకుంది. స్క్రాంబ్లర్ 400 ఎక్స్ ధర రూ.2.59 లక్షల నుంచి రూ.2.65 లక్షలకు పెరిగింది. త్రక్స్టన్ 400 ధర రూ.2.70 లక్షల నుంచి రూ.2.75 లక్షలకు చేరుకోగా, స్క్రాంబ్లర్ 400 ఎక్స్‌సీపై రూ.5 వేల పెంపుతో కొత్త ధర రూ.2.99 లక్షలుగా నిర్ణయించారు. ట్రయంఫ్ ప్రపంచవ్యాప్తంగా ప్రీమియం మోటార్‌సైకిళ్ల తయారీలో ప్రత్యేక గుర్తింపు పొందిన సంస్థ. స్పోర్ట్స్, అడ్వెంచర్, క్లాసిక్ శ్రేణి బైక్‌లతో వినియోగదారులను ఆకట్టుకుంటున్న ఈ సంస్థ భారత్‌లో ప్రముఖ ద్విచక్ర వాహన తయారీ సంస్థతో భాగస్వామ్యం చేసి తన బైక్‌లను తయారు చేస్తోంది. స్పీడ్ 400, స్క్రాంబ్లర్ 400 ఎక్స్ వంటి మోడళ్లకు దేశీయ మార్కెట్‌లో మంచి ఆదరణ లభిస్తుండగా, తాజా ధరల పెంపు కొనుగోలుదారులపై అదనపు ఆర్థిక భారం మోపనుంది.





# నథింగ్ ఫోన్ 4బి లాంచ్

## అత్యంత తక్కువ ధరకే!

**న్యూఢిల్లీ, జులై 7 :** ప్రముఖ సాంకేతిక ఉత్పత్తుల తయారీ సంస్థ నథింగ్ భారతీయ వినియోగదారుల కోసం మరో కొత్త స్మార్ట్‌ఫోన్‌ను ఆవిష్కరించేందుకు సిద్ధమైంది. నేడు మధ్యాహ్నం నిర్వహించనున్న ప్రత్యేక కార్యక్రమంలో సంస్థ తన కొత్త 'ఫోన్ 4బి'ను అధికారికంగా విడుదల చేయనుంది. ఇదే కార్యక్రమంలో కొత్త వైర్‌లెస్ ఇయర్‌బడ్స్‌ను కూడా పరిచయం చేయనున్నట్లు సంస్థ వెల్లడించింది. తక్కువ ధరలో మెరుగైన సౌకర్యాలతో వినియోగదారులను ఆకట్టుకునే లక్ష్యంతో రూపొందించిన ఈ కొత్త ఫోన్‌పై ఇప్పటికే భారీ ఆసక్తి నెలకొంది. ప్రస్తుతం అందుబాటులో ఉన్న మోడళ్లతో పోలిస్తే మరింత సరసమైన ధరలో ఈ ఫోన్ మార్కెట్‌లోకి రానుందని అంచనా వేస్తున్నారు. ముఖ్యంగా యువతను దృష్టిలో ఉంచుకుని ఆకర్షణీయమైన రూపకల్పనతో పాటు ఆధునిక సాంకేతికతను ఇందులో అందించనున్నట్లు సమాచారం. ఈ ఫోన్‌లో శక్తివంతమైన ప్రాసెసర్‌తో పాటు కృత్రిమ మేధస్సు ఆధారిత సదుపాయాలకు మద్దతు ఉండనుంది. ఆరు దశాంశ ఏడు అంగుళాల పూర్తి స్పష్టత కలిగిన అమోలెడ్ తెర, నూట ఇరవై హెర్ట్జ్ రిఫ్రెష్ రేటు, ఎనిమిది జీబీ వరకు జ్ఞాపకశక్తి, రెండు వందల యాభై ఆరు జీబీ వరకు నిల్వ సామర్థ్యంతో ఈ ఫోన్ అందుబాటులోకి రానున్నట్లు తెలుస్తోంది. తాజా ఆండ్రాయిడ్ ఆధారిత నిర్వహణ వ్యవస్థతో ఇది పనిచేయనుంది. భారీ సామర్థ్యం కలిగిన బ్యాటరీతో పాటు వేగవంతమైన చార్జింగ్ సదుపాయాన్ని కూడా ఇందులో అందించనున్నారు. బ్యాటరీ సామర్థ్యంపై భిన్నమైన ప్రచారం జరుగుతున్నప్పటికీ, అధికారిక వివరాలు విడుదల కార్యక్రమంలోనే వెల్లడికానున్నాయి. ఒకసారి పూర్తిగా చార్జ్ చేస్తే ఎక్కువసేపు ఉపయోగించుకునేలా దీనిని రూపొందించినట్లు సమాచారం. నథింగ్ సంస్థకు ప్రత్యేక గుర్తింపుగా నిలిచిన పారదర్శక వెనుక భాగం రూపకల్పనను ఈ ఫోన్‌లో కూడా కొనసాగించారు. వెనుక భాగంలో ప్రత్యేక కాంతి వ్యవస్థను అమర్చినట్లు తెలుస్తోంది. రెండు కెమెరాల అమరికతో పాటు ఆకర్షణీయమైన రూపాన్ని కలిగి ఉండనున్న ఈ ఫోన్‌కు క్రికెట్ అభిమానులను దృష్టిలో పెట్టుకుని ప్రత్యేక సంచికను కూడా తీసుకురావచ్చనే ప్రచారం సాగుతోంది. అయితే దీనిపై అధికారిక ప్రకటన మాత్రం ఇంకా వెలువడాల్సి ఉంది.

# ‘సర్పంచ్ సాబ్’ సత్తాకు పరీక్ష




- ఆ స్టార్స్ రాణించకుంటే అంతే సంగతులు!
- భారత్, ఇంగ్లండ్ మధ్య మూడో టీ20
- భారత జట్టులో కీలక మార్పులు

భారత్, ఇంగ్లండ్ మధ్య జరుగుతున్న ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో ఈరోజు రాత్రి మూడో టీ20 జరగనుంది. ఈ మ్యాచ్‌కు ముందు భారత జట్టులో కీలక మార్పులు చోటుచేసుకునే అవకాశాలు ఉన్నాయి. తొలి రెండు మ్యాచ్‌ల్లో ఆశించిన ఫలితాలు రాకపోవడంతో.. టీమ్ మేనేజ్‌మెంట్ కూర్పులో కొన్ని మార్పులు చేయాలని భావిస్తున్నట్లు సమాచారం. యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ ఎంట్రీతో వికెట్ కీపర్ బ్యాటర్ సంజు శాంసన్‌కు మరోసారి నిరాశ తప్పదు. ఓపెనర్లుగా అభిషేక్ శర్మ, వైభవ్ సూర్యవంశీ జోడీ కొనసాగనుంది. రెండో టీ20లో వైభవ్ తన అరంగేట్ర మ్యాచ్‌లో దూకుడు బ్యాటింగ్‌తో ఆకట్టుకోవడంతో టీమ్ మేనేజ్‌మెంట్ అతడిపై విశ్వాసం ఉంచింది. దీంతో సంజు శాంసన్‌కు తుది జట్టులో చోటు దక్కే అవకాశాలు లేవు. బుడ్డోడి నుంచి మేనేజ్‌మెంట్ భారీ ఇన్నింగ్స్ ఆశిస్తోంది. ఇషాన్ కిషన్, శ్రేయాస్ అయ్యర్, తిలక వర్మలు బ్యాట్ ఝులిపించాల్సిన అవసరం ఉంది. అలానే శివమ్ దూబే కూడా కీలక పరుగులు చేయాలని ఫాన్స్ కోరుకుంటున్నారు. బౌలింగ్ విభాగంలో కూడా మార్పులు జరగనున్నాయి. స్పిన్నర్ రవి బిష్ణోయ్‌ను తప్పించి యువ పేసర్ ప్రిన్స్ యాదవ్‌ను తిరిగి తుది జట్టులోకి తీసుకునే అవకాశాలు ఉన్నాయి. పేస్ దళంలో యాదవ్‌తో పాటు అర్ష్‌దీప్ సింగ్, హర్షిత్ రాణాలు కొనసాగనున్నారు. స్పిన్ విభాగంలో అక్షర్ పటేల్, వరుణ్ చక్రవర్తి జోడీ కొనసాగనుంది. ముఖ్యంగా వరుణ్ ఇటీవల అద్భుత ఫామ్‌లో లేకపోవడం భారత జట్టుకు మైనస్ అయింది. తన వైవిధ్యమైన స్పిన్‌తో ప్రత్యర్థి బ్యాటర్లను ఇబ్బంది పెడితే టీమిండియాకు తిరుగుండదు. ఈ మ్యాచ్ భారత కెప్టెన్ శ్రేయస్ అయ్యర్‌కు కూడా ఎంతో కీలకంగా మారింది. సిరీస్‌లో ఇంకా విజయాన్ని నమోదు చేయని భారత్‌కు మూడో టీ20 ‘డూ ఆర్ డై’ మ్యాచ్‌లా మారింది. ఈ మ్యాచ్‌లో గెలిస్తేనే సిరీస్‌లో నిలబడే అవకాశం ఉంటుంది. ఈ నేపథ్యంలో ‘సర్పంచ్ సాబ్’ కెప్టెన్సీ సత్తాకు పరీక్షగా నిలవనుంది. అలానే స్టార్ రాణించకుంటే.. ఈ మ్యాచ్ ఫలితంపై ప్రభావం చూపనుంది. యువ ఆటగాళ్లతో కూడిన జట్టు ఒత్తిడిని అధిగమించి విజయాన్ని అందుకోవాలని భారత అభిమానులు ఆశిస్తున్నారు.

# వైభవ్ కాదు.. శాంసన్‌పై వేటుకు ఆ చిచ్చరపిడుగే కారణం!



స్వదేశంలో ముగిసిన టీ20 ప్రపంచకప్‌లో భారత్‌ను గెలిపించిన సంజూ శాంసన్ అనూహ్యంగా ఇప్పుడు స్క్వాడ్‌లో లేడు. మూడు మ్యాచుల్లో విఫలమయ్యాడని అతడిని జింబాబ్వే పర్యటనకు తప్పించారు. అయితే.. యువసంచలనం వైభవ్ సూర్యవంశీ కోసమే శాంసన్‌ను పక్కనపెట్టేశారనే ప్రచారం జరుగుతోంది. కానీ, ఆసియా క్రీడల స్క్వాడ్‌లో భాగమైన సంజూను జింబాబ్వే సిరీస్‌కు తీసుకోకపోవడానికి కారణం వైభవ్ కాదని, ఐపీఎల్‌లో దంచేస్తున్నచిచ్చరపిడుగు అని సెలెక్టర్లు చెప్పినట్టు క్రిక్‌ఇన్ఫో కథనం పేర్కొంది. ఐర్లాండ్ చేతిలో వైట్‌వాష్, ఇంగ్లండ్ చేతిలో పరాజయంతో భారత సెలెక్టర్లు టీ20 స్క్వాడ్‌లో భారీ మార్పులు చేశారు. జింబాబ్వే పర్యటనకు పలువురిని పక్కనపెట్టి.. ఐపీఎల్‌లో, దేశవాళీ క్రికెట్‌లో రాణించిన వాళ్లను ఎంపిక చేశారు. ఓపెనర్‌గా విఫలమవుతున్న సంజూ శాంసన్‌పై వేటు వేశారు. దాంతో, వైభవ్ సూర్యవంశీ కోసమే సంజూను తప్పించారనే విమర్శలు వెల్లువెత్తాయి. అయితే.. అందరూ అనుకుంటున్నట్టు వైభవ్ కోసం సంజూను పక్కనపెట్టలేదని.. టీ20ల్లో చితక్కొడుతున్న ప్రభ్‌సిమ్రన్ సింగ్‌కు అవకాశం ఇవ్వాలనే ఈ నిర్ణయం తీసుకున్నట్టు సెలెక్టర్లు చెప్పారని క్రిక్‌ఇన్ఫో కథనం వెల్లడించింది. ‘సొంతగడ్డపై జరిగిన పొట్టి వరల్డ్‌కప్‌లో విధ్వంసక ఇన్నింగ్స్‌లు ఆడిన సంజూ శాంసన్ టీ20 స్క్వాడ్‌లో భాగమే. సెప్టెంబర్‌లో జపాన్ వేదికగా మొదలయ్యే ఆసియా క్రీడల స్క్వాడ్‌లోనూ శాంసన్ ఉన్నాడు. అయితే.. జింబాబ్వే పర్యటనకు పెద్దగా ప్రాధాన్యం లేనందునే అతడిని ఎంపిక చేయలేదు. చిన్న సిరీస్‌కు ఇద్దరు సీనియర్ వికెట్ల కీపర్లు ఇషాన్ కిషన్, సంజూలను ఎంపిక చేయడం సరైంది కాదనిపించింది. ఐపీఎల్‌లో పంజాబ్ కింగ్స్ తరఫున గత రెండు సీజన్లలో ప్రభ్‌సిమ్రన్ సింగ్ మెరుగైన ప్రదర్శన చేస్తున్నాడు. అందుకని వికెట్ కీపర్, బ్యాటరైన అతడికి అవకాశం ఇవ్వాలనుకున్నాం’ అని అజిత్ అగార్కర్ నేతృత్వంలోని సెలెక్టర్ల బృందం పేర్కొన్నట్టు క్రిక్‌ఇన్ఫో తెలిపింది. జింబాబ్వే సిరీస్ కోసం సోమవారం శ్రేయాస్ అయ్యర్ సారథిగా 15 మందితో కూడిన స్క్వాడ్‌ను ప్రకటించిన విషయం తెలిసిందే. జింబాబ్వేతో టీ20 సిరీస్ కోసం భారత సెలెక్టర్లు స్క్వాడ్‌లో కీలక మార్పులు చేశారు. ఇంగ్లండ్ పర్యటనకు ఎంపికైన వారిలో సగం మందిని తప్పించి కొత్త వాళ్లకు ప్రాధాన్యమిచ్చారు. ఐర్లాండ్‌పై తేలిపోయిన ఓపెనర్ సంజూ శాంసన్‌పై వేటు పడగా.. ఓపెనర్‌గా వైభవ్ సూర్యవంశీకి మరో అవకాశం దక్కింది. అలానే వికెట్ కీపర్‌గా ప్రభ్‌సిమ్రన్ సింగ్ ఎంపికవ్వగా.. మిడిలార్డర్ బ్యాటర్‌గా సూర్యాన్ష్ షెడ్గే, ఫినిషర్‌గా రింకూ సింగ్‌ను తీసుకున్నారు. ఐపీఎల్ 19వ సీజన్‌లో మెరిసిన ప్రిన్స్ యాదవ్, అశోక్ శర్మ, హర్ష్ దూబే, మయాంక్ యాదవ్‌లో బౌలింగ్ దళంలో చోటు దక్కించుకున్నారు. భారత్, జింబాబ్వే మధ్య జూలై 23 నుంచి హరారేలో టీ20 సిరీస్ మొదలవ్వనుంది. ఈ సిరీస్‌తో ప్రభ్‌సిమ్రన్ అంతర్జాతీయ టీ20ల్లో అరంగేట్రం చేయనున్నాడు.

# ఎల్లీస్ పెర్రీ..

- మరోసారి అద్భుత ప్రదర్శన చేసిన ఎల్లీస్ పెర్రీ
- 7 మ్యాచ్‌లలో 198 పరుగులు, 4 వికెట్స్
- క్రికెట్ చరిత్రలోనే అత్యుత్తమ ఆల్‌రౌండర్

■ మహిళల క్రికెట్‌కు చిరునామా.. ■ చరిత్రలోనే గొప్ప ఆల్‌రౌండర్!




ఆస్ట్రేలియా మహిళల క్రికెట్ స్టార్ ఎల్లీస్ పెర్రీ మరోసారి తన అద్భుత ఆటతో ప్రపంచ క్రికెట్ అభిమానుల ప్రశంసలు అందుకుంటోంది. మహిళల టీ20 ప్రపంచ కప్‌లో ఈ ఆసీస్ అందం 7 మ్యాచ్‌లలో 198 పరుగులు చేయడమే కాకుండా 4 వికెట్లు పడగొట్టింది. మెగా టోర్నమెంట్‌లో బ్యాట్, బాల్ రెండింటితోనూ అద్భుతంగా రాణించింది. బ్యాటింగ్‌లో49.50 సగటు, 132.88 స్ట్రైక్ రేట్‌ను నమోదు చేసింది. బౌలింగ్‌లో 7.50 సగటును కొనసాగించింది. ఆసీస్ పొట్టి కప్ గెలవడంలో పెర్రీ తన వంతు పాత్ర పోషించింది. బ్యాట్‌తో పరుగులు, బంతితో వికెట్లు, కీలక మ్యాచ్‌ల్లో అద్భుత ప్రదర్శనలతో ఎల్లీస్ పెర్రీ మహిళల క్రికెట్ చరిత్రలోనే అత్యుత్తమ ఆల్‌రౌండర్లలో ఒకరిగా గుర్తింపు పొందింది. ఇప్పటికే తొమ్మిది ఐసీసీ ట్రోఫీలు గెలుచుకున్న ఆమె.. ఆస్ట్రేలియా విజయాల్లో కీలక పాత్ర పోషిస్తూ సరికొత్త చరిత్రలు సృష్టిస్తోంది. పెర్రీ కెరీర్‌లో మరో విశేషం ఏమిటంటే.. ఆమె కేవలం క్రికెటర్ మాత్రమే కాదు, ఫుట్‌బాలర్ కూడా. ఆస్ట్రేలియా తరఫున అంతర్జాతీయ స్థాయిలో క్రికెట్‌తో పాటు ఫుట్‌బాల్ కూడా ఆడిన అరుదైన క్రీడాకారిణి. రెండు క్రీడల్లోనూ దేశానికి ప్రాతినిధ్యం వహించిన ఆమె బహుముఖ ప్రజ్ఞకు ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలు లభించాయి. టీ20 అంతర్జాతీయ క్రికెట్‌లో 1,000కిపైగా పరుగులు చేయడంతో పాటు 100కిపైగా వికెట్లు తీసిన తొలి మహిళా క్రికెటర్ కూడా ఎల్లీస్ పెర్రీనే. బ్యాటింగ్, బౌలింగ్ రెండింట్లోనూ రాణిస్తూ మహిళల క్రికెట్‌లో కొత్త ప్రమాణాలు నెలకొల్పింది. అందుకే ఆమె ప్రపంచ క్రికెట్‌లో గొప్ప ఆల్‌రౌండర్ అయింది. టెస్టు క్రికెట్‌లోనూ పెర్రీ రికార్డులు సృష్టించింది. ఆస్ట్రేలియా మహిళా క్రికెటర్‌గా అజేయంగా 213 పరుగులు చేసి అత్యధిక వ్యక్తిగత స్కోరు నమోదు చేసిన ఆటగాడిగా నిలిచింది. వ్యక్తిగత విజయాలతో పాటు జట్టు విజయాల్లోనూ ఎల్లీస్ పెర్రీ కీలక పాత్ర పోషించింది. ఆమె ఖాతాలో ఇప్పటికే 9 ఐసీసీ ట్రోఫీలు ఉన్నాయి. అలాగే రెండుసార్లు ఉమెన్స్ బిగ్ బాష్ లీగ్ టైటిల్, ఒకసారి ఉమెన్స్ ప్రీమియర్ లీగ్ టైటిల్‌ను కూడా గెలుచుకుంది. అంతేకాదు ఐసీసీ మహిళా క్రికెటర్ ఆఫ్ ది డికేడ్ అవార్డును సొంతం చేసుకుని తన గొప్పతనాన్ని మరోసారి నిరూపించింది. దాదాపు రెండు దశాబ్దాలుగా నిలకడగా ఆడుతున్న పెర్రీ.. ప్రపంచవ్యాప్తంగా యువ క్రికెటర్లకు ఆదర్శంగా నిలుస్తోంది. ఆమె సాధించిన విజయాలు, నెలకొల్పిన రికార్డులు మహిళల క్రికెట్ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయి.




# ర్యాంకింగ్స్ టాప్‌లో ఇండియన్ ప్లేయర్

అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ తాజాగా విడుదల చేసిన మహిళా టీ20 ఆటగాళ్ల ర్యాంకింగ్స్‌లో భారీ మార్పులు చోటుచేసుకున్నాయి. ఇటీవల ముగిసిన మహిళా టీ20 వరల్డ్ కప్ 2026లో అద్భుత ప్రదర్శన చేసిన ఆస్ట్రేలియా ఓపెనర్ బెత్ మూనీ మళ్లీ నంబర్-1 బ్యాటర్‌గా అవతరించింది. ఆమె తన కెరీర్‌లో ఈ ఘనత సాధించడం ఇది ఐదోసారి. వరల్డ్ కప్‌లో ‘ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్’ అవార్డును గెలుచుకున్న మూనీ, ఫైనల్‌లో ఇంగ్లాండ్‌పై 64 పరుగుల మ్యాచ్ విన్నింగ్ ఇన్నింగ్స్ ఆడి అగ్రస్థానానికి చేరుకుంది. ఈ టోర్నమెంట్ ఫైనల్‌లో ఇంగ్లాండ్‌ను ఓడించి ఆస్ట్రేలియా ఏడోసారి ప్రపంచకప్ టైటిల్‌ను కైవసం చేసుకుంది. బ్యాటింగ్ ర్యాంకింగ్స్ టాప్-10 జాబితాలో ముగ్గురు భారతీయ ఆటగాళ్లకు చోటు దక్కింది. భారత స్టార్ ఓపెనర్ స్మృతి మంధాన ఐదో స్థానంలో కొనసాగుతుండగా, షెఫాలీ వర్మ ఆరో స్థానంలో, కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ పదో స్థానంలో నిలిచారు. సౌతాఫ్రికాకు చెందిన లారా వోల్వార్డ్ మూడో స్థానంలో, వెస్టిండీస్ ఆల్ రౌండర్ హేలీ మాథ్యూస్ నాలుగో స్థానంలో ఉన్నారు. బౌలింగ్ విభాగంలో భారత్‌కు చెందిన యువ స్పిన్నర్ శ్రీ చరణి సరికొత్త రికార్డు సృష్టించి T20I బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో నంబర్-1 స్థానాన్ని కైవసం చేసుకుంది. వరల్డ్ కప్‌లో కేవలం ఐదు మ్యాచ్‌ల్లోనే 14 వికెట్లు పడగొట్టి టోర్నమెంట్‌లో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా నిలిచింది. ఐసీసీ ప్రకటించిన ‘టీమ్ ఆఫ్ ది టోర్నమెంట్’ లో చోటు దక్కించుకున్న ఏకైక భారతీయ ఆటగాడిగా ఆమె నిలిచింది. బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో ఇంగ్లాండ్‌కు చెందిన సోఫీ ఎక్లెస్టోన్ రెండో స్థానంలో, చార్లీ డీన్ మూడో స్థానంలో నిలిచారు. ఇక ఆల్‌రౌండర్ల జాబితాలో వెస్టిండీస్ ఆటగాడు హేలీ మాథ్యూస్ తన నంబర్-1 స్థానాన్ని నిలబెట్టుకుంది.

# గౌతమ్ గంభీర్‌కు బిగ్ షాక్..

## టీమిండియాకు కొత్త హెడ్ కోచ్ వచ్చేశారు.

భారత క్రికెట్ నియంత్రణ మండలి జింబాబ్వే పర్యటనకు వెళ్లే 15 మంది సభ్యుల భారత జట్టును ప్రకటించిన తర్వాత.. తాజాగా టీమ్ కోచింగ్ స్టాఫ్‌కు సంబంధించిన ఒక కీలక అప్‌డేట్ వెలుగులోకి వచ్చింది. జింబాబ్వే పర్యటనకు ప్రస్తుత ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ వెళ్లడం లేదు. ఆయన స్థానంలో టీమిండియా మాజీ క్రికెటర్, ప్రస్తుతం ‘సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్’ అధిపతిగా ఉన్న వీవీఎస్ లక్ష్మణ్ తాత్కాలిక హెడ్ కోచ్‌గా బాధ్యతలు వహించనున్నారు.

### బిజీ షెడ్యూల్ వల్లే ఈ నిర్ణయం..

భారత జట్టు రాబోయే రోజుల్లో వరుస అంతర్జాతీయ సిరీస్‌లతో బిజీగా ఉండటమే ఇందుకు ప్రధాన కారణం. ప్రస్తుతం గౌతమ్ గంభీర్ భారత జట్టుతో కలిసి ఇంగ్లాండ్ పర్యటనలో ఉన్నారు. ఈ సిరీస్ ముగిసిన కొద్ది రోజులకే జూలై 23 నుంచి జింబాబ్వే పర్యటన ప్రారంభం కానుంది. గంభీర్‌కు విశ్రాంతినిస్తూ, పనిభారాన్ని తగ్గించేందుకు గానూ ఈ పర్యటన బాధ్యతలను లక్ష్మణ్‌కు అప్పగించారు.

జింబాబ్వే పర్యటనతో పాటు ఈ ఏడాది సెప్టెంబర్ 19 నుంచి అక్టోబర్ 4 వరకు జపాన్‌లో జరిగే ఏషియన్ గేమ్స్ 2026 లో కూడా భారత జట్టుకు లక్ష్మణ్ హెడ్ కోచ్‌గా వ్యవహరిస్తారు. అదే సమయంలో వెస్టిండీస్ జట్టు భారత్‌లో పర్యటించనుంది. రెండు సిరీస్‌లు ఒకేసారి జరగడం వల్ల గంభీర్ సీనియర్ జట్టుతో కలిసి వెస్టిండీస్ సిరీస్‌లో ఉంటారు, లక్ష్మణ్ ఏషియన్ గేమ్స్ జట్టును నడిపిస్తారు.

### సపోర్ట్ స్టాఫ్‌లో మరికొంతమంది..

వీవీఎస్ లక్ష్మణ్‌తో పాటు సపోర్ట్ స్టాఫ్‌లో మరో ఇద్దరు మాజీ భారత ఆటగాళ్లకు చోటు లభించింది. మాజీ క్రికెటర్ కనిత్కర్ బ్యాటింగ్ కోచ్‌గా, మాజీ స్పిన్నర్ సునీల్ జోషి బౌలింగ్ కోచ్‌గా బాధ్యతలు నిర్వహించనున్నారు. ఈ కోచింగ్ త్రయం జింబాబ్వే సిరీస్, ఏషియన్ గేమ్స్ తర్వాత బంగ్లాదేశ్‌తో జరిగే పరిమిత ఓవర్ల సిరీస్‌లోనూ కొనసాగే అవకాశం ఉంది. గౌతమ్ గంభీర్ కోచింగ్ లో టీమిండియా ఛాంపియన్స్ ట్రోఫీ 2025, టీ20 వరల్డ్ కప్ 2026 వంటి పెద్ద టోర్నీలను గెలిచినప్పటికీ, ఇటీవల ఐర్లాండ్ మరియు ఇంగ్లాండ్ చేతుల్లో ఎదురైన పరాజయాల నేపథ్యంలో రాబోయే సిరీస్‌లు భారత జట్టుకు ఎంతో కీలకంగా మారాయి.



# డిఫరెంట్ లుక్‌లో డ్రాగన్.. ఎన్టీఆర్




ఎన్టీఆర్, సంచలన దర్శకుడు ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న మోస్ట్ అవైటెడ్ మూవీ డ్రాగన్ . ఈ సినిమాలోని తన పాత్ర కోసం తారక్ ఎన్నడూ లేని విధంగా భారీగా బరువు తగ్గారు. ఆ మధ్య బయటకు వచ్చిన తారక్ అల్ట్రా స్లిమ్ మేకోవర్ చూసి అభిమానులు ఒకింత షాక్‌కు గురయ్యారు. ఒక సినిమా కోసం ఇంతలా బరువు తగ్గాలా అని కంగారు పడుతూ, తమ హీరో లుక్ చూసి అభిమానులతో పాటు సగటు సినీ ప్రేక్షకులు కూడా తీవ్ర ఆందోళన చెందారు. అయితే, ఎన్టీఆర్ బర్త్‌డే కానుకగా విడుదలైన 'డ్రాగన్' గ్లింప్స్ చూసి ఫ్యాన్స్ పిచ్చెక్కిపోయినప్పటికీ, ఆ లుక్ వెనుక ఉన్న తారక్ కష్టం వారిని ఇబ్బంది పెడుతూనే వచ్చింది. ఇందులో 'లూగర్' అనే పవర్‌ఫుల్ క్యారెక్టర్ లుక్ కోసం ఎన్టీఆర్ తన ప్రాణం పెట్టి పనిచేశారు. సినిమా కోసం, తను నమ్మిన పాత్ర కోసం తారక్ ఎంతటి రిస్క్ అయినా తీసుకోగలడు, ఏ స్థాయికైనా వెళ్లగలడు అని తన అంకితభావంతో మరోసారి నిరూపించారు. క్యారెక్టర్‌లోని ఇంటెన్సిటీ చూశాక ప్రశాంత్ నీల్ బాక్సాఫీస్ వద్ద ఎలాంటి విధ్వంసం సృష్టించబోతున్నాడో అని అందరిలో ఆసక్తి రెట్టింపయింది. అభిమానుల్లో ఉన్న ఆ టెన్షన్‌ను పటాపంచలు చేస్తూ జూలై 6న సోషల్ మీడియాలో ఒక క్రేజీ అప్‌డేట్ వచ్చింది. అక్కినేని అఖిల్ నటిస్తున్న 'లెనిన్' మూవీ కోసం ఎన్టీఆర్ వాయిస్ ఓవర్ ఇచ్చారు. ఈ విషయాన్ని పంచుకుంటూ అఖిల్ తన సోషల్ మీడియాలో తారక్‌తో దిగిన లేటెస్ట్ ఫొటోలను షేర్ చేశారు. ఆ ఫొటోలు చూసిన అభిమానులు ఒక్కసారిగా హమ్మయ్య అంటూ ఊపిరి పీల్చుకున్నారు. ఎన్టీఆర్ ఇప్పటికీ స్లిమ్‌గానే ఉన్నప్పటికీ, మునపటి కంటే ఎంతో ఫ్రెష్‌గా, గ్లోయింగ్‌గా, స్టైలిష్‌గా కనిపిస్తుండడంతో నెట్టింట కామెంట్ల వర్షం కురుస్తోంది. ఈ సరికొత్త లుక్ చూసి కుదుటపడిన ఫ్యాన్స్, ఇక 'డ్రాగన్' సినిమాలో తారక్ విశ్వరూపం ఎలా ఉండబోతుందో అని ఈగర్‌గా వెయిట్ చేస్తున్నారు. ప్రశాంత్ నీల్ సినిమాలో ఊరమాస్, హై-వోల్టేజ్ యాక్షన్ రోల్ తర్వాత.. త్రివిక్రమ్ మైథాలజికల్ సినిమాలో ఎన్టీఆర్ ఎలా కనిపిస్తారు? అక్కడ తన మేకోవర్ ఎలా ఉండబోతోంది? అనే ఆసక్తి అప్పుడే టాలీవుడ్ వర్గాల్లో మొదలైంది.

# ఇక నుంచి అలాంటి సినిమాలే చేస్తా

## కాజల్ అగర్వాల్

స్టార్ హీరోయిన్ కాజల్ అగర్వాల్ మాతృత్వం తర్వాత తనలో వచ్చిన మార్పులను ఆసక్తికరంగా పంచుకున్నారు. ప్రస్తుతం 'ది ఇండియా స్టోరీ', 'రామాయణ' చిత్రాల విడుదలకు సిద్ధమవుతున్న సందర్భంగా మీడియాతో మాట్లాడిన ఆమె.. ఇకపై కథల ఎంపికలో మరింత జాగ్రత్తగా వ్యవహరిస్తానని తెలిపారు. కొడుకు నీల్ పుట్టిన తర్వాత ప్రతి కథను అతడి కోణంలోనే ఆలోచిస్తున్నానని కాజల్ చెప్పారు. భవిష్యత్తులో తన తల్లి మంచి సినిమాలు చేసిందని కొడుకు గర్వంగా చెప్పుకునేలా ఉండే కథలనే ఎంపిక చేయాలని నిర్ణయించుకున్నట్లు వెల్లడించారు. అందుకే నటనకు ప్రాధాన్యం ఉన్న, మంచి సందేశం ఇచ్చే సినిమాలకే ప్రాధాన్యం ఇస్తున్నానన్నారు. 'రామాయణ'లో మండోదరి పాత్ర పోషిస్తున్నానని చెప్పగానే నీల్ ఎంతో ఆనందపడ్డాడని కాజల్ తెలిపారు. అతడికి రామాయణ కథలు, ముఖ్యంగా రావణుడి పాత్ర అంటే చాలా ఇష్టమని చెప్పారు. ఈ సినిమా రెండో భాగం విడుదలయ్యే సమయానికి నీల్ థియేటర్‌లో చూసే తొలి చిత్రం ఇదేనని పేర్కొన్నారు. 'ది ఇండియా స్టోరీ' గురించి మాట్లాడుతూ.. కల్తీ ఆహారం, పురుగుల మందుల వల్ల కలిగే ప్రమాదాలను ఈ చిత్రం చూపిస్తుందని చెప్పారు. ఈ సినిమా కోసం చేసిన అధ్యయనం తన వ్యక్తిగత జీవితంపైనా ప్రభావం చూపిందని, కుటుంబ సభ్యుల ఆహారపు అలవాట్ల విషయంలో ఇప్పుడు మరింత జాగ్రత్తగా వ్యవహరిస్తున్నానని కాజల్ వెల్లడించారు.



# నా అండాలు దాచేసుకున్నా

## నటి కృతి సనన్ సంచలన విషయం వెల్లడి

గ్లామర్ ఇండస్ట్రీలో సక్సెస్ వేవ్‌ను రైడ్ చేయడం ఒక ఎత్తయితే, పర్సనల్ లైఫ్‌ను బ్యాలెన్స్ చేయడం మరో ఎత్తు. ముఖ్యంగా ముప్పై ఏళ్లు దాటుతున్నాయంటే చాలు.. సొసైటీ నుంచి వచ్చే ప్రెజర్, పెళ్లి - పిల్లల డెడ్‌లైన్స్ హీరోయిన్లను కాస్త టెన్షన్ పెడుతుంటాయి. కానీ ఆ రూల్స్ అన్నిటికీ చెక్ పెడుతూ బాలీవుడ్ మోస్ట్ హ్యాపెనింగ్ బ్యూటీ కృతి సనన్ ఒక సంచలన విషయాన్ని తీసుకుంది. తాను కెరీర్ ఫుల్ పీక్స్‌లో ఉన్నప్పుడే 'ఎగ్ ఫ్రీజింగ్' చేయించుకున్నానంటూ బోల్డ్ స్టేట్‌మెంట్ ఇచ్చింది. ఇటీవల 'హ్యూమన్స్ ఆఫ్ బాంబే' పాడ్‌కాస్ట్‌లో హోస్ట్ కరిష్మాతో మాట్లాడిన కృతి ఈ విషయాన్ని బయటపెట్టింది. కృతిసనన్ తనకు నేషనల్ అవార్డు తెచ్చిపెట్టిన 'మిమి' సినిమా షూటింగ్ టైమ్‌లోనే ఈ డెసిషన్ తీసుకున్నట్లు చెప్పింది. ఈ సినిమాలోని క్యారెక్టర్ కోసం చాలా బరువు పెరగాల్సి వచ్చిందట. దాంతో ఆ టైమ్‌లోనే ఎగ్ ఫ్రీజింగ్ ప్రాసెస్ కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్టు తెలిపింది. ఈ పక్రియ వల్ల బాడీలో హార్మోనల్ చేంజెస్ వచ్చి శరీరం కాస్త ఉబ్బడం కామన్. ఎలాగూ సినిమా కోసం వెయిట్ గేన్ అవ్వాలి కాబట్టి ఆ రెండు నెలల బ్రేక్‌ను పర్ఫెక్ట్‌గా వాడుకుంటూ సైలెంట్‌గా ఈ మెడికల్ ప్రొసీజర్‌ను ఫినిష్ చేసినట్లు కృతిసనన్ తెలిపింది.ఆ సమయంలో మూడ్ స్వింగ్స్, ఫిజికల్ అండ్ ఎమోషనల్ చేంజెస్ ఫేస్ చేశానని కృతి చాలా ఓపెన్‌గా ఒప్పుకుంది. ఒక ప్రెగ్నెంట్ ఉమెన్ ఎలాంటి రోలర్ కోస్టర్ రైడ్‌ను ఎక్స్ పీరియన్స్ చేస్తుందో, తాను కూడా దాదాపు అలాంటి ఒడిదుడుకులే చూశానని.. కానీ ఇప్పుడు మాత్రం మైండ్ చాలా పీస్‌ఫుల్‌గా ఉ ందంటూ హ్యాపీగా చెప్పుకొచ్చింది. నిజానికి ఇండియన్ స్క్రీన్ పై ఈ మోడ్రన్ బాట పట్టిన ఫస్ట్ సెలబ్రిటీ కృతి కాదు. గ్లోబల్ ఐకాన్ ప్రియాంక చోప్రా తన థర్టీస్ స్టార్టింగ్‌లోనే ఎగ్స్ ఫ్రీజ్ చేసుకోగా.. ప్రొడ్యూసర్ ఏక్తా కపూర్, మోనా సింగ్, రిచా చద్దా వంటి వారు కూడా ఇదే రూట్ ఎంచుకున్నారు. మరి కృతి సనన్ ఈ విషయాన్ని బయట పెట్టిన తర్వాత ఇంకెంతమంది ఈ బాట పడతారో చూడాలి.



# సత్లుజ్ మూవీని చూడాలి..చూపించాలి

## ఎక్స్ వేదికగా దర్శకుడు రమ్‌గోపాల్ వర్మ



ప్రస్తుతం దేశవ్యాప్తంగా చర్చకు దారి తీసిన చిత్రం 'సత్లుజ్'. సెన్సార్ సమస్యల కారణంగా నేరుగా ఓటీటీలో విడుదల చేయగా.. ఆ తర్వాత దాన్ని తొలగించారు. ఈ మూవీని చూసిన దర్శకుడు రామ్‌గోపాల్ వర్మ ఎక్స్ వేదికగా తన అభిప్రాయాన్ని పంచుకున్నారు. 'సత్లుజ్' మూవీ చూశా. ఇది సినిమా కాదు. ఎప్పటికీ నయం కానీ బలమైన గాయం. మన చరిత్రలోని చీకటి అధ్యాయాన్ని గుర్తు చేస్తుంది. దిల్జిత్ దొసాంజే గుండెలు బాదుకునేలా నటించలేదు. మనఃసాక్షికి అనుగుణంగా ఎంతో నిశ్శబ్దంగా చేసుకుంటూ వెళ్లాడు. అర్జున్ రామ్‌పాల్ నటన అదనపు బలాన్ని ఇచ్చింది. నేరాల్లో వ్యవస్థలు భాగమైన తీరును వాస్తవికతతో చూపించారు. ఈ సినిమాను సంచలనం చేయడం కన్నా.. ఒక ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్‌గా తీర్చిదిద్దారు. తెరపై అధికారిక ఫైళ్లు, దహన సంస్కారాల వివరాలు, గుసగుస సంభాషణలు వంటివి ఈ కథలోని తీవ్రతను తెలియజేశాయి. స్వలాభం కన్నా.. సత్యాన్ని వెల్లడించేలా తీర్చిదిద్దడంతో ఇది మరింత బలంగా తెరపై ఆవిష్కృతమైందని రామ్ అన్నారు. ప్రజాస్వామ్యం తన పౌరులనే కబళించి, అందుకు సాక్ష్యాలు లేకుండా ఎలా తుడిచేస్తుందో సినిమాలో తెలియజేయడం సాధారణ విషయం కాదు. ఈ విషయంలో చిత్ర బృందం తనవంతు బాధ్యతను చక్కగా పూర్తి చేసింది. ఇదే నిజమైన కళ. ఇది నిజంగా అత్యంత ధైర్యవంతమైన ఫిల్మ్ మేకింగ్. ఈ సినిమా చాలా మందిని కలవరపెడుతుంది.. అవగాహన కల్పిస్తుంది.. ఎక్కువ ప్రభావం చూపిస్తుంది. సత్యం, నిజాయతీని సినిమా మాధ్యమం ద్వారా చెప్పినప్పుడు అది 'సత్లుజ్' అవుతుంది. ఇలాంటి సినిమాను చూడాలి. చూపించాలి. చర్చించాలి. కానీ, సినిమాలో బాధితులను చేసినట్లు ఎన్‌కౌంటర్ చేయకూడదు. అధికారంలో ఉన్న వారందరికీ నా విన్నపం ఏంటంటే.. 'సత్లుజ్'లో జస్వంత్ సింగ్ ఖల్రా'ను చేసినట్లు ఈ సినిమాను చేయకండి. నిజాన్ని దాచాలనుకుంటే అది మరింత దృఢంగా మారుతుందని వర్మ అన్నారు.

# హైదరాబాద్‌లో శరవేగంగా చిరు మూవీ షూట్

చిరంజీవి హీరోగా బాబీ దర్శకత్వంలో ఓ చిత్రం రూపొందుతోన్న విషయం తెలిసిందే. మెగా158 వర్కింగ్ టైటిల్ గా ప్రచారంలో ఉన్న దీనిపై టీమ్ అప్‌డేట్ పంచుకుంది. షూటింగ్ హైదరాబాద్‌లో శరవేగంగా జరుగుతోందని తెలిపింది. మునుపెన్నడూ చూడని భారీ యాక్షన్ సన్నివేశాలు ఉంటాయని.. చిరును కొత్త కోణంలో చూస్తారని వెల్లడించింది. రామ్-లక్ష్మణ్ మాస్టర్స్ సారథ్యంలో భారీ యాక్షన్ సన్నివేశాలు షూట్ చేస్తున్నారు. సినిమాకు ఈ సీన్స్ హైలైట్‌గా నిలవనున్నాయి. చిరు ఇందులో రిస్క్‌తో కూడిన స్టంట్స్ చేస్తున్నారని.. త్వరలో దీని టైటిల్ టీజర్‌ను విడుదల చేయనున్నట్లు టీమ్ వెల్లడించింది. 'వాల్తేర్ వీరయ్య' విజయం తర్వాత చిరంజీవి - బాబీ కాంబోలో ఈ చిత్రం రానుండడంతో అంచనాలు నెలకొన్నాయి. ఇటీవలే పొల్లాచ్చిలో ఓ కీలక షెడ్యూల్‌ని పూర్తి చేసుకుంది. అక్కడ కొంత టాకీతో పాటు కొన్ని యాక్షన్ సీక్వెన్స్ కూడా తీసినట్లు ప్రచార చిత్రాన్ని కూడా విడుదల చేశారు.




This newspaper is Owned and Published by **MOHAMMED IMRAN** from H.No. 5-2-109, Osmanpura, Jagitial, Telangana, 505327. Edited by **MOHAMMED IMRAN** and Printed by MAHEERA PRINTERS at H.No.5-2-110, Near Goremiya Chowrastha, Osmanpura, Jagitial Dist. Jagitial ,Telangana-505327. **RNI REGD NO. TELTEL/2006/16536**. Contact No.+91 9848999998, editor@churakalu.com